www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

## 65 రోజులు.. 74 మ్యాచ్‌లు..

11

ఐపీఎల్-2025 షెడ్యూల్ విడుదల

మార్చి 22న లీగ్ షురూ.. మే 25న ఫైనల్


తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 11 మ్యాచ్‌లు

ఉప్పల్‌లో తొమ్మిది, విశాఖపట్నంలో రెండు



సోమవారం | 17-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 320 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: పంచమి తె. 4.54 తదుపరి షష్ఠి; నక్షత్రం: చిత్త పూర్తి; వర్జ్యం: మ.1.32-3.20, దుర్ముహూర్తం: మ.12.52-1.38, మ.3.10-3.56, అమృతఘడియలు: రా.12.21-2.10, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.44, సూర్యాస్తమయం: 6.14 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




మాజీ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ నాయుడు రచించిన 'లైఫ్ ఆఫ్ ఎ కర్మయోగి' పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్

# అధికారులూ.. తప్పు!

ఒక్క తప్పు చేయమంటే.. 3 తప్పులు చేద్దామనే అధికారులను చూస్తున్నా

సమాజానికి ఇది మంచిది కాదు.. ఐఏఎస్ అధికారులు మంచి, చెడు చెప్పాలి

వారి పనితీరుపై ఏమాత్రం సంతృప్తిగా లేను.. ఏసీ గదులకే పరిమితం అవుతున్నారు

ప్రజల వద్దకు వెళ్తేనే సమస్యలు తెలుస్తాయి.. మాజీ ఐఏఎస్ పుస్తకావిష్కరణలో సీఎం

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారుల వ్యవహార శైలిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారులు మంచీ చెడులపై సలహా చెప్పేవిధంగా ఉండాలని, రాజకీయ నేతలు ఇస్తున్న ఆదేశాల్లో తప్పొప్పులను ఎత్తి చూపాలని అన్నారు. కానీ, నేటి అధికారుల్లో ఈ వైఖరి కరువైందని, ఒక తప్పు చేయమంటే.. మూడు తప్పులు చేద్దామనే అధికారులను చూస్తున్నానని వ్యాఖ్యానించారు. సమాజానికి ఇది మంచిది కాదన్నారు. ఆదివారం మాజీ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణనాయుడు రచించిన 'లైఫ్ ఆఫ్ ఎ కర్మయోగి' పుస్తకాన్ని సీఎం రేవంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత అధికారుల వ్యవహారశైలి పట్ల తాను ఏమాత్రం సంతోషంగా లేనన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఏసీ గదుల నుంచి బయటకు రావడం మానేశారని, ఏసీ అనేది జబ్బేమోననిపిస్తోందని అన్నారు. అధికారులు ప్రజల వద్దకు వెళ్లినప్పుడే ప్రజా సమస్యలు అర్థమవుతాయని, ఆఫీసుల్లో కూర్చుంటే ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ప్రారంభమైన తన రాజకీయ పయనంలో చాలావరకు ప్రతిపక్షంలోనే ఉన్నానని, అప్పట్లో జిల్లా కలెక్టర్లు మారుమూల ప్రాంతాల్లో పర్యటించి ఆయా గ్రామాల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేవారని తెలిపారు. ఇప్పటికీ తాను గ్రామాలకు వెళ్లినప్పుడు.. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం తమ గ్రామానికి వచ్చిన కలెక్టర్ గురించి అక్కడి ప్రజలు గుర్తు చేస్తుంటారని చెప్పారు. దీనిని బట్టి నాటి అధికారులు ప్రజలతో

మిగతా 13వ పేజీలో...

## గద్దర్ అవార్డులకు 10 కోట్లు!

2025-26 బడ్జెట్‌లో ప్రతిపాదన

సమాచార శాఖ, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లపై డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష

13

# ఇసుక రీచ్‌లలో.. ఇష్టారాజ్యం!

ఆర్డర్ కాపీలు లేకున్నా లారీల్లో లోడింగ్.. ఒక్కో లారీలో 50 టన్నులకు పైనే..

లారీకి రూ.50 వేల వరకు వసూలు

రీచ్‌ల్లోని లోడింగ్ కాంట్రాక్టర్లే సూత్రధారులు

లారీలను ఓఆర్ఆర్ చేర్చే బాధ్యత కూడా వారిదే

విజిలెన్స్, ఆర్టీఏ, పోలీసు కనుసన్నల్లోనే తతంగం

బీఆర్ఎస్ హయాం నుంచి కొనసాగుతున్న దందా

ఆన్‌లైన్‌లో చూపని రీచ్‌ల్లోనూ విక్రయాలు

'శివన్నగూడెం' వెళ్లాల్సిన ఇసుక హైదరాబాద్‌కు

లారీల జీపీఎస్‌ను కార్లకు అమర్చి తప్పుదోవ

కొన్ని చోట్ల సన్న ఇసుక పేరిట అదనపు వసూళ్లు



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని తాడిచర్ల బ్లాక్-2 గోపాల్‌పూర్ ఇసుక రీచ్.. సాధారణంగా ఇక్కడ ఎవరైనా లారీ యజమాని ఇసుక నింపుకోవాలంటే వెబ్‌సైట్‌లో బుక్ చేసుకుని.. డబ్బు చెల్లించి ఆర్డర్ కాపీ (ఓఆర్‌డీ) తీసుకోవాలి. కానీ, ఈ రీచ్‌లో లోడింగ్ కాంట్రాక్టర్లదే ఇష్టారాజ్యం. ఎలాంటి ఓఆర్‌డీలు లేకుండానే ప్రతి రోజూ రాత్రి 200 లారీల్లో ఇసుక నింపుతారు. ఒక్కో లారీకి రూ.50వేల వరకు తీసుకుంటారు. హైదరాబాద్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుకు చేరే దాకా తమదే బాధ్యత అని భరోసా ఇస్తారు. ఏకకాలంలో బయలుదేరే ఈ వాహనాలు ఉదయం 9గంటల కల్లా ఔటర్‌కు చేరుతాయి. భారీ ఓవర్‌లోడ్‌తో వెళ్లే లారీలను ఆయా జిల్లాల్లోని ఆర్టీఏ, మైనింగ్ విజిలెన్స్ పోలీసులు.. ఇలా ఏ అధికారి కూడా ఆపే ధైర్యం చేయరంటే అక్రమ దందా ఏ తీరులో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఒకసారి రాజధానికి చేరుకుని, ఇసుక అడ్డాపై లారీని నిలిపాక.. ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేయకపోవడం.. వారికి బాగా కలిసొస్తుంది. ఇదంతా ఈ ఒక్క రీచ్‌లో జరుగుతున్నది కాదు.. పెద్దపల్లి జిల్లాలోని తాడిచెర్ల బ్లాక్-1, తాడిచెర్ల బ్లాక్-2లోని ఖమ్మంపల్లి, ఉటూరు, చల్లూరుతోపాటు ములుగు జిల్లాలోని బోరె నర్సాపూర్ ఇసుక రీచ్‌ల్లో ఇలాంటి అక్రమాలు నిత్యకృత్యంగా సాగుతున్నాయి. ఉదాహరణకు ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 12గంటలకు టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ఇసుక కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమైంది. అందులో పెద్దపల్లి జిల్లా తాడిచర్ల బ్లాక్-2లోని గోపాల్‌పూర్ ఇసుక రీచ్‌లో 33 లారీల్లో నింపాల్సిన 1,110 క్యూబిక్ మీటర్ల ఇసుకను ఆన్‌లైన్‌లో పెట్టారు. కానీ, క్షేత్ర స్థాయిలో లోడింగ్‌కు వందకు పైగా లారీలు బారులు తీరినట్లు అక్కడికి లోడింగ్‌కు వెళ్లిన ఓ లారీ డ్రైవర్ 'ఆంధ్రజ్యోతి ప్రతినిధికి' ఫోన్ చేసి వివరించారు. ఓఆర్‌డీలు లేని వాహనాలకు కూడా లోడింగ్ చేస్తున్నారని వాపోయారు. ఇసుకను లోడింగ్ చేసుకోవడానికి గురువారం అర్ధరాత్రే తాను ఇసుక రీచ్‌కు చేరుకోగా.. శుక్రవారం సాయంత్రానికి లోడింగ్ పూర్తయిందని తెలిపారు. ఈ విధంగా రోజువారీగా టీఎస్ఎండీసీలో బుకింగ్ చేసే లారీలకు.. ఇసుక రీచ్‌ల్లో లోడింగ్ చేసే వాహనాలకు భారీగా వ్యత్యాసం ఉంటుంది. 12టైర్ల లారీలో 26 టన్నులు, 14టైర్ల లారీలో 32టన్నులు, 16టైర్ల లారీకి 35టన్నులు మాత్రమే ఇసుక లోడింగ్ చేయాల్సి ఉండగా.. ఇష్టానుసారం ఒక్కో లారీలో సామర్థ్యానికి మించి 50 టన్నులకుపైగా

మిగతా 14వ పేజీలో...



మల్టీ లెవల్ మార్కెటింగ్ పేరుతో

## 850 కోట్ల మోసం

పెట్టుబడికి 45 రోజుల్లో 22% లాభమని ప్రచారం

6,979 మంది నుంచి రూ.1700 కోట్ల సేకరణ

సగం చెల్లింపు.. మిగతా సగం ఎగ్గొట్టిన నిర్వాహకులు

'ఫాల్కన్ ఇన్వాయిస్'కు చెందిన ఇద్దరి అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మీ పెట్టుబడికి అధిక రాబడి అంటూ మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసానికి పాల్పడి పెట్టుబడిదారులకు రూ.850 కోట్ల మేర ఎగ్గొటిన ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ ప్లాట్‌ఫామ్‌కు చెందిన ఇద్దరిని సైబరాబాద్ ఆర్థిక నేర విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేశారు. క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు, ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ ప్లాట్‌ఫామ్ బిజినెస్ హెడ్ పవన్ కుమార్ ఒడేల, క్యాపిటల్ ప్రొటెక్షన్

మిగతా 14వ పేజీలో...

# హైటెక్ కోర్టు!



అధునాతన సౌకర్యాలతో నభూతోః అనిపించేలా

నిర్మాణం కానున్న నూతన హైకోర్టు భవన సముదాయం

రూ.2,583 కోట్ల వ్యయంతో 100 ఎకరాల్లో 10 బ్లాకులు

36.52 లక్షల చదరపు అడుగుల్లో నిర్మాణం

ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ నమూనాలో ప్రవేశ ద్వారం

8.4 లక్షల చ.అడుగుల్లో.. 6 అంతస్తుల్లో ప్రధాన కోర్టు భవనం

అడ్వొకేట్ జనరల్ బ్లాక్ కూడా 6 అంతస్తుల్లోనే..

35,530 చ.అడుగుల్లో ప్రధాన న్యాయమూర్తి బంగ్లా

63మంది జడ్జిల కోసం 2.67లక్షల చ.అడుగుల్లో క్వార్టర్లు

జడ్జిల స్టాఫ్ కోసం 96,500 చ.అడుగుల్లో నివాసాల ఏర్పాటు

ఒకేసారి 2,800 కార్లు నిలిపేలా పార్కింగ్ సదుపాయం

పచ్చదనానికి ప్రాధాన్యం.. కోర్టు చుట్టూ మొక్కలు

మొత్తంగా 3 డిజైన్లు.. 'ఆంధ్రజ్యోతి' వద్ద ప్రాథమిక నమూనా



హైకోర్టు నూతన భవన సముదాయం కోసం ప్రతిపాదించిన డిజైన్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు నూతన భవన సముదాయం అత్యంత విశాలంగా, అధునాతనమైన సౌకర్యాలతో చరిత్రలో నిలిచిపోయే విధంగా, భవిష్యత్తు తరాలు అబ్బురపడే రీతిలో నిర్మాణం కానుంది. హైకోర్టు భవన నిర్మాణం తాలూకు ప్రాథమిక నమూనా ఇప్పటికే సిద్ధమైంది. దీని ప్రకారం నిర్మాణం సాకారమైతే గనక నభూతోః అనిపించేలా హైకోర్టు భవన సముదాయం కళ్లకు కట్టనుంది! రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన 100 ఎకరాల్లో హైకోర్టు

మిగతా 13వ పేజీలో...

వాహన ఫిట్‌నెస్..

## ఇక ఆటోమేటిక్

రవాణా శాఖకు త్వరలో 14 ఆటోమేటిక్ ఫిట్‌నెస్ సెంటర్లు

జిల్లాల్లో 10.. హైదరాబాద్‌లో 4.. ప్రతిపాదనలు సిద్ధం

ప్రస్తుతం మాన్యువల్‌గా వాహనాల తనిఖీ.. పారదర్శకత లేకపోవడంతో యథేచ్ఛగా ఫిట్‌నెస్ పత్రాల జారీ

ప్రమాదాల బారిన వాహనాలు.. ఏటీఎస్‌తో పరిష్కారం



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖకు 14 ఆటోమేటిక్ ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్లు(ఏటీఎస్) రానున్నాయి. ప్రస్తుతం వాహనాలను రవాణాశాఖ అధికారులు మాన్యువల్‌గా పరిశీలన జరిపి, ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నారు. ఈ విధానంలో పారదర్శకత లేకపోవడం.. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఉన్న వాహనాలు కూడా ప్రమాదాల బారిన పడుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తుండడంతో.. ప్రభుత్వం ఏటీఎస్ వైపు మొగ్గుచూపుతోంది. ఏటీఎస్‌లలో కార్లు మొదలు.. భారీ వాహనాల వరకు వేగంగా పరీక్షలు నిర్వహించే అవకాశాలుంటాయి. రోజుకు సగటున 40 వాహనాలకు పరీక్షలు నిర్వహించవచ్చు. ఉమ్మడి జిల్లాల్లో.. ఒక్కోటి చొప్పున 10, హైదరాబాద్‌లో 4 ఏటీఎస్

మిగతా 14వ పేజీలో...



తొలి తెలుగు మహిళా నిర్మాత

## కృష్ణవేణి కన్నుమూత

తొలి తరం నటి, గాయని, స్టూడియో అధినేతగా ముద్ర

'మనదేశం'తో ఎన్టీఆర్‌ను వెండితెరకు తెచ్చిన ఖ్యాతి

10





కిటకిటలాడుతున్న ముషీరాబాద్ చేపల మార్కెట్

## బాబోయ్ చికెన్.. కొయ్యవోయి మటన్!

బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో వెలవెలబోయిన చికెన్ షాపులు

గ్రేటర్‌లో గతంతో పోలిస్తే సగానికి తగ్గిన అమ్మకాలు

ఆదివారం కిటకిటలాడిన మటన్ షాపులు, ఫిష్ మార్కెట్లు

రూ.100-150 మేర ధర పెంచి అమ్ముతున్న నిర్వాహకులు

ముషీరాబాద్ చేపల మార్కెట్లో ఆదివారం రెట్టింపు అమ్మకాలు

మార్కెట్‌కు భారీగా రొయ్యలు.. మధ్యాహ్నానికే సరుకు ఖతం

హైదరాబాద్ సిటీ/ముషీరాబాద్/కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సండే వచ్చేసింది. మరి.. ప్రతివారం మాదిరిగానే చికెన్ తిందామా? ఏమో.. కోళ్లకు బర్డ్‌ఫ్లూ అంటున్నారు.. చికెన్ తింటే ఏమవుతుందో ఏమో! ప్చ్.. ముక్కలేనిదే ముద్ద దిగదు కదా.. ఏం చేయాలి? తప్పదు.. పిరం అయినా సరే, మటనో, చేపలో కొనుక్కొని రావాలి. ఇప్పుడు మాంసాహార ప్రియుల నాడి ఇదే! ఆదివారం పొద్దంతా గ్రేటర్ హైదరాబాద్‌లో మునుపెన్నడూలేని విధంగా చికెన్ సెంటర్లు వెలవెలబోయాయి. మటన్ షాపులు, చేపల మార్కెట్లు కిటకిటలాడాయి. కిలో చికెన్ తెచ్చి.. వండుకొని రెండు పూటలా ఇష్టంగా తినే సామాన్య

మిగతా 14వ పేజీలో...

అమెరికా అండ లేకుంటే.. ఉక్రెయిన్

## మనుగడ కష్టమే!



ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్య

ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రకు మరో వారం రోజుల్లో మూడేళ్లు పూర్తి

18% భూభాగం కోల్పోయిన ఉక్రెయిన్

రష్యా భూభాగంలో కొంత మేర ఆక్రమణ

అమెరికా, యూరప్ దేశాల మద్దతుతో మూడేళ్లుగా రష్యా సేనలకు ముప్పుతిప్పలు

ట్రంప్ అధ్యక్షుడయ్యాక మారిన పరిస్థితి

'సాయం' అందించాలంటే ఉక్రెయిన్‌లోని సగం ఖనిజ నిక్షేపాలు రాసివ్వాలని షరతు

ట్రంప్‌పై ఆశలు పెట్టుకోలేమన్న జెలెన్‌స్కీ

'ఆర్మీ ఆఫ్ యూరప్' ఏర్పాటుకు పిలుపు

"అమెరికా అండ లేకపోతే.. రష్యా దాడులను ఎదుర్కొని ఉక్రెయిన్ మనుగడ సాగించే అవకాశాలు చాలా తక్కువ. బహుశా అది చాలా చాలా చాలా కష్టం"

..పిచుక మీద బ్రహ్మాస్త్రంలా తమ దేశం మీద దండయాత్రకు దిగిన అంత పెద్ద రష్యానూ మూడేళ్లుగా నిలువరించి వీరోచిత పోరాటం చేస్తున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీ తాజాగా చేసిన వ్యాఖ్యలివి! అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి అధికార పగ్గాలు అందుకున్న ట్రంప్.. పుతిన్‌కు ఫోన్ చేసి గంటన్నర సేపు మాట్లాడిన తర్వాత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన స్వరంలో కనిపించిన నిర్వేదం ఇది!! ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రకటించి వచ్చే

మిగతా 2వ పేజీలో...



అమెరికా యుద్ధ విమానంలో భారతీయ అక్రమ వలసదారులు

## మళ్లీ సంకెళ్లతోనే..

తీరు మార్చుకోని అమెరికా.. మలి విడతలోనూ 228 మంది భారతీయులకు సంకెళ్లు వేసి వెనక్కి పంపిన అగ్రరాజ్యం

తలపాగా కట్టుకోవడానికీ అనుమతించలేదన్న సిక్కు వలసదారులు

తీవ్రంగా ఖండించిన శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ

**భారత్‌లో ఓటింగ్ పెంపునకు కేటాయించిన 182 కోట్ల రద్దు: డోజ్**

చండీగఢ్, ఫిబ్రవరి 16: సరైన పత్రాలు లేకుండా అక్రమంగా అమెరికాకు వెళ్లిన 228 మంది భారతీయులను తాజాగా ఆ దేశం వెనక్కి పంపింది. శని, ఆదివారాల్లో రెండు విడతలుగా అమెరికా సైనిక విమానాల్లో వీరిని భారత్‌కు తీసుకొచ్చారు. పంజాబ్‌లోని అమృత్‌సర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ విమానాలు ల్యాండ్ అయ్యాయి. తమ చేతులకు సంకెళ్లు వేసి, కాళ్లను గొలుసులతో బంధించి తీసుకువచ్చారని భారతీయ వలసదారులు వాపోయారు. విమానంలో ప్రయాణ సమయమంతా తమను ఇలాగే ఉంచారని, అమృత్‌సర్‌లో విమానం దిగిన తర్వాతనే సంకెళ్లు, గొలుసులు తొలగించారని చెప్పారు. తొలి విడతలో అమెరికా వెనక్కి పంపిన

మిగతా 2వ పేజీలో...

## భారత్‌లో ఓటింగ్ పెంపునకు అమెరికా కేటాయించిన రూ.182 కోట్లు రద్దు

» ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగం నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: భారత్‌లో ఓటింగ్ శాతం పెంచడానికి ఉద్దేశించిన రూ.182 కోట్ల సాయాన్ని రద్దు చేస్తున్నట్లు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) ప్రకటించింది. అమెరికాలోని పన్ను చెల్లింపుదారులు కట్టే సొమ్మును వివిధ దేశాల కోసం ఖర్చు పెడుతున్నారని, వాటన్నింటినీ నిలిపివేస్తున్నట్లు తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఆదివారం చేసిన పోస్టులో తెలిపింది. అలాగే బంగ్లాదేశ్‌లో రాజకీయ స్థిరత్వాన్ని బలోపేతం చేయడానికి కేటాయించిన రూ.215 కోట్లు, మొజాంబిక్ రూ.86 కోట్లు, నేపాల్ రూ.338 కోట్లు, లైబీరియా రూ.13 కోట్లు, మాలి రూ.121 కోట్లతో పాటు అనేక దేశాలకు కేటాయించిన సాయాన్ని కూడా డోజ్ రద్దు చేసింది. డోజ్ తాజా నిర్ణయంపై బీజేపీ నేత అమిత్ మాలవీయ స్పందించారు. 'దేశంలో ఓటర్ల శాతం పెంచేందుకు 21మిలియన్ డాలర్లా? ఇది భారతదేశ ఎన్నికల ప్రక్రియలో బాహ్య శక్తుల జోక్యం కాకపోతే మరేంటి? దీనినుంచి ఎవరు లాభపడుతున్నారు? కచ్చితంగా అధికార పార్టీ మాత్రం కాదు' అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, 2012లో ఎన్నికల సంఘానికి తాను నేతృత్వం వహించినప్పుడు దేశంలో ఓటింగ్ శాతం పెంచడానికి మిలియన్ డాలర్ల నిధుల కోసం అమెరికా ఏజెన్సీతో ఎంవోయూ చేసుకున్నట్లు వస్తున్న వార్తలు నిరాధారమైనవని మాజీ సీఈసీ ఎస్‌వై ఖురేషీ తోసిపుచ్చారు.

## అమెరికా సైనికుల భోజనం నిధుల దారి మళ్లింపు!

వాషింగ్టన్, ఫిబ్రవరి 16: అమెరికాలో సైనికుల ఆహారం కోసం కేటాయించిన నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ మేరకు మిలటరీ డాట్ కాం కథనాన్ని ప్రచురించింది. ఆహారం కోసం ప్రతి నెలా ఒక్కో సైనికుడి జీతం నుంచి 460 డాలర్లు (సుమారు రూ.40 వేలు) కోత విధిస్తారు. ఇలా జమ అయిన సొమ్మును భోజనాల కోసమే వినియోగించాల్సి ఉంటుంది. కానీ దానిని ఇతరత్రా మళ్లిస్తున్నట్టు తేలింది. జీతాల నుంచి 225 మిలియన్ డాలర్లు (సుమారు రూ.1,950 కోట్లు) వసూలు చేయగా, అందులో కేవలం 74 మిలియన్ డాలర్లు (సుమారు రూ.640 కోట్లు) మాత్రమే ఆహారం కోసం ఖర్చు చేశారు. దేశంలోని 11 పెద్ద మిలటరీ బేస్‌ల్లో గత ఏడాది చేసిన వ్యయాలను పరిశీలిస్తే ఈ విషయం వెల్లడయింది. నిధుల మళ్లింపు కారణంగానే ఫోర్ట్ కార్సన్, కొలరాడోని మిలటరీ కేంద్రాల్లో ఆహార కొరత ఉందని వార్తలు కూడా వచ్చాయి.

## టెక్స్‌టైల్ ఎగుమతుల్ని రూ.9లక్షల కోట్లకు పెంచడమే లక్ష్యం: మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: జౌళి ఉత్పత్తుల వార్షిక ఎగుమతుల్ని 2030 నాటికి ముందే రూ.9 లక్షల కోట్లకు పెంచడం ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని మోదీ ప్రకటించారు. ఢిల్లీలో ఫిబ్రవరి 14 నుంచి 17వ తేదీ వరకు జరుగుతున్న భారత్ టెక్స్ కార్యక్రమానికి మోదీ ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టెక్స్‌టైల్ రంగానికి బ్యాంకులు సహకారం అందించాలని, తద్వారా ఉపాధి పెంచేందుకు సహకరించాలని కోరారు. ప్రపంచంలో ఆరో అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా ఉన్న భారత్ గతేడాది 7% వృద్ధి నమోదు చేసిందని చెప్పారు. ప్రస్తుతం రూ.3లక్షల కోట్లుగా ఉన్న వార్షిక ఎగుమతుల్ని 2030 నాటికి ముందే మూడింతలు రూ.9లక్షల కోట్లకు పెంచడం ప్రభుత్వ లక్ష్యమన్నారు.

## హిందూ మతమే బాధ్యతాయుత సమాజం

» భిన్నత్వాన్ని ఆమోదించేదీ అదే: మోహన్ భాగవత్

బర్ధమాన్, ఫిబ్రవరి 16: హిందూ సమాజాన్ని ఐకమత్యంగా ఉంచాల్సిన ఆవశ్యకత ఉందని ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ అన్నారు. ఎందుకంటే దేశంలో బాధ్యతాయుతమైన సమాజం అదొక్కటేనని చెప్పారు. భిన్నత్వాన్నే ఏకత్వంగా భావించేది కూడా అదేనని తెలిపారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఆరెస్సెస్ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. భిన్నత్వాన్ని స్వీకరించడమనే పునాదిపైనే హిందూ సమాజం ఆధారపడి ఉందని తెలిపారు. భిన్నతంలో ఏకత్వమని కాకుండా భిన్నత్వమే ఏకత్వమని హిందూ సమాజం నమ్ముతోందని వివరించారు.

## మాలిలో బంగారం గని కూలి 42 మంది మృతి

బమాకో (మాలి), ఫిబ్రవరి 16: పశ్చిమ ఆఫ్రికా దేశమైన మాలిలో ఘోర ప్రమాదం జరిగింది. కెనీబా జిల్లాలో బంగారు గని కూలి 42 మంది దుర్మరణం పాలయ్యారని, అనేక మంది గాయపడ్డారని స్థానిక మీడియా, అధికారులు వెల్లడించారు. కెనీబా జిల్లా డాబియా కమ్యూన్‌లోని బిలాలీ టోకో వద్ద శనివారం రాత్రి బంగారు గని కూలిపోయినట్టు మాలియన్ టెలివిజన్ ప్రకటించింది. చైనాకు చెందిన వారు ఈ గోల్డ్ మైన్‌ను నడుపుతున్నారని, ఈ ప్రాంతంలో మట్టిపెళ్లలు విరిగిపడడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానిక అధికారులు ధ్రువీకరించారు.

## అదనపు కట్నం ఇవ్వలేదని కోడలికి హెచ్‌ఐవీ సూది

సహరన్‌పూర్, ఫిబ్రవరి 16: అదనపు కట్నం ఇవ్వలేదనే కోపంతో అత్తమామలు కోడలిపై దారుణానికి ఒడిగట్టారు. ఆమెకు హెచ్‌ఐవీ వైరస్ అంటి ఉన్న ఇంజక్షన్‌ను ఇచ్చారు. ఈ ఘటన ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన యువతికి 2023 ఫిబ్రవరి 15న ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు చెందిన అభిషేక్‌తో వివాహమైంది. వివాహ సమయంలో యువతి తండ్రి వరుడికి కొంత నగదు, నగలతో పాటు ఓ కారు ఇచ్చారు. అత్తమామలు తమకు మరో రూ.25 లక్షల నగదు, మరింత పెద్ద కారు కావాలంటూ కోడలిని వేధించసాగారు. ఆమెను చంపేస్తే తమ కుమారుడికి మరో పెళ్లి చేయొచ్చనే దురాలోచనతో హెచ్‌ఐవీ వైరస్ అంటి ఉన్న ఇంజక్షన్‌ను ఎక్కించారు.

## మారిషస్ మాజీ ప్రధాని జగన్నాథ్ అరెస్ట్

పోర్ట్ లోయిస్, ఫిబ్రవరి16: మారిషస్ మాజీ ప్రధాని ప్రవింద్ జగన్నాథ్‌ను మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ చేశారు. ఆయన నివాసాలు, కార్యాలయలపై ఆ దేశ ఆర్థిక నేరాల కమిషన్ సోదాలు జరిపి కీలక పత్రాలను, ఖరీదైన గడియారాలు, వివిధ దేశాలకు చెందిన కరెన్సీని స్వాధీనం చేసుకుంది. జగన్నాథ్ భార్య కోబితను కూడా అరెస్ట్ చేశారు. 2017 నుంచి 2024 వరకు ఆయన ప్రధానిగా కొనసాగారు. 2024లో జగన్నాథ్ రాజీనామా చేశాక నవీన్ రామ్‌గులామ్ నూతన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. జగన్నాథ్ హయాంలో కుదిరిన ఆర్థిక ఒప్పందాల్లో ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ కొత్త ప్రధాని దర్యాప్తునకు ఆదేశించారు.

# రైళ్ల పేర్లలో గందరగోళం వల్లే!

## ఢిల్లీలో తొక్కిసలాటకు కారణమిదే!.. రైలు రాకపై ప్రకటనతో ప్రయాణికుల తికమక

» 14వ ప్లాట్‌ఫాం నుంచి 16వ ప్లాట్‌ఫాంకు..

» ఒక్కసారిగా పరుగులు తీయడంతో తొక్కిసలాట

» 18కి చేరిన మృతులు.. 12 మందికి గాయాలు



ఆదివారం ప్రయాగ్‌రాజ్ రైల్వే స్టేషన్‌లో భక్తుల రద్దీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట ఘటనకు.. రైళ్ల పేర్లలో చోటుచేసుకున్న గందరగోళమే కారణమని భావిస్తున్నారు. ప్లాట్‌ఫాం పైకి రైలు రాకపై మైకులో రైల్వే సిబ్బంది చేసిన ప్రకటనతో ప్రయాణికులు తికమక పడటం వల్లే తొక్కిసలాట జరిగినట్లు పేర్కొంటున్నారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయడం, ఈ క్రమంలో శనివారం రాత్రి ప్లాట్‌ఫామ్‌ల వద్ద తొక్కిసలాట జరగడం తెలిసిందే. కాగా, ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 18కి చేరింది. వీరిలో 11 మంది మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. మరో 12 మంది గాయపడ్డారు. దీనిపై పోలీసులు ఇప్పటికే దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా.. ప్రయాగ్‌రాజ్ స్పెషల్, ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ అనే రైళ్ల పేర్ల విషయంలో గందరగోళం తలెత్తడం వల్లే ఘటన జరిగిందని భావిస్తున్నారు. వారు చెబుతున్న వివరాల ప్రకారం.. మహాకుంభమేళాకు వెళ్లేందుకు ప్రయాగ్‌రాజ్ స్పెషల్ రైలు 16వ నంబరు ప్లాట్‌ఫాం పైకి వస్తోందంటూ రైల్వే సిబ్బంది మైకులో ప్రకటించారు. అయితే అప్పటికే 14వ నంబరు ప్లాట్‌ఫాం పైకి ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ వచ్చి ఉంది. ఆ రైలు ఎక్కాల్సిన ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఆ ప్లాట్‌ఫాం వద్ద ఉన్నారు. కానీ, సిబ్బంది ప్రకటనతో.. తాము వెళ్లాల్సిన రైలు 16వ ప్లాట్‌ఫాంపైకి వచ్చిందని భావించి ఒక్కసారిగా అక్కడికి పరుగులు తీశారు. దీంతో గందరగోళం చోటుచేసుకొని తొక్కిసలాట జరిగింది. పైగా ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లాల్సిన నాలుగు రైళ్లలో మూడింటి రాక ఆలస్యం కావడంతో ప్రయాణికుల రద్దీ పెరిగిందని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. అయితే రైల్వేశాఖ అధికారులు మాత్రం దీనిని ఖండించారు. కొందరు ప్రయాణికులు 14వ, 15వ ప్లాట్‌ఫాంలపైకి వచ్చేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి దిగుతూ.. కాలుజారి ఇతరులపై పడ్డారని, తొక్కిసలాటకు ఇదే కారణమై ఉంటుందని భావిస్తున్నామని నార్తర్న్ రైల్వే సీపీఆర్‌వో హిమాన్షు ఉపాధ్యాయ్ తెలిపారు. కాగా, ఘటనపై విచారణకు రైల్వే శాఖ ఇద్దరు అధికారులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. తక్షణమే విచారణ ప్రారంభించిన కమిటీ.. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాల్సిందిగా ఆదేశించింది. మరోవైపు తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు రైల్వే శాఖ రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. వారితోపాటు తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.2.5 లక్షలు, స్వల్పంగా గాయపడ్డవారికి రూ.1 లక్ష చొప్పున ఇవ్వనున్నట్లు పేర్కొంది. తొక్కిసలాట జరిగిన ప్రాంతమంతా చెల్లాచెదురుగా పడిన ప్రయాణికుల వస్తువులతో హృదయ విదారకంగా మారింది. అక్కడ పడిపోయిన ప్రయాణికుల దుస్తులు, చెప్పులు, వాటర్ బాటిళ్లు, బ్యాగులను రైల్వే సిబ్బంది ఆదివారం తొలగించారు.

### ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రి వద్ద విషాద ఛాయలు

మృతుల కుటుంబీకులతో లోక్‌నాయక్ జయప్రకాశ్ ఆస్పత్రి వద్ద విషాద ఛాయలు అలముకున్నాయి. పలువురి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి వచ్చి తమ వారి మృతదేహాలను గుర్తించారు. ఏడేళ్ల తన కూతురికి తలలో మేకు గుచ్చుకొని చనిపోయిందంటూ ఓ తండ్రి విలపించాడు. 12 ఏళ్ల తన కుమారుడి మృతదేహాన్ని చూసి మరో తండ్రి కుప్పకూలాడు. తొక్కిసలాట ఘటనను ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ వైఫల్యంగా పేర్కొన్నాయి. ఢిల్లీ రైల్వేస్టేషన్ ఘటన రైల్వేశాఖ వైఫల్యాన్ని, ప్రభుత్వ బాధ్యతా రాహిత్యాన్ని మరోసారి స్పష్టం చేసిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్నప్పుడు రైల్వేస్టేషన్‌లో సరైన సౌకర్యాలు కల్పించాల్సిందని అభిప్రాయపడ్డారు.

## అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చెయ్యాల్సిందే!

### కాంగ్రెస్, టీఎంసీ, ఆర్జేడీ పార్టీల డిమాండ్

» న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాటపై విచారం

» కుంభమేళాకు అర్థం పర్థం ఉందా ? : లాలూ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్), రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) పార్టీలు పేర్కొన్నాయి. తొక్కిసలాట ఘటనకు బాధ్యత వహిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. కేంద్ర ప్రభుత్వం, రైల్వేశాఖ నిర్లక్ష్యం వల్లే ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఘటనతో రైల్వేశాఖ వైఫల్యం మరోసారి బయట పడిందన్నారు. అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయకుంటే కేంద్రమే ఆయనపై వేటు వెయ్యాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియ శ్రీనథే డిమాండ్ చేశారు. తొక్కిసలాట ఘటన రైల్వే శాఖ మూకుమ్మడి వైఫల్యానికి నిదర్శనమని ఆప్ ఆరోపించింది. మహా కుంభమేళాకు బయలుదేరిన ప్రయాణికులు తొక్కిసలాటలో చనిపోవడం బాధాకరమని ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ అన్నారు. కాగా, తొక్కిసలాట ఘటన దురదృష్టకరమన్న ఆర్జేడీ అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్.. అసలు మహా కుంభమేళాకు అర్థం పర్థం ఏమైనా ఉందా ?(కుంభ్ కా కోయి మతలబ్ హై.. ఫాల్తూ హై కుంభ్) అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కుంభమేళాపై లాలూ చేసిన వ్యాఖ్యలను బీజేపీ, హిందూ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. లాలూ శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించాయి. మరోపక్క, తొక్కిసలాట ఘటనను కప్పిపుచ్చేందుకు కేంద్రం ప్రయత్నించిందని టీఎంసీ ఆరోపించింది. తొక్కిసలాటలో 18 మంది మరణించారనే వార్త తన హృదయాన్ని కలచివేసిందని పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ పేర్కొన్నారు. మహా కుంభమేళా వంటి కార్యక్రమాల కోసం మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

## లోకం తీరు



## మరణాలపై ఢిల్లీ ఎల్జీ మాట మార్పు

తొలుత మృతులకు సంతాపం.. ఎక్స్‌లో పోస్టు

తర్వాత మరణాల ప్రస్తావన తొలగిస్తూ ఎడిట్

మరణాలను దాచాలనుకున్నారని విమర్శలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట ఘటనలో మరణాలపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అరగంట వ్యవధిలోనే మాట మార్చారు. తొక్కిసలాటలో పలువురు చనిపోయారంటూ తొలుత మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటిస్తూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అరగంట తర్వాత ఆ పోస్టును ఎడిట్ చేశారు. మరణాల ప్రస్తావనను తొలగించారు. శనివారం జరిగిన ఈ ప్రమాదంపై స్పందిస్తూ సక్సేనా తొలుత రాత్రి 11.55 నిమిషాలకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఎంతో మంది గాయపడ్డారు. ఇది చాలా బాధాకరం" అని పేర్కొన్నారు. 12.24 గంటలకు ఆ పోస్టును ఆయన ఎడిట్ చేస్తూ.. మరణాల ప్రస్తావనను తొలగించి 'తొక్కిసలాట ఘటన దురదృష్టకరం' అని మార్చారు. ఇది రాజకీయంగా తీవ్ర వివాదాస్పదమైంది. సక్సేనా తన పోస్టును ఎడిట్ చేయడంపై ఆప్ సహా పలు విపక్ష పార్టీలు ఆరోపణలు గుప్పించాయి. తొక్కిసలాట ప్రమాదాన్ని కేంద్రంలో, ఢిల్లీలో అధికారంలో ఉన్న బీజేపీ తక్కువ చేసి చూపించాలని, మరణాలను దాచిపెట్టాలని భావించిందని ఆరోపించాయి. ఎల్జీ సక్సేనా ఎక్స్‌లో తన పోస్టును ఎడిట్ చేయడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నాయి.

## త్రిభాషా విధానం పేరుతో బ్లాక్ మెయిలా?

» కేంద్ర మంత్రిపై స్టాలిన్ ఆగ్రహం



చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): త్రిభాషా విధానాన్ని అంగీకరించకపోవడం వల్లే తమిళనాడుకు సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) పథకం కింద నిధులు విడుదల చేయలేకున్నామంటూ కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ మండిపడ్డారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలు రాష్ట్రాలను బ్లాక్ మెయిల్ చేసే ధోరణిలో ఉన్నాయని, రాష్ట్రానికి న్యాయపరంగా అందాల్సిన నిధులనే అడుగుతున్నామేగాని వారి సొంత ఆస్తులను అడగటం లేదని మండిపడ్డారు. రాష్ట్రాలన్నీ త్రిభాషా విధానానికి కట్టుబడి రాజ్యాంగం పరిధిలోకి రావాలని, అప్పుడే నిధులిస్తామని చెప్పడం గర్హనీయమని పేర్కొన్నారు. రాజ్యాంగంలో ఏ సెక్షన్‌లో త్రిభాషా విధానం ప్రస్తావన ఉందో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పగలరా? అని ప్రశ్నించారు. రాష్ట్రాలన్నీ కలిస్తేనే కేంద్రం అని, విద్య ఉమ్మడి జాబితాలోనే ఉందనే విషయం కేంద్రమంత్రి మరచి పోయారని వ్యాఖ్యానించారు. కాశీలో శనివారం జరిగిన కాశీ తమిళ్ సంఘం సమావేశంలో ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ కేంద్రం ప్రతిపాదించిన నూతన విద్యావిధానాన్ని, త్రిభాషా విధానాన్ని అంగీకరిస్తేనే కేంద్రం నుంచి తమిళనాడుకు ఎస్ఎస్ఏ కింద నిధులు విడుదలవుతాయన్నారు. కేంద్రం ఎప్పుడూ తమిళ భాష చదవకూడదని చెప్పటం లేదని, మూడోభాషగా ఒక భాషను అంటే హిందీని అంగీకరించాలని ఒత్తిడి చేయకుండా ప్రతిపాదిస్తున్నదని అన్నారు. ఈ ఏడాది ఎస్ఎస్ఏ కింద తమిళనాడుకు రావాల్సిన రూ.2152 కోట్ల నిధులను కేంద్రం నిలిపివేసింది.

# మళ్లీ సంకెళ్లతోనే..

(మొదటి పేజీ తరువాయి)

భారతీయులు కూడా ఇలాంటి ఆరోపణలే చేసిన విషయం తెలిసిందే. ట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదారులపై దేశ బహిష్కరణ చర్యల్లో భాగంగా తొలి విడతలో ఈ నెల 5న 104 మంది భారతీయులను సైనిక విమానం సీ-17లో వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. రెండో విమానం 116 మందితో శనివారం రాత్రి 11.30 గంటలకు, మూడో విమానం 112 మందితో ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో అమృత్‌సర్‌లోనే దిగాయి. శనివారం దిగిన వారి వివరాలు పరిశీలించిన తర్వాత ఆదివారం సాయంత్రం ఇళ్లకు పంపారు. ఇక ఆదివారం దిగిన వారి వివరాలు పరిశీలించే ప్రక్రియ మొదలైంది. రెండో విడత విమానంలో 65 మంది పంజాబ్, 33 మంది హరియాణాకు చెందినవారు ఎక్కువగా ఉన్నారు. ఇక మూడో విమానంలో హరియాణాకు చెందిన 44 మంది, గుజరాత్‌కు చెందిన 33 మంది, పంజాబ్ నుంచి 31 మంది ఉన్నారు. ఇదిలా ఉండగా, రెండో విమానంలో వచ్చిన సిక్కుల్లో ఎవరూ తలపాగా చుట్టుకోలేదు. అందుకు అమెరికా అధికారులు అనుమతించలేదని సిక్కు వలసదారులు తెలిపారు. దీనిపై శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చట్ట ప్రకారం అమెరికాకు తీసుకెళ్తామని చెప్పి, తమ వద్ద పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుని ట్రావెల్ ఏజెంట్లు మోసం చేశారని వలసదారులు వెల్లడించారు. డైరెక్ట్ ఫ్లయిట్‌లో అమెరికాకు పంపిస్తామని ట్రావెల్ ఏజెంట్ నమ్మించి, 'డంకీ రూట్' ద్వారా తీసుకెళ్లారని పంజాబ్‌కు చెందిన దల్జీత్ సింగ్ చెప్పాడు. పిల్లల భవిష్యత్తు బాగుంటుందనే ఆశతో పొలాలు తాకట్టు పెట్టి కొందరు, పొలాలు, పశువులు అమ్మి మరికొందరు తల్లిదండ్రులు ఆ డబ్బుతో అమెరికాకు పంపారు.



అమృత్‌సర్ నుంచి ఆదివారం సాయంత్రం అహ్మదాబాద్‌కు చేరుకున్న అక్రమ వలసదారులు

### ఎయిర్‌పోర్టులోనే ఇద్దరి అరెస్ట్

రెండో విడతలో అమెరికా నుంచి వచ్చినవారిలో ఇద్దరు యువకులు ఓ హత్య కేసులో నిందితులుగా ఉన్నారు. పంజాబ్‌లోని పటియాలా జిల్లా రాజ్‌పురాకు చెందిన సందీప్ సింగ్ అలియాస్ సన్నీ, ప్రదీప్ సింగ్‌లను పోలీసులు విమానాశ్రయంలోనే అరెస్ట్ చేశారు. 2023లో రాజ్‌పురా పోలీస్ స్టేషన్‌లో వారిపై హత్య కేసు నమోదైంది.

## సంకెళ్లతో మోదీ కార్టూన్!

తమిళ వెబ్ పత్రిక 'వికటన్'లో ప్రచురణ

బీజేపీ ఫిర్యాదుతో పత్రిక పోర్టల్‌ను నిలిపివేసిన కేంద్ర ప్రసార శాఖ

చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అమెరికా నుంచి భారతీయులను సంకెళ్లు వేసి తరలిస్తున్న ఘటనపై ప్రధాని మోదీ మౌనం వహించడాన్ని ప్రశ్నిస్తూ కార్టూన్ ప్రచురించిన తమిళ డిజిటల్ మ్యాగజైన్ 'వికటన్' పోర్టల్ ప్రసారాలు గత రెండు రోజులుగా నిలిచిపోయాయి. ఈనెల 10వ తేదీన వికటన్ వెబ్ మ్యాగజైన్‌లో... అమెరికా అధ్యక్షుడి ముందు ప్రధాని మోదీ సంకెళ్లతో కూర్చున్నట్లు కార్టూన్ ప్రచురితమైంది. ఇది మోదీని కించపరిచేలా ఆ కార్టూన్ ఉందంటూ తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఈనెల 15న కేంద్ర సమాచార శాఖ మంత్రి ఎల్ మురుగన్‌కు, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే, ఆ మ్యాగజైన్ పోర్టల్ ప్రసారాలు నిలిచిపోయాయి. వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయడానికి గల కారణాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని, కేంద్ర సమాచార మంత్రిత్వశాఖ సంప్రదిస్తామని మ్యాగజైన్ నిర్వాహకులు పేర్కొన్నారు. వికటన్ వెబ్ పోర్టల్ ప్రసారాలను నిలిపివేయడాన్ని తమిళనాడు సీఎం స్టాలిన్, తమిళగ వెట్రి కళగం పార్టీ నేత, నటుడు విజయ్, కాంగ్రెస్ పార్టీ తమిళనాడు అధ్యక్షుడు సెల్వపెరుంతగై సహా పలువురు తమిళనాడు నేతలు తీవ్రంగా ఖండించారు. బీజేపీ ఫాసిస్టు ధోరణికి ఇదే నిదర్శనమని స్టాలిన్ అన్నారు.

## అమెరికా అండ లేకుంటే..

# ఉక్రెయిన్ మనుగడ కష్టమే!



(మొదటి పేజీ తరువాయి)

సోమవారానికి (ఫిబ్రవరి 24) నిండా మూడు సంవత్సరాలు. 2022 ఫిబ్రవరి 24న రష్యా దండయాత్ర మొదలైన సంగతి తెలిసిందే. ఈ యుద్ధంలో ఉక్రెయిన్‌ను రష్యా సులభంగా ఓడించేస్తుందని చాలా మంది భావించారు. కానీ.. అమెరికా, యూరప్ దేశాల సహకారంతో ఉక్రెయిన్ తన పోరాటాన్ని కొనసాగిస్తూ వస్తోంది. ఒక దశలో రష్యన్ యుద్ధట్యాంకులను, నల్ల సముద్రంలో రష్యా యుద్ధనౌకలను సైతం డ్రోన్లు, పాశ్చాత్య దేశాలు అందించిన క్షిపణుల సాయంతో నాశనం చేసి తీవ్ర నష్టం కలిగించింది. అంతేనా.. ఉక్రెయిన్ సైనికులు రష్యాకు చెందిన దాదాపు 1500 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని సైతం ఆక్రమించగలిగారు. కానీ అదే సమయంలో రష్యా ఉక్రెయిన్ భూభాగాన్ని గణనీయంగా ఆక్రమించుకోగలిగింది. ముఖ్యంగా ఉక్రెయిన్ తూర్పు భాగంలోని డోన్‌బాస్, కురఖోవ్‌ను ఆక్రమించి ఈశాన్యభాగంలోని పోక్రోవ్స్క్ దిశగా రష్యన్ సేనలు కదులుతున్నాయి. అటు దక్షిణాదిన ఇప్పటికే తమ భూభాగంలో విలీనం చేసుకున్నట్టుగా ప్రకటించిన ఖెర్సోన్, జాపోరిజియా, లుహాన్స్క్, డొనెట్స్క్ ప్రాంతాల్లో రష్యా మార్షల్ లా కూడా విధించింది. మొత్తమ్మీద ఈ యుద్ధం మొదలైనప్పటి నుంచి రష్యా తొలి ఆరు నెలల్లో 1,19,000 చదరపు కిలోమీటర్ల మేర ఉక్రెయిన్ భూభాగాన్ని ఆక్రమించిందని అంచనా. 2022కు ముందు ఆక్రమించుకున్న (క్రిమియా, డొనెట్స్క్, లుహాన్స్క్‌లోని కొన్ని ప్రాంతాలు) భూభాగం 42 వేల చదరపు కిలోమీటర్లను కూడా కలుపుకొంటే 1,61,000 చదరపు కిలోమీటర్లు అవుతుంది. ఇది ఉక్రెయిన్ భూభాగంలో దాదాపు 27 శాతం. అయితే, ఆ తర్వాత వీరోచితంగా పోరాడిన ఉక్రెయిన్.. రష్యా ఆక్రమించుకున్న భూమిలో 74,443 చదరపు కిలోమీటర్ల మేర వెనక్కి తీసుకోగలిగింది. అయినప్పటికీ ఉక్రెయిన్ భూభాగంలో 18 శాతం ఇప్పటికీ రష్యా అధీనంలోనే ఉంది. అంతేకాదు.. కర్స్క్ ప్రాంతంలో ఉక్రెయిన్ ఆక్రమించిన తమ భూభాగంలో 40 శాతం దాకా తిరిగి స్వాధీనం చేసుకోగలిగింది. కానీ, ఈ క్రమంలో ఆరున్నర లక్షల మందికిపైగా రష్యన్ సైనికులు ఈ యుద్ధంలో చనిపోయారని ఉక్రెయిన్ చెబుతోంది. తనకున్న అపార వనరులు, ఆయుధ సంపత్తి దృష్ట్యా.. చిట్టెలుకలాంటి ఉక్రెయిన్‌పై గెలవడానికి రష్యా ఇంత ఆపసోపాలు పడుతోందంటే, పూర్తిగా గెలవలేకపోతోందంటే.. అమెరికా, యూరప్ దేశాల మద్దతే అందుకు కారణం. ఆయా దేశాలన్నీ కలిపి ఇప్పటిదాకా ఉక్రెయిన్‌కు ఆర్థికంగా, ఆయుధపరంగా అందించిన సాయం విలువ దాదాపు రూ.25 లక్షల కోట్లు. అందులో దాదాపు రూ.5.7 లక్షల కోట్ల సాయం అమెరికా నుంచే అందింది.

### ట్రంప్ వచ్చాక మారిందేంటి?

ఇన్నాళ్లుగా యూరప్ దేశాలతోపాటు తమకు అండగా ఉన్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఎన్నికల్లో ఓటమిపాలు కావడం ఉక్రెయిన్‌కు పెద్ద దెబ్బే! ఎందుకంటే.. బైడెన్ హయాంలో ఉక్రెయిన్‌కు అమెరికా.. ఆర్థికంగా గానీ, ఆయుధాల రూపంలోగానీ అందించిన సాయం అపారం. శతఘ్నులు, రాకెట్ అమ్యూనిషన్, యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ మిస్సైల్స్, ఏరియల్ బాంబులను ఉక్రెయిన్‌కు అమెరికా పెద్ద ఎత్తున సరఫరా చేసింది. రెండు ఎఫ్-16 యుద్ధవిమానాలను సైతం గత ఏడాది ఆగస్టులో ఉక్రెయిన్‌కు అమెరికా పంపించింది. ఇలా.. యుద్ధం మొదలైన 2022 ఫిబ్రవరి 24 నుంచి 2025 జనవరి 9 దాకా.. అమెరికా ఉక్రెయిన్‌కు అందించిన సాయం విలువ అక్షరాలా దాదాపుగా రూ.5.7 లక్షల కోట్లు. దిగిపోయే ముందు కూడా బైడెన్ ఉక్రెయిన్‌కు 500 మిలియన్ డాలర్ల ప్యాకేజీ ఇవ్వడానికి ఆమోదం తెలిపారు. ముందుగా చేసిన కేటాయింపుల ప్రకారం మరో 2.25 బిలియన్ డాలర్ల సాయం అమెరికా నుంచి ఉక్రెయిన్‌కు అందాల్సి ఉంది. కానీ.. ట్రంప్ వచ్చాక పరిస్థితి మారింది. పుతిన్‌తో గంటన్నరసేపు మాట్లాడిన ట్రంప్.. నాటోలో ఉక్రెయిన్‌ను చేర్చుకోవడం ప్రాక్టికల్‌గా సాధ్యమయ్యే పని కాదని, యుద్ధంలో పోగొట్టుకున్న భూభాగం మొత్తాన్నీ ఉక్రెయిన్ తిరిగి పొందే అవకాశాలు లేవని వ్యాఖ్యానించారు. బైడెన్ హయాంలో అందించిన మద్దతును కొనసాగించాలంటే.. ఉక్రెయిన్‌లో ఉన్న అత్యంత అరుదైన ఖనిజ నిక్షేపాల్లో 500 బిలియన్ డాలర్ల విలువకు సమానమైన జిర్కోనియం, గాలియం వంటి ఖనిజాలను అమెరికాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ, జెలెన్‌స్కీ అందుకు ఒప్పుకోవట్లేదు. ఒకవేళ ట్రంప్ గనక ఇదే ధోరణిలో వ్యవహరించి బైడెన్ తరహాలో సైనిక సాయాన్ని కొనసాగించకపోతే.. ఉక్రెయిన్ ఈ యుద్ధాన్ని నాలుగు నుంచి ఆరు వారాలకు మించి కొనసాగించలేకపోవచ్చని రక్షణ రంగ నిపుణుల అంచనా. అందుకే.. అమెరికా మద్దతు లేకుంటే ఉక్రెయిన్ మనుగడ కష్టమన్న వాస్తవాన్ని జెలెన్‌స్కీ బహిరంగంగా చెప్పారు!!

- సెంట్రల్ డెస్క్

### అమెరికాపై ఆశ లేదు!

డొనాల్డ్ ట్రంప్ హయాంలోని అమెరికాపై యూరప్ ఖండం ఇక ఆశలు పెట్టుకోకూడదని.. తనను తాను రక్షించుకోవడానికి యూరప్ దేశాలు ఇక సొంత సైన్యాన్ని (యూరోపియన్ ఆర్మీ) ఏర్పాటు చేసుకోవాలని జెలెన్ స్కీ పిలుపునిచ్చారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం వ్యవహారంలో ట్రంప్ యూరప్ దేశాలకు ఒక్క మాట కూడా చెప్పకుండా కొద్దిరోజుల క్రితం పుతిన్‌కు ఫోన్ చేసి గంటన్నరసేపు మాట్లాడడం.. ఆ తర్వాత నుంచి ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తుండడం వంటి పరిణామాల నేపథ్యంలో జెలెన్‌స్కీ ఈ పిలుపునిచ్చారు. "మనం నిజాయతీగా మాట్లాడుకుందాం. యూరప్ భద్రతకు ప్రమాదకరంగా పరిణవించే అంశాల్లో సాయం చేయడానికి అమెరికా నో చెప్పవచ్చు. కాబట్టి, యూరప్ సాయుధ దళాల ఏర్పాటుకు ఇదే సరైన సమయమని నేను బలంగా నమ్ముతున్నాను" అని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు.. ఉక్రెయిన్‌కు చోటు లేకుండా, తమ వెనకాల జరిగే ఒప్పందాలను తాము ఎన్నటికీ ఒప్పుకోబోమని ఆయన తేల్చిచెప్పారు. "ఉక్రెయిన్ లేకుండా ఉక్రెయిన్‌పై ఎలాంటి నిర్ణయాలూ తీసుకోలేరు. యూరప్ (ప్రాతినిధ్యం) లేకుండా యూరప్‌పై ఎలాంటి నిర్ణయాలూ తీసుకోలేరు" అని స్పష్టం చేశారు. నిజానికి యూరప్ దేశాలు కూడా ట్రంప్ తీరుతో ఇప్పటికే అప్రమత్తమయ్యాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ నేతృత్వంలో పలు దేశాలు భేటీ అయి ఈ అంశంపై చర్చించాయి. త్వరలో సౌదీఅరేబియాలో రష్యా-ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య శాంతి చర్చలు ఏర్పాటు చేయనున్నట్టు ట్రంప్ యంత్రాంగంలోని సీనియర్ అధికారులు ప్రకటించడం.. తమ ప్రమేయం ఏమీ లేకుండా శాంతి చర్చలు జరగడం యూరప్ దేశాలకు మింగుడుపడట్లేదు.

# కళ్యాణి చాళుక్యుల శాసనాల గుర్తింపు

**» వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కంకల్‌లో వెలుగులోకి**

వికారాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కళ్యాణి చాళుక్యుల శాసనాలను వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కంకల్ గ్రామంలో గుర్తించామని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. సంపత్‌కుమార్ అనే ఉపాధ్యాయుడు ఇచ్చిన సమాచారం మేరకు ప్రాథమికంగా పరిశీలన జరిపి 3 శాసనాలను కనుగొన్నామని చెప్పారు. ఆదివారం స్థానిక వీరభద్ర దేవాలయ ప్రాంగణంలో ఈ శాసనాలను పురావస్తు పరిశోధకుడు రామోజు హరగోపాల్ అధ్యయనం చేశారు. అవి కళ్యాణి చాళుక్య చక్రవర్తి భూలోక మల్లదేవన, 3వ సోమేశ్వరుడి కాలానికి చెందినవిగా భావిస్తున్నట్లు తెలిపారు. క్రీ.శ.1129, 1130, 1132లలో ఈ శిలా ఫలకాలను రూపొందించినట్లు చెప్పారు. వాటి మీద భూమి, నగదును దానం చేసినట్లు ఉందని వివరించారు. మొదటి శిలాఫలకంపైన ఉన్న శాసనంలో స్థానిక పాలకుడు బెజ్జరస తన పేరున బెజ్జేశ్వరుడిని ప్రతిష్ఠించి, 100 మర్తురుల భూమిని దానం చేశారని ఉందని, రెండో శాసనంలో మహామండలేశ్వర సోవిదేవప్రగ్గడ, బెజ్జరస, బెజ్జేశ్వర దేవర అంగరంగ భోగాలకు 100 మర్తురుల భూమి, నగదును దానం చేసినట్లు ఉందని వివరించారు. రెండో శిలాఫలకంపై ఉన్న మూడో శాసనంలో కంకల్ల - 24 కంపణంలోని కంకల్ నగరానికి చెందిన బెజ్జేశ్వరస్వామికి వివిధ దానాలు చేసిన వివరాలు ఉన్నాయని హరగోపాల్ తెలిపారు.



కళ్యాణి చాళుక్యుల శాసనం

# సాగర్ స్పిల్‌వే మరమ్మతులకు శాశ్వత ఏర్పాట్లు

**» అటూ ఇటూ కదిలే తరహా క్రేన్లకు నీటిపారుదల టెండర్లు**

**» మార్చి 7లోగా ఆన్‌లైన్‌లో దాఖలుకు గడువు**

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే మరమ్మతులకు అటూ ఇటూ కదిలే తరహా క్రేన్‌ను ఏర్పాటు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం టెండర్ నోటిఫికేషన్ విడుదలైంది. అంతర్జాతీయ కంపెనీల నుంచి టెండర్లు ఆహ్వానించారు. మార్చి 7వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ఆన్‌లైన్‌లో టెండర్లు వేయాలని ప్రాజెక్టు ఎస్‌ఈ శ్రీధర్‌రావు కోరారు. అంతర్జాతీయ కంపెనీలకు చెందిన కాంట్రాక్టర్లు స్వయంగా సాగర్ ప్రాజెక్ట్ స్పిల్‌వేను సందర్శించి, మరమ్మతులకు ఎటువంటి క్రేన్ ఉపయోగపడుతుందో చూసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటివరకు సాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే గుంతలను పూడ్చేందుకు టెండర్లను పిలుస్తున్నారు. ఆ తర్వాత స్పిల్‌వే ముందు భాగంలో రోడ్డు వేయడం, నీటిని ఎత్తిపోయడం వంటి పనులు చేపడుతున్నారు. దీంతో మరమ్మతు పనులు ఆలస్యమవుతున్నాయి. ఇకనుంచి అలా జరగకుండా ఉండేందుకు శాశ్వతంగా కదిలే క్రేన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

# తెలంగాణకు సుప్రీంకోర్టు రూ.5 వేల జరిమానా

**» నివేదిక సమర్పణలో జాప్యానికి చర్య**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు కేంద్రం 2013లో తీసుకొచ్చిన పోష్ (ప్రివెన్షన్ ఆఫ్ ది సెక్సువల్ హరాస్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఎట్ వర్క్ ప్లేస్) చట్టం అమలుకు సంబంధించి నివేదికను సమర్పించడంలో నిర్లక్ష్యం వహించినందుకు తెలంగాణ సహా ఐదు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక్కో రాష్ట్రానికి రూ.5 వేలు జరిమానా విధించింది. పోష్ చట్టం అమలుపై గోవాకు చెందిన ఔరేలియానో ఫెర్నాండెజ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనికి సంబంధించి రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యలు, అమలు చేస్తున్న విధానాలు తదితర అంశాలతో కూడిన సమగ్ర వివరాలను ఫిబ్రవరి 11లోపు సమర్పించాలని గత డిసెంబరు నెలలో ఆదేశించింది. అయితే తెలంగాణతోపాటు మణిపూర్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ఆ ఆదేశాలను పాటించలేదు. ఆ పిటిషన్‌పై విచారించిన ధర్మాసనం ఆయా రాష్ట్రాల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. తమకు మరికొంత సమయం కావాలని ఆ రాష్ట్రాల తరఫు న్యాయవాదులు అభ్యర్థించగా ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించనందుకు ఒక్కో రాష్ట్రానికి రూ.5 వేలు జరిమానా విధించింది. రెండు వారాల్లో జరిమానా చెల్లించాలని, మూడు వారాల్లో అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది.

# జ్వరంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

**» హెచ్‌ఎం, వార్డెన్ నిర్లక్ష్యమంటూ ఆదివాసీ సంఘాల ఆందోళన**



వినిత్(ఫైల్)

వాజేడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జ్వరం, కడుపునొప్పితో బాధపడుతూ ఓ ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన ములుగు జిల్లాలో జరిగింది. వాజేడు మండలంలోని పేరూరు బాలుర ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న సోయం వినిత్(13)కు ఈనెల 11న కడుపు నొప్పి రాగా వసతి గృహంలోని ఏఎన్‌ఎం మాత్ర ఇచ్చింది. దీంతో కడుపునొప్పి తగ్గింది. ఈ క్రమంలో వసతి గృహానికి రెండు రోజులు సెలవు రాగా విద్యార్థి అదే గ్రామంలోని మేనమామ ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం జ్వరం రావటంతో మండలంలోని ధర్మవరంలో ఓ ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించారు. మళ్లీ అదే రోజు రాత్రి జ్వరం రావటంతో మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం తరలిస్తుండగా మార్గమధ్యలోనే బాలుడు మృతిచెందాడు. అతడి మృతికి హాస్టల్ వార్డెన్, ప్రధానోపాధ్యాయుడి నిర్లక్ష్యమే కారణమని ఆదివాసీ సంఘాల నేతలు వసతి గృహం ఆవరణంలో ధర్నా చేశారు.

# కోడి పందేలతో నాకు సంబంధం లేదు

**» ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి సమాధానం**

మొయినాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్ట సమీపంలో జరిగిన కోడిపందేల కేసు విచారణలో భాగంగా పోలీసులు ఇచ్చిన నోటీసులకు ఫాంహౌస్ యజమాని, ఎమ్మెల్సీ పి.శ్రీనివాస్‌రెడ్డి సమాధానమిచ్చారు. కోడి పందేలతో తనకు ఎలాంటి సంబంధంలేదని న్యాయవాది ద్వారా సమాధానం పంపినట్లు పోలీసులు తెలిపారు. తన వ్యవసాయ క్షేత్రాన్ని రమేష్‌రెడ్డి అనే వ్యక్తికి 2023 సంవత్సరంలో లీజుకు ఇచ్చినట్టు పేర్కొన్నారు. శ్రీనివాస్‌రెడ్డి నేరుగా వచ్చి వివరణ ఇస్తారని భావించినప్పటికీ ఆయన రాలేదు. అయితే ఆయన ఇచ్చిన వివరణతో పోలీసులు సంతృప్తి చెందుతారా? లేదా మళ్లీ నోటీసులు ఇస్తారా అనేది తెలియాల్సి ఉంది. కాగా కోడిపందేల సూత్రధారి, నిర్వాహకుడు శివకుమార్‌వర్మ అలియాస్ గబ్బర్‌సింగ్‌ను కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ వేయగా.. అది సోమవారం విచారణకు రానుంది. శివకుమార్ వర్మను విచారిస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు భావిస్తున్నారు. కాగా నాలుగు రోజులుగా పోలీసు బందీలో ఉన్న పందెం కోళ్లను కోర్టు అనుమతితో సోమవారం వేలం వేయనున్నట్లు తెలిసింది.



# తిరుపతిలో నేటి నుంచి ఐటీసీఎక్స్-2025

**» హాజరుకానున్న ఏపీ, గోవా, మహారాష్ట్ర సీఎంలు**

తిరుపతి, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దేవాలయాల సదస్సుకు తిరుపతి వేదికగా నిలిచింది. ఆలయ నిర్వహణకు సంబంధించి వినూత్న విధానాలు, ఉత్తమ పద్ధతులను అన్వేషించడం, స్థిరమైన పర్యావరణ వ్యవస్థను ఏర్పాటుచేయడం, డిజిటలైజేషన్, ఆలయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను పెంపొందించడం వంటి వ్యూహాలపై దృష్టి సారించడమే లక్ష్యంగా ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో (ఐటీసీఎక్స్) సదస్సు జరగనుంది. సోమవారం జరిగే ప్రారంభ సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, గోవా సీఎం ప్రమోద్ సావంత్, కేరళ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి సీఆర్ ముకుంద్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఐటీసీఎక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆలయాల ప్రతినిధులు హాజరుకానున్నారు. 58 దేశాల్లోని సుమారు 1600 ఆలయ, ఆధ్యాత్మిక సంస్థలు ఆన్‌లైన్ ద్వారా ఎక్స్‌పోతో కనెక్ట్ కానున్నట్టు వెల్లడించారు.

# వీసా.. పాస్‌పోర్టు లేని.. నైజీరియన్‌కు దేశ బహిష్కరణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వీసా, పాస్‌పోర్టుల్లేకుండా నగరంలో తిరుగుతున్న ఓ నైజీరియా దేశస్థుడిని అదుపులోకి తీసుకున్న హైదరాబాద్ నార్కోటిక్స్ వింగ్(హెచ్-న్యూ) పోలీసులు.. అతణ్ని డీపోర్ట్ చేయాలని నిర్ణయించారు. నైజీరియాకు చెందిన ఇకెచుకువు సిల్వెస్టర్ 2012లో బిజినెస్ వీసాపై భారత్‌కు వచ్చి.. ముంబై నుంచి వస్త్రాలను నైజీరియాకు ఎగుమతి చేసేవాడు. వీసా గడువు ముగిశాక కూడా ముంబైలోనే ఉండడంతో.. 2019లో పోలీసులు అరెస్టు చేశారు. రెండేళ్ల జైలులో శిక్ష తర్వాత తోటి నైజీరియా స్నేహితులు డ్రగ్స్ దందాలో ఉండగా.. వారికి ఉన్న లింకులతో సిల్వెస్టర్ ఇటీవల హైదరాబాద్ చేరుకున్నాడు. ఇక్కడ అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో.. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సిల్వెస్టర్ వద్ద ఎలాంటి వీసా, పాస్‌పోర్టు లేవని పోలీసులు తెలిపారు. అతను డ్రగ్స్ పెడ్లర్‌గా మారుతున్న క్రమంలో గుర్తించడంతో.. నైజీరియాకు డీపోర్ట్ చేయాలంటూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశించారు. కాగా.. ఇప్పటి వరకు హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధుల్లో 16 మంది నైజీరియన్లను డీపోర్ట్ చేశారు.

# జీబీఎస్‌తో మరో మరణం

**ఇప్పటికే శ్రీకాకుళంలో ఆరేళ్ల బాబు మృతి.. తాజాగా ప్రకాశంలో 50 ఏళ్ల మహిళ మరణం**

**» ఇప్పటి వరకు వెలుగులోకి 59 కేసులు**

**» ప్రస్తుతం ఆస్పత్రుల్లో మరో 14 మంది**

**» నిమిషాల వ్యవధిలో ఒళ్లంతా పాకే వ్యాధి**

**» లక్షణాలు కనిపించగానే ఆస్పత్రిలో చేరాలి**

అమరావతి/గుంటూరు మెడికల్/కొమరోలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గులియన్ బారే సిండ్రోమ్(జీబీఎస్) మరో ప్రాణాన్ని బలితీసుకుంది. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాల్లో ఆరేళ్ల బాలుడు జీబీఎస్‌తో మరణించగా, ఆదివారం ప్రకాశం జిల్లాకు చెందిన 50 ఏళ్ల మహిళ గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రాణాలు కోల్పోయారు. కొమరోలు మండలం అలసందలపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ బైళ్ల కమలమ్మ(50) ఈ మహమ్మారి బారిన పడి.. ఆదివారం మృతి చెందారు. కమలమ్మ ఈనెల 2వ తేదీ రాత్రి అనారోగ్యం బారిన పడ్డారు. కండరాల నొప్పితో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు తొలుత గిద్దలూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం వైద్యుల సిఫారసు మేరకు ఈనెల 3న గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యులు రక్తపరీక్షలు నిర్వహించగా జీబీఎస్ పాజిటివ్‌గా తేలింది. దీంతో ఐసీయూలో చికిత్సను అందించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటిలేటర్‌పై ఉంచారు. ఇమ్యునో గ్లోబిలిన్ ఇంజెక్షన్ల కోర్సును కూడా ప్రారంభించారు. అయితే వ్యాధి తీవ్రత కారణంగా కోలుకోలేకపోయిన కమలమ్మ.. ఆదివారం తుది శ్వాస విడిచారు. ఈ సీజన్‌లో ఏపీలో ఇది రెండో జీబీఎస్ మరణం. గత వారం శ్రీకాకుళం జిల్లాలో యుగంధర్ అనే బాలుడు జీబీఎస్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో.. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు రంగంలోకి దిగి, కొన్ని చోట్ల ప్రత్యేక చికిత్సకు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 59 కేసులు వెలుగులోకి వచ్చాయి. పలువురు చికిత్స పొంది, డిశ్చార్జ్ అవ్వగా.. ప్రస్తుతం 14 మంది వేర్వేరు ఆస్పత్రుల్లో ఉన్నారు. డిశ్చార్జ్ అయినవారిపై ఆరోగ్య శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. కొవిడ్ సోకితే.. కనీస వ్యాధి లక్షణాలు తెలిసేవి. అయితే.. జీబీఎస్ విషయంలో ప్రారంభంలో అందరికీ ఒకే లక్షణాలు ఉండడం లేదని వైద్యులు చెబుతున్నారు. కొవిడ్ విషయంలో ప్రపంచ మరణాల రేటు 2శాతంగా ఉండగా.. జీబీఎస్‌లో అది 7% అని గుర్తుచేస్తున్నారు. సకాలంలో గుర్తించి, వైద్యం అందిస్తే ఇబ్బంది ఉండదని, రాష్ట్రంలో చోటుచేసుకున్న రెండు మరణాలు ఆలస్యంగా ప్రభుత్వాస్పత్రులకు తీసుకురావడం వల్లే చోటుచేసుకున్నట్లు చెబుతున్నారు. శ్రీకాకుళం బాలుడి విషయంలో.. నాలుగైదు ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించాక.. ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ప్రకాశం జిల్లా మహిళ విషయంలోనూ.. నాలుగైదు ఆస్పత్రుల్లో చూపించాక.. గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వ్యాధి నిర్ధారణ, వైద్యం అందించడంలో ఆలస్యం కారణంగా.. ఈ మరణాలు సంభవించినట్లు వైద్యులు చెబుతున్నారు. లక్షణాలు కూడా ఒక్కొక్కరిలో ఒక్కోలా బయటపడుతున్నట్లు వివరిస్తున్నారు. కొందరిలో దగ్గు, జ్వరంతోపాటు.. వెంటనే కాళ్లు పట్టేయడం జరుగుతోందని.. మరికొందరిలో విరేచనాలతో లక్షణాలు ప్రారంభమవుతున్నాయని పేర్కొంటున్నారు. ఈ వ్యాధి చివరకు నరాల మీద ప్రభావం చూపి.. యాంటీబాడీలతో శరీరాన్ని దెబ్బతీస్తున్నట్లు తెలిపారు. నాడీవ్యవస్థ.. ఆపైన మెదడుపై ప్రభావం చూపుతోందని.. ఇదంతా 10-15 రోజుల వ్యవధిలో జరుగుతుందని చెప్పారు.



కమలమ్మ(ఫైల్)

## పిల్లలు, వృద్ధులపై ప్రభావం

జీబీఎస్ ఎక్కువగా చిన్నారులు, వృద్ధులపై ప్రభావం చూపుతోంది. చాలా మంది చిన్నారులు తమకు వచ్చే అనారోగ్య సమస్యలను స్పష్టంగా చెప్పలేరు. దాంతో.. చికిత్స సమయం దాటిపోయే ప్రమాదముంది. చిన్నారులకు ఇచ్చే పాలను బాగా వేడి చేసి, చల్లార్చి ఇవ్వాలని.. తాగునీటిని కూడా కాచి, చల్లార్చి ఇవ్వాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇది అంటు వ్యాధి కాకున్నా.. శరీరంలోకి ఎలా ప్రవేశిస్తుందో చెప్పలేమని, చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. కొవిడ్ సమయంలో మాదిరిగా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

## ఇంజెక్షన్ ధర రూ.30 వేల వరకు



జీబీఎస్‌కు అందించే వైద్యంలో ఉపయోగించే ఇవిఎనో గ్లోబినిస్ థెరపీ ఇంజెక్షన్ల కొరత ఎక్కువగా ఉంది. ప్రభుత్వం గుంటూరు, కాకినాడ, కర్నూలు, విశాఖపట్నం వంటి ముఖ్యమైన ఆస్పత్రుల్లో ఈ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచింది. ప్రైవేటు ఆస్పత్రుల్లో దీన్ని రూ.30 వేలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

# ఇన్సూరెన్స్ డబ్బుల కోసం బావ హత్య

**» సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో సొంత బావమరిది దాష్టీకం**

**» మృతుడి పేరిట ఇన్సూరెన్స్**

**» పథకం ప్రకారం నామినీగా తన పేరు**

అమీన్‌పూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పథకం ప్రకారం మూడు నెలల క్రితం బావ పేరిట డెత్‌క్లెయిం ఇన్సూరెన్స్ పాలసీ చేయించి, ఆ డబ్బు కోసం బావను సొంత బావమరిది హతమార్చాడు. ఈ ఉదంతం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో జరిగింది. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం సోమ్లాతండాకు చెందిన బానోత్ గోపాల్‌నాయక్ (42) అమీన్‌పూర్‌లో నివాసముంటున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ఆయన అమీన్‌పూర్ శివారులోని శ్మశానవాటిక వద్ద పొదల్లో దారుణ హత్యకు గురై కనిపించాడు. కుటుంబ సభ్యులు చేరుకుని మృతుడిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు ప్రారంభించారు. గోపాల్‌నాయక్‌ను సొంత బావమరిదే హత్య చేసినట్లు ప్రాథమికంగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. గోపాల్ నాయక్ ఏడాది క్రితం జేసీబీ కొనుగోలు చేసి కాంట్రాక్టు పనులు చేయిస్తున్నాడు. అతడి బావమరిది నరేశ్‌నాయక్ మాయమాటలు చెప్పి మూడు నెలల క్రితం పోస్టాఫీసులో గోపాల్‌నాయక్ పేరుమీద డెత్‌క్లెయిం పాలసీ తీసుకున్నాడు. నామినీగా తన పేరును రాయించుకున్నాడు. జేసీబీ, ఇన్సూరెన్స్ డబ్బులపై కన్నేసి ఎలాగైనా గోపాల్‌నాయక్‌ను హత్య చేయాలని నరేశ్ పథకం పన్నాడు. హత్యకు తన మేనమామ దేవీసింగ్ సహాయం తీసుకున్నాడు. శనివారం రాత్రి అమీన్‌పూర్ శివారులోని శ్మశానవాటిక వద్దకు గోపాల్‌నాయక్‌ను తీసుకెళ్లి చున్నీతో ఉరేసి దారుణంగా హతమార్చి అక్కడే పొదల్లో పడేసి పరారయ్యారు. నిందితులను అరెస్టు చేస్తే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.



గోపాల్‌నాయక్ (ఫైల్)

## బండరాయితో కొట్టి చంపి.. ముక్కలు చేసి కాల్చి

# లారీ డ్రైవర్ దారుణ హత్య

**» వివాహితుడైనా.. ఓ మైనర్ బాలికతో ప్రేమ**

**» కుమార్తెతో పిలిపించి హత్య చేసిన తండ్రి**

**» సంగారెడ్డి జిల్లాలో ఘటన**



దశరథ్(ఫైల్)

నారాయణఖేడ్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పెళ్లై ఇద్దరు పిల్లలకు తండ్రైన ఓ లారీ డ్రైవర్ .. ప్రేమంటూ ఓ బాలిక చుట్టూ తిరుగుతుండగా ఆమె తండ్రి సహించలేకపోయాడు. పథకం ప్రకారం తన కూతురితో ఫోన్ చేయించి అతడిని ఓ చోటుకి పిలిపించి బండరాయితో కొట్టి చంపేశాడు. ఆపై. మృతదేహాన్ని ముక్కలు చేసి పెట్రోలు పోసి నిప్పు పెట్టాడు. ఆ ముక్కలు పూర్తిగా కాలకపోవడంతో వాటిని సమీపంలోని గుట్టల్లో విసిరేసి రెండ్రోజుల తర్వాత వచ్చి పోలీసులకు లొంగిపోయాడు. సంగారెడ్డి జిల్లాలో జరిగిన ఈ ఘటనలో అంగోతు దశరథ్(26) అనే లారీ డ్రైవర్ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం నాగ్‌ధర్ పరిధిలోని రాంచందర్ తండాకు చెందిన అంగోతు దశరథ్.. సంగారెడ్డి సమీపంలోని ఓ చక్కెర పరిశ్రమలో లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. దశరథ్ భార్య సోనీ ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి కాగా ఆ దంపతులకు ఇప్పటికే ఇద్దరు పిల్లలు ఉన్నారు. దశరథ్ గతంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసిన సమయంలో నిజాంపేట మండలం మేగ్యానాయక్ తండాకు చెందిన నేనావత్ గోపాల్ కూతురు(14)తో పరిచయం పెంచుకున్నాడు.ప్రేమ పేరుతో రెండేళ్లుగా ఆ బాలికతో సన్నిహితంగా ఉంటున్నాడు. దీనిని సహించలేకపోయిన గోపాల్.. ఫిబ్రవరి 12న తన కుమార్తెతో దశరథ్‌కు ఫోన్ చేయించి పిలిపించాడు. ఆ సమయంలో సంగారెడ్డిలోని చక్కెర పరిశ్రమలో ఉన్న దశరథ్.. ఇంటికి వెళుతున్నానని చెప్పి అక్కడి నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. అయితే, మేగ్యానాయక్ తండా శివారు ఈదుల్‌తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో దశరథ్‌ను గోపాల్ హతమార్చాడు. అలాగే, దశరథ్ ద్విచక్రవాహనాన్ని కూడా కాల్చేశాడు. అనంతరం గోపాల్ తన కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై రాంచందర్ తండాకు వెళ్లి ఓ మేకను కొనుగోలు చేసినట్టు తెలిసింది. అయి తే, దశరథ్ ఆచూకీ తెలియకపోవడంతో అతని భార్య సోనీ ఈ నెల 14న సంగారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం 15న గోపాల్ చేసిన నేరాన్ని అంగీకరించి పోలీసులకు లొంగిపోయాడు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో ఈదుల్ తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం గాలించిన పోలీసులు దశరథ్ మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని దశరథ్ కుటుంబానికి అప్పగించారు.

## ఇద్దరు పిల్లలకు పురుగు మందు

# తాగించి.. తల్లి ఆత్మహత్య

**» ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పిల్లలు మృతి**

**» భర్త వేధింపులతో వివాహిత అఘాయిత్యం**



హారిక, కృష్ణంత్, మయంత్‌లక్ష్మి (ఫైల్)

పెగడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు, మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడాన్ని భరించలేక ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలకు పురుగుల మందు తాగించి తానూ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పిల్లలు మృతి చెందారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో ఈ నెల 13న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మద్దులపల్లి గ్రామానికి చెందిన కంబాల తిరుపతికి జగిత్యాలకు చెందిన హారిక (30)తో 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు కృష్ణంత్ (12), కుమార్తె మయంత్‌లక్ష్మి (10) ఉన్నారు. తిరుపతి వ్యవసాయంతో పాటు ఒగ్గు కథలు చెప్పడానికి వెళుతుండగా, హారిక వ్యవసాయ పనులకు వెళ్తుండేది. ఈ నెల 13న తిరుపతి వేరే గ్రామానికి ఒగ్గు కథ చెప్పడానికి వెళ్లగా, ఇంట్లోనే ఉన్న హారిక పురుగుల మందు తాగి ఇద్దరు పిల్లలకు తాగించి భర్తకు ఫోన్ చేసి తెలిపింది. వెంటనే కుటుంబసభ్యులు, గ్రామస్థులు చికిత్స నిమిత్తం వారిని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ హారిక ఈ నెల 14న మృతి చెందగా, పిల్లలు కృష్ణంత్, మయంత్‌లక్ష్మి ఆదివారం ఉదయం మృతి చెందారు. కొంతకాలంగా తిరుపతి వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతోపాటు తమ కూతురిని వరకట్నం తేవాలని వేధిస్తుండటంతోనే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టిందని హారిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పిల్లల మృతదేహాలను ఇంట్లోనే గొయ్యి తవ్వి పూడ్చిపెడతామని బంధువులు ఆందోళన చేయడంతో మద్దులపల్లి గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు వారికి నచ్చజెప్పి మృతదేహాలకు శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిపించారు.

వివిధ
vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

**అనువాద నవలల ఆవిష్కరణ**

చింతపట్ల సుదర్శన్ అనువాదం చేసిన ముల్క్‌రాజ్ ఆనంద్ 'అంటరానివాడు', ఆర్‌కె. నారాయణ్ 'మాల్గుడి' నవలల ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 17 సా.6 గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఈ పుస్తకాలను ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు, ఆర్.వి రామారావు ఆవిష్కరిస్తారు. అధ్యక్షత కవి యాకూబ్. మామిడి హరికృష్ణ, కె.పి. అశోక్ కుమార్, ఏనుగు నరసింహారెడ్డి, కె. ఆనందాచారి, కొండపల్లి నీహారిణి ప్రసంగిస్తారు.

పాలపిట్ట బుక్స్

**వట్టికోట నవలపై సదస్సు**

తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో వట్టికోట ఆళ్వారు స్వామి 'ప్రజల మనిషి' నవలపై 'అజరామర అక్షరం' పేరిట పరామర్శ సదస్సు ఫిబ్రవరి 23 ఉ.10గంటలకు కరీంనగర్ ఫిలిం భవన్‌లో జరుగుతుంది. ప్రధాన వక్త సంగిశెట్టి శ్రీనివాస్. నగునూరి శేఖర్, అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం ఇతర వక్తలుగా ప్రసంగిస్తారు.

సి. వి. కుమార్

**వేటకథలపై సదస్సు**

సాహిత్య అకాడెమీ-స్ఫూర్తి సాహితీ సమాఖ్య, యానాం సంయుక్త నిర్వహణలో 'వేట కథలు' సదస్సు ఫిబ్రవరి 23 తేదీ ఉ.10గంటల నుంచి సర్వశిక్షా అభియాన్ సమావేశ మందిరం, హైస్కూల్ రోడ్, యానాంలో జరుగుతుంది. స్వాగతం చింతకింది శ్రీనివాసరావు, అధ్యక్షోపన్యాసం సి. మృణాళిని, ముఖ్య అతిథి ఆర్. మునిస్వామి, గౌరవ అతిథి దాట్ల దేవదానం రాజు. అల్లం శేషగిరిరావు కథలపై వాసిరెడ్డి నవీన్, జె.పి. వైద్య కథలపై అవధానుల మణిబాబు, పతంజలి కథలపై జె. నీరజ, పూసపాటి కృష్ణరాజు కథలపై మందలపర్తి కిషోర్, ఇతర రచయితలు రాసిన వేట కథలపై అద్దేపల్లి ప్రభు ప్రసంగిస్తారు.

సాహిత్య అకాడెమీ

**కొలకలూరి పురస్కారాల ఫలితాలు**

కొలకలూరి భాగీరథీ కవితా పురస్కారానికి జూకంటి జగన్నాథం ('ఒక కప్పు చాయ్ - నాలుగు మెసేజ్‌లు'), కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారానికి టేకుమళ్ళ వెకంటప్పయ్య ('స్వర్గాదపి గరీయసీ'), కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారానికి గడ్డం మోహన్ రావు ('చిందోళ్ళ చరిత్ర, సంస్కృతి -సాహిత్యం') ఎంపికయ్యారు. వీరు ఒక్కొకరూ రూ.15 వేల నగదు బహుమతితో సత్కారాన్ని అందుకుంటారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 26న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది.

కొలకలూరి ఇనాక్

# జీవనానందమైన కవిత్వం

కవిత్వమే ఒక జ్వరమై నిలువెల్లా కుదిపేసిన రోజులు, మళ్ళీ ఆ కవిత్వమే మందై ఊరడించిన రోజులు కవిత్వ ప్రేమికులందరి జీవితాల్లోనూ ఉంటాయి. అట్లాంటి అనుభవాలే ఇంకా ఇంకా ఆకలిగా కొత్త కవిత్వాలను వెదుక్కునేలా చేస్తాయి. రాసేలా చేస్తాయి. "నీకై బ్రదుకే ఒక తపమై వెదుకాడా"నంటాడు శ్రీశ్రీ అట్లాంటి పలవరింత లోనే. కానీ ఏమిటా కవిత్వం, ఎప్పటిది? పసివయసు సంభ్రమపు కళ్ళను కట్టి కూర్చోబెట్టిన అక్షరాలెవరివి? యవ్వనోద్రేకాల హృదయాన్ని ప్రేమ మంత్రాలై శాంతింపజేసిన పాదాలెవరివి?



అక్షరాల పొత్తిళ్ళలోనే జీవితం మళ్ళీ దొరకనుందని నమ్మకం కలిగించిన క్షణాలను, తీర్చరితనాలు ఎరుగని తోడై అక్షర మొక్కటే సేదతీర్చిన క్షణాలను కానుకిచ్చిన కవులు ఎవరు? 'మాటలనియెడి మంత్ర మహిమ' తెలియకుండానే ఉద్వేగాలను కాగితం పైకి నెట్టుకుని కవిత్వంగా మలచుకున్న సందర్భాల సౌందర్యం ఎట్లాంటిది?

ఒక్కొక్క పుటా తిరగేస్తుంటే కాలాలు మెలిపడిపోయి, ఒక్కొక్క ముడిలో ఒక్కొక్క జ్ఞాపకం తగిలి పాఠకులను మంత్రముగ్ధుల్ని చేసే పుస్తకం ఎన్. వేణుగోపాల్ గారి 'కవిత్వంతో ములాఖాత్'. రాజకీయార్థ విశ్లేషకుడిగా పిలిపించుకోవడం తనకిష్టమని చెప్పుకునే వేణుని ఈ పుస్తకం కవిగానూ, కవిత్వ ప్రియుడిగానూ సరికొత్తగా పరిచయం చేస్తుంది. ఊహ తెలిసిన నాడే చెవిన పడ్డ భక్తి కవిత్వాలు మొదలు విద్యార్థి దశలో ప్రభావితం చేసిన రాజకీయ కవిత్వం దాకా; ప్రాచీన కవిత్వం నుండి పాశ్చాత్య దేశాల కవిత్వం దాకా; ప్రభావాల నుండి పశ్చాత్తాపాల దాకా; రాయకుండా ఉండలేకపోయిన క్షణాల నుండి రాయని కవితల దాకా; కోపాల నుండి కన్నీళ్ళ దాకా... ఈ పుస్తకం ఒక ఉద్వేగాల పుట్ట.

ఒక గొప్ప కవిత తన మనసులో ఎలా అంకురించిందో కవి చెప్పలేకపోవచ్చునేమో కానీ, తనకు రససిద్ధి కలిగించిన కవితను తొలిసారి చదివిన క్షణాలను పాఠకుడు అంత త్వరగా మర్చిపోడు. ఆ ఉద్వేగభరితమైన క్షణాలను ఇతరులతో పంచుకునే ప్రయత్నం చేసినప్పుడు, ఆ కవిత లోని బలమేమిటో స్పష్టమవడం ఒక్కటే కాకుండా, ఆ కాసిన్ని అక్షరాలతో ఒక మనిషి మరొక మనిషి మీద నెరపిన ప్రభావం కూడా అర్థమై, రాత అన్న ప్రక్రియ మీద గౌరవమూ ప్రేమా పెరుగుతాయి. ఈ సంపుటిలో వేణు ప్రస్తావించిన కవితలన్నిటి వెనుకా బలమైన జీవన నేపథ్యముంది. ఆయా కవితల నుండి విడదీసి చూడలేని సామాజిక రాజకీయ లేదా వ్యక్తిగత సందర్భముంది. రహస్యంగా తన జీవితం మొత్తాన్నీ పెనవేసుకున్న కవిత్వోద్వేగాన్ని ఒక మనిషి పునశ్చరణ చేసుకోవడముంది. ఎన్ని సందర్భాలు వేణుకి కవిత్వమూ జీవితమూ వేరు కాదని చెప్పాయో, అంతకన్నీ నిరూపించాయి కూడా.

పుస్తకంలో పంజాబీ కవి అవతార్ సింగ్ పాష్ గురించి రాసిన వ్యాసంలో– న్యూయార్క్ వీధుల్లో, ఒక టాక్సీలో డ్రైవర్‌తో మొదలైన మామూలు సంభాషణ కవిత్వంలోకెలా మళ్ళిందో, వాళ్ళు ఇద్దరూ కలిసి తమకు ఇష్టమైన కవిని ఎలా స్మరించుకున్నారో, ఎంత ఉద్వేగానికి లోనయ్యారో, ఒళ్ళు గగుర్పొడిచే కథనంతో రాసుకొస్తారు వేణు. "సబ్ సే కతర్నాక్ హోతా హై హమారే సప్నోఁ కా మర్నా" (మన కలలు చనిపోవడం అన్నిటి కన్నా ప్రమాదకరం) అని ఒక కవి రాసిన గీతాన్ని ఇట్లా అపరిచితులు గొంతు కలుపుకుంటూ పరాయి దేశంలో పాడుకోవడం కవికీ కవిత్వానికీ ఎట్లాంటి గౌరవం!


కైఫీ ఆజ్మీ కవిత్వం గురించి రాసిన వ్యాసం కూడా అట్లాంటిదే. కవిత్వమొక్కటే కాదు, దాని చుట్టూ ఉన్న జీవితం కూడా ఈ వ్యాసాల్లో కుదురుకున్నందుకేమో, ఈ పుస్తకం మామూలు కవిత్వ పుస్తకాల్లా అంతా ఒకేసారి చదవలేమనే ఇబ్బంది కలిగించదు. విప్లవం కూడా సరిగ్గా ప్రేమలానే ఒక కవితాత్మక భావన అన్న వాక్యానికి ఈ పుస్తకంలో దొరికిన వివరణ, తొలియవ్వన కాలాల్లోని విలువలను, ఆదర్శాలనూ మళ్ళీ కళ్ళ ముందుకు తెచ్చి హృదయాన్ని బరువెక్కిస్తుంది. అట్లానే వ్యాసాల్లో

**తెలుగులో ప్రస్తుతం, స్నేహితులైనందుకు తప్పక వెల్లడయ్యే పొగడ్తలున్నాయి. భావజాలానికి భిన్నంగా ఉన్నందుకు వచ్చిపడే విమర్శలున్నాయి. కానీ, సాహిత్య సందర్భాన్ని పంచుకుంటూ సాహిత్యం మీద ప్రేమ పెంచే పుస్తకాలు ఇప్పటి అసలు సిసలు అవసరం. కవిత్వం అర్థం కాని పదార్థమై జనాలకు ఎడమైపోకుండా ఉండాలంటే, కవిత్వంతో ముడిపడ్డ జీవితం మొత్తాన్నీ అక్షరబద్ధం చేసి ఉత్సవం చేసుకున్న ఇలాంటి పుస్తకాలు రావాలి.**

ఎక్కడికక్కడ కూర్చిన కవితల ఎంపిక, ఆ కవితల్లోని అందం రీడబిలిటీకి అదనపు బలం. కైఫీదే 'ముద్దు' అన్న కవిత:

"ఈ సౌందర్యభరితమైన కళ్ళను ముద్దాడినప్పుడల్లా
కటికచీకటిలో వందల దీపకళికలు వెలుగుతాయి
పూలూ, మొగ్గలూ, జాబిల్లీ,
నక్షత్రాలూ మాత్రమే కాదు
ప్రత్యర్థి కూడా ఆమె పాదాల
ముందు మోకరిల్లుతాడు."

ఒక నచ్చిన కవిత కోసం వెదుక్కోవడం, ప్రత్యేకించి అది వేరే దేశానిదైతే ఈ వెబ్ సెర్చ్ కాలాలకు ముందు ఆ వెదుకులాటలో ఉన్న తపన, ఆ వెదికింది దొరికితే అందే మహదానందం, నెరుడా మీద రాసిన వ్యాసంలో కనపడుతుంది. నెరుడా 'పోస్ట్‌మాన్' కథ కూడా వేణు అనువాదం చేశారు. అది నవలికే కానీ ఆ చిన్నపుస్తకం నిండా పరుచుకున్న కవిత్వ సౌందర్యానికి, శక్తికీ ఇది కూడా ఈ సంపుటిలో చేర్చవలసిన విషయమే.




గంభీరంగా చెప్పాలన్న ఆకాంక్షవల్లో ఏమో తెలుగు సాహిత్యంలో కవిత్వ విమర్శ, పరామర్శ కూడా చాలాసార్లు రసహీనంగా ఉంటాయి. రచనకు ఎడంగా నిలబడి పరామర్శించడం లోని నిష్పాక్షికత కన్నా, రచనతో మమేకమై పొందే అనుభవాన్ని పంచుకునే నిజాయితీ ఏ రకంగానూ తక్కువ కాదని ఈ పుస్తకం చదివితే నాకు అనిపించింది.

అనువాదాలేమిటీ, వార్షిక కవిత్వ సంకలనాలేమిటీ, 'పోయమ్స్ దట్ మేక్ గ్రోన్ మెన్ క్రై' లాంటి పుస్తకాల హృదయమేమిటీ - ఈ 'కవిత్వంతో ములాఖాత్' ఎన్నెన్ని విశేషాలను సహృదయస్పందన అన్న దారానికి కట్టిచూపిందో లెక్కే లేదు. 'సృజన' పత్రిక, బెజవాడ రోజులు ఒక తరం సాహిత్య చరిత్రను చెప్పినట్టే ఉన్నాయి. ఒక మాట నుండి ఇంకో మాటకి, ఒక కవిత నుండి ఇంకో కవితకి, ఇంకో పుస్తకానికి, అలవోకగా పాఠకుడిని లాక్కెళ్ళింది ఈ పుస్తకం. ఊరికే తీసుకువెళ్ళడమే కాదు, పాఠకుడు తాను స్వయంగా ఇవన్నీ వెదుక్కుని చదివేందుకు సమాయత్తపరచింది.

ఎందుకు ఇవన్నీ చెప్పుకోవాలి, నచ్చిన కవితలను ఎందుకు మననం చేసుకోవాలి? ప్రభావాలను గమనించుకోవడం, వాటిని వేణులా హృదయం పరిచి పంచుకోవడం సృజనాత్మకతను తట్టి లేపడానికి అతి సులభమైన, అత్యంత ప్రభావవంతమైన మార్గాలు. రాసుకోవడానికి జీవితం ప్రసాదించే వేల సందర్భాలను ఉదహరిస్తూ, "రాయాలి" అన్న ఊహనివ్వడం, "రాయగలను" అన్న నమ్మకాన్నివ్వడం మామూలు విషయాలు కావు. కవితలను జ్ఞాపకాల దీపకాంతిలో ఎత్తి చూపిస్తూ, ఏ వ్యక్తీకరణల్లో ఏ కొత్తదనం గల్లంతు చేసిందో గమనించుకోవడం రాసేవాళ్ళకు మరీ ఉపయోగకరం. ఆ రకంగా, ఈ పుస్తకం ఒక అధ్యయన గ్రంథం. కవిత్వం రాయడానికి పాఠాలు, ప్రత్యేకంగా క్లాసులు ఉండవు. ఉన్నా అవేం పని చేస్తాయన్న ఆశ నాకైతే లేదు. కవిత్వంతో ఈ తరహాలో మమేకమవ్వడం ఒక్కటే దానికి మార్గం.

తెలుగులో ప్రస్తుతం, స్నేహితులైనందుకు తప్పక వెల్లడయ్యే పొగడ్తలున్నాయి. భావజాలానికి భిన్నంగా ఉన్నందుకు వచ్చిపడే విమర్శలున్నాయి. కానీ, సాహిత్య సందర్భాన్ని పంచుకుంటూ సాహిత్యం మీద ప్రేమ పెంచే పుస్తకాలు ఇప్పటి అసలు సిసలు అవసరం. కవిత్వం అర్థం కాని పదార్థమై జనాలకు ఎడమైపోకుండా ఉండాలంటే, కవిత్వంతో ముడిపడ్డ జీవితం మొత్తాన్నీ అక్షరబద్ధం చేసి ఉత్సవం చేసుకున్న ఇలాంటి పుస్తకాలు రావాలి. దేశాలకూ భాషలకూ అతీతంగా మనుషులను ఏకం చేసే కళను, పొంగిపోయే హృదయంతో ఇట్లా స్మరించుకోవడం తెలియాలి. సుకవి జీవించు ప్రజల నాల్కల యందు అన్న మాటలను నోరు విప్పి నిజం చేయడం కావాలి. మన మన ఏకాంత మందిరాల్లో, నవ్వుల్లో, నిస్సత్తువగా సోలిపోయిన నీరసపు క్షణాల్లో, నిరసనల్లో, స్నేహాల్లో, ప్రేమల్లో – అమాంతం వచ్చి హత్తుకునే కవిత్వ పాదాలకు మొక్కి ఇట్లా, గుండెల మీదే ఉండనివ్వాలి.

■ మానస చామర్తి
manasa.chamarthi@gmail.com



## కలస్వనం

మాట్లాడుకోవాల్సింది చానా వుండి
మౌనం సమాధి పలకల సాంద్రమైంది

దిగులు చీకటి
రెక్క విచ్చుకుని వాలింది
ఒంటరి వృక్షం కొమ్మకొమ్మనా
జ్ఞాపక పిచుకల పలవరింతలు
సద్దు పరిచే దిమ్మిస చప్పుళ్ళ
విస్కీ వగరు చప్పరింతలు
విఫల యత్నాలు

రేపటి సూర్యుడు
దీప ఖడ్గాన్ని బూని
మిత్రహరితం పొట్లం కట్టి తెచ్చాడు
విప్పదీయ
నిన్న లేనిదేదో వుండి
దినాన్ని దినుసుమీఠ చేస్తుంది
జీవ జవం కూడదీసుకుని
కొత్త చివురు వేయ

పలుకు తీపి పలుకులాయే
మరి
అది
నీతో నువ్వయినా!

■ పిన్నంశెట్టి కిషన్
✆ 97002 30310

## నా మొదటి పుస్తకం

బివివి ప్రసాద్


# బయటి చూపు లోపలికి మళ్ళాక రాసుకున్న కవితలు

"ప్రభూ! నిన్ను సేవించుదామని ఎన్నో సుందర పుష్పాలు ఏరి తెచ్చాను. తుదకు వాటి సౌందర్యంపై మోహంతో నిన్నే విస్మరించాను" చలం అనువదించిన టాగోర్ కవిత్వం చదువుకున్నాక రాసుకున్న వాక్యాలివి.



కవిత్వం పలికితే రాయటమే గానీ, పనిగట్టుకు రాయటం లేదు. ఇంటర్ చదివే రోజుల్లో సహజంగా ఉండే ఉద్రేకాలతో పాటు, శ్రీశ్రీ, సామ్యవాద సాహిత్యాల ప్రభావంతో సమాజాన్ని మార్చాలనే ఆవేశంతో రాస్తున్న కవితలు, టాగోర్‌ని చదివాక ఆగిపోయినట్టున్నాయి. బయటి చూపు లోపలికి మళ్ళాక, మారాల్సింది నేను అనిపించాక, రాసుకొనే కవిత్వం మారింది. దైవం, ప్రకృతి, మృత్యువు, ప్రేమ వంటి ఉదాత్తభావాలు కవితా వస్తువులయాయి.

డిగ్రీ చివర్లో, 1986లో చలం రాసిన 'భగవాన్ స్మృతులు' పుస్తకం దొరికింది. ఒక ఆధ్యాత్మిక గురువు అత్యంత సరళంగా, సహజంగా, సూటిగా, దయగా ఉండటం గమనించి శ్రీ రమణ మహర్షి పట్ల గురుభావం కలిగింది. వారి సహేతుకమైన బోధ 'నిన్ను నీవు తెలుసుకో' జీవిత లక్ష్యమైంది. ఆ తర్వాత వచ్చిన కవితలని, ఇంటర్ లోని తెలుగు మాష్టారు జీయస్వీ నరసింహా రావుగారికి చూపిస్తే, చాలా బాగా రాస్తున్నావన్నారు. 1989లో వీటిని పుస్తకంగా తీసుకురావాలనిపించింది.




మా ఊరు తణుకులో సాహిత్య వాతావరణం చైతన్యవంతంగానే ఉండేది. నన్నయ్య భట్టారక పీఠం, రీడర్స్ ఫోరం సాహిత్య సభలు జరిపేవి. అయితే, స్వతహాగా ఉన్న బిడియం వల్ల ఎవరినీ కలవటం జరగలేదు.

సంస్కృతాంధ్రాల్లో పండితులైన చెరువు సత్యనారాయణ శాస్త్రిగారి దగ్గర కూర్చుని ఎడిట్ చేద్దాం అన్నారు జీయస్వీగారు. ఎడిటింగ్‌కి ముందు కొన్ని చిత్రమైన ప్రశ్నలు అడిగారు శాస్త్రిగారు. రైలు ఎక్కటానికి స్టేషన్‌కి టైముకి వెళతావా, ముందుగానా వంటివి. జవాబులు విని, నీ సాహిత్యం ప్రసిద్ధి పొందుతుంది వంటి మాటేదో అన్నారు. ఎడిటింగ్ జరిగింది. నేను చదవటం, వారిద్దరూ విని, సరి చేయటం. ముందుమాట అడిగితే రాసుకోమని, చెప్పుకుంటూ వెళ్ళారు శాస్త్రిగారు. ఆరాధన టైటిల్ నేననుకున్నానో, వారు చెప్పారో గుర్తులేదు. ఆరాధన భగవాన్‌కి అంకితమైంది.

మా ఊరిలోనే రవి ప్రింటర్స్ లో పుస్తకం అచ్చుకి ఇచ్చాను. కవర్‌పై నా ఫోటో వేసుకోవాలనే ఆలోచన అప్పటికే ఉన్నట్టుంది. పాలంగి లోని రాయల్ ఆర్ట్స్ దగ్గరికి వెళ్ళి, ఫోటో ఇచ్చి, బొమ్మ గీయించాము. 1989 చివర్లో పుస్తకం వచ్చింది. ఆవిష్కరణ సభ తలపెట్టలేదు. తొలికాపీ దేవుడి దగ్గర పెట్టి ఉంటాను. లేదా తల్లిదండ్రులకి ఇచ్చి వుంటాను. కొన్ని పత్రికలకి సమీక్షలకి పంపి ఊరుకున్నాను.

తర్వాత చలంగారి సన్నిహితులు చిక్కాల కృష్ణారావుగారికి పంపిస్తే, వారంలో ఉత్తరం వచ్చింది. మరునాడు ఇద్దరు వ్యక్తులు ఇంటికి వచ్చారు కృష్ణారావుగారు చెప్పారంటూ. ఆలపాటి రాంబాబుగారు, పుల్లేశ్వరరావుగారు. 2018లో వెళ్ళిపోయేవరకూ, సుమారు మూడు దశాబ్దాలు లోపలి అన్వేషణలో సహచరుడిగా, సంక్లిష్ట సమయాల్లో ఆప్తుడిగా ఉన్నారు రాంబాబుగారు.

తర్వాత రోజుల్లో చిరునామాలు దొరికిన ప్రముఖులకి పుస్తకాలు పంపించాను. "మీవి మాటలతో రాయబడినప్పటికీ, మాటలను దాటి వెళ్ళిపోయాయి, సంవేదనా జగత్తును వదిలి, శుద్ధవేదనా జగత్తుకు" అన్నారు సంజీవదేవ్. "కవి తన్ను తాను వెదుక్కునే ప్రయత్నంలోనే కవిత్వం పుడుతుంది. అందుకనే నిజమైన, స్వచ్ఛమైన కవిత్వం రాయగలిగారు" అన్నారు ఇస్మాయిల్. "పట్టుపురుగులోంచి పట్టు వచ్చినట్టు, మీలోంచి కవిత్వం నిర్గతమవుతోంది" అన్నారు శేషేంద్ర.

2017లో ఆరాధన మూల కవితలు చదివితే, ఎడిటెడ్ కన్నా అవే మరింత సహజంగా తోచాయి. వాటినే కాలక్రమంలో కూర్చి, ఆరాధన రెండో ప్రతి తయారు చేసి ఆన్లైన్ లో ఉంచాను. కవర్ పై సవరించిన ప్రతి అని రాశాను గానీ, నిజానికి సవరించని ప్రతి అని రాయాలి.

1994లో తణుకు వచ్చి, నన్ను వెదికి పట్టుకున్న కొప్పర్తి గారి స్నేహం తర్వాత, 1995 లో నా తొలి హైకూ సంపుటి 'దృశ్యాదృశ్యం' వచ్చింది. తణుకులో ఆవిష్కరణసభకి చేరా, ఇస్మాయిల్, కె. రామ్మోహన్ రాయ్ గార్లు వచ్చారు. బివివి ప్రసాద్ అప్పటి నుండి సాహిత్య ప్రపంచానికి తెలియటం మొదలైంది. తర్వాతి కాలంలో నాగభైరవ, ఓల్గా, అద్దేపల్లి 'ఆరాధన' చదివి సాంద్రమైన అనుభూతితో స్పందించారు.

■ 90320 75415

# అతి అలంకారాల్లేని కవిత

ప్రియ పద్యం



గాఢ అనుభూతిని చిక్కటి కవిత చేయడం ఒక పద్ధతి. ఓ మామూలు భావనను సింపుల్ నరేటివ్‌గా కవిత చేయడం ఇంకో పద్ధతి. కవి సామర్థ్యం ఆయా కవితల నాణ్యతను నిర్ణయిస్తుంది. నిర్గుణ్ రెండో పద్ధతిలో అల్లిన కవిత 'Outdated Parents'.

ముందుకెళ్ళిపోయిన తరం వెనక్కైనా తిరిగి చూడకుండా నడిచొచ్చిన దారి తెలివి తేటలను తూకంవేసి అవి తుక్కు అని నిర్దాక్షిణ్యంగా ముద్ర వేయడం ఇక్కడ ఇతివృత్తం.

ప్రతి తరం తన ముందు తరంతో ఎలా వ్యవహరించిందో అదే విధంగా తన తరువాతి తరం తనతోనూ వ్యవహరించడం అనే సహజ న్యాయసూత్రాన్ని సహించలేకపోవడంలోని ప్రహేళికను కవి సమర్థంగా పొరలు పొరలుగా పేర్చుకుంటూ పోయాడు. నాకు బాగా నచ్చిన అంశం కవి తన సారాన్ని రూపంతో అతిగా అలంకరించకపోవడం. మేఘాలు, పూలు, తేనెలు, పక్షులను అక్కడక్కడా చల్లకపోవడం. రూపకాన్నో ఇంకేదో అలంకారాన్నో పట్టుకు వేళ్ళాడకపోవడం. తన భావనను సూటిగా బాణమంత నేరుగా గురిపెట్టడం.

ముసలోళ్లను పర్ణశాలల్లో పడేయడమే కాదు మీకేమీ తెలియదు అనడం కూడా వదిలించుకోవడమేనని కవి చెప్పాడు. ఈ వదిలించుకోవడమనే డిలీట్ ఆప్షన్ ఇప్పుడు మానవ జీవన కీ బోర్డులో కీలకం అని, తరాల అంతరాలలో deletion is key అనీ చెపుతున్నాడు కవి. దాన్ని ముందు తరాలకోసం కొత్త తరమే ఆవిష్కరించాలని కల కంటున్నాడు కవి.

అవుట్‌డేట్ అనే పాతముద్రకూ అప్‌డేట్ అనే పాదముద్రకూ మధ్య జరిగే సంఘర్షణలో తల్లితండ్రుల వేదనను సంయమనంతో నిర్వహించడం కవి గొప్పతనం. ఎక్కడా తరవాతి తరాన్ని తిట్టకపోవడం, నిందించకపోవడం నాకు నచ్చిన మరో అంశం.

ఇప్పుడిది నిస్సందేహంగా మంచి కవిత. నిర్మాణం విషయంలో ఇంకొంచెం శ్రద్ధ పెట్టి ఉంటే గొప్ప కవిత అయి ఉండేది. ఎంచుకున్నది కొత్త ఇతివృత్తం కనుకా, ఇతివృత్త ప్రధాన కవిత కనుకా కవిని ఆ మేరకు క్షమించేసి మనస్ఫూర్తిగా అభినందించవచ్చు.

■ ప్రసేన్

## Outdated Parents

**సరే... అన్నీ మీకే తెలుసు!**
ఊరోళ్లమేనని చెప్పుకోవడానికి మేం సిగ్గుపడం

సరే.. మీ భాషలో మేం అవుట్‌డేటెడ్

మా కాలం లోనే ఇంకా ప్రయాణిస్తూ
మీ కాలపు ఉరుకు పరుగులలో
మేమింకా వెనుకబడేవున్నాం

ఆట బొమ్మలతో ఎలా ఆడుకోవాలో
మీకు నేర్పిన మమ్మల్ని
ఎలా బుడి బుడిగా నడవాలో
ఎలా ముద్దుముద్దుగా మాట్లాడాలో
మీకు నేర్పిన మేం
అవుట్‌డేటెడ్ అయ్యామా
అవుట్‌డేటెడ్ చేశారా

ఈ కాలం మీ కాలంలా లేదని
మాకెందుకు మీరు విడమరచి చెప్పడం లేదో
ఏదీ చెప్పకుండానే మీకేం తెలియదులే అని
మమ్మల్ని Outdated Parents ని
ఎందుకు చేస్తున్నారో తెలియడం లేదు

నీకేం తెలియదు డ్యాడ్ నీకు తెలియదులే మమ్మీ
అనే మాట కూడా ఒకటుంటుందని
మీరు పలికాకే మేము కూడా ఈ మాటను
మా అయ్యా అమ్మలపై వాడామని

ఇప్పుడిప్పుడే గుర్తుకొస్తోంది

మీలా ఇన్ని గందరగోళాలు
మా మెదడు కీ బోర్డులో అప్పట్లో లేక
ఆ మాటను మేమూ అప్పుడు డిలీట్ కొట్టలేదు

ఆ మాట
ఇప్పుడు మీరూ డిలీట్ చేసుకోలేరు
మీ తరం కూడా డిలీట్ చేసుకోవడానికి అంగీకరించదేమో
Updated Children కదా మీరు
మీ దగ్గర బోలెడు డిలీట్ ఆప్షన్స్ ఉంటాయి కదా


బోధి వృక్షాలున్నాయి తథాగతుడే లేడు
ఏ తరంలోనైనా ఆ మాట
తల్లిదండ్రుల మనసులు తెగేసే ఖడ్గమవుతుంది

అనాథ శరణాలయాల్లో పడేయడం మాత్రమేనా
ఊర్కోండంటూ తల్లిదండ్రుల్ని తోసిరాజనడమూ
అవుట్‌డేటెడ్ పేరెంట్స్ అని గంట కట్టడమే

ఇప్పుడిక డిలీషన్ సాఫ్ట్‌వేర్ కావాలి
లేకుంటే రాబోయే తరాలు
అసలు డిలీట్ ఆప్షన్ లేకుండానే పుడతాయి

తరతరాలుగా ఇది తీరం దాటని తుఫాన్
నిత్యం కురుస్తూనే ఉంటుంది కుండపోతగా...

■ ఇబ్రహీం నిర్గుణ్




**పల్లా కవితా పురస్కారం**


'పల్లా జాతీయ కవితా పురస్కారం 2025' కోసం తెలుగు కవులు తమ కవితా సంపుటాలను పంపగోరుతున్నాం. ఉత్తమ కవితా సంపుటి కవికి రూ.7500 నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపిక, శాలువాతో సత్కారం ఉంటుంది. మీ వచన కవితా సంపుటాలు మూడు కాపీలను మార్చి 15లోపు చిరునామా: పల్లా కృష్ణ, CSSR & SRRM డిగ్రీ పీజీ కళాశాల, 13-522, రెడ్డి కాలనీ, కమలాపురం - 516289, వైఎస్ఆర్ కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్‌కు పంపాలి. ఫోన్: 9985193868.

పల్లా కృష్ణ

**పెన్నా సాహిత్య పురస్కారం**

పెన్నా రచయితల సంఘం, నెల్లూరు ఇచ్చే పెన్నా సాహిత్య పురస్కారానికి జనవరి 2023 నుంచి డిసెంబర్ 2024 వరకు ముద్రితమైన కవితా సంపుటాలు మూడు కాపీలను మార్చ్ 31 లోగా పంపాల్సిన చిరునామా: గోవిందరాజు సుభద్రాదేవి, ఇం.నెం.26-15-494, స్నేహ నగర్, కొండాయపాలెం రోడ్, నెల్లూరు - 524004. వివరాలకు ఫోన్: 9848627158.

పెన్నా రచయితల సంఘం



# పండ్ల మార్కెట్ పూర్తయ్యేదెన్నడో?

2022 మార్చిలో వరంగల్ లక్ష్మీపురంలోని పండ్ల మార్కెట్‌ను కూల్చేస్తున్న దృశ్యం



- రూ.27 కోట్లతో లక్ష్మీపురంలో పనులకు శ్రీకారం
- మూడేళ్లయినా ముందుకుసాగని నిర్మాణం
- ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డ వ్యాపారులు
- మామిడి సీజన్ వస్తున్నా పట్టించుకోని అధికారులు
- బిల్లులు రాలేదని చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- అగమ్యగోచరంగా లక్ష్మీపురం మార్కెట్ పరిస్థితి
- పాలకులు చొరవ చూపాలంటున్న ఫ్రూట్ మర్చంట్స్

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మబ్బును చూసి ముంత ఒలకబోసుకున్నట్టు ఉంది వరంగల్ లక్ష్మీపురంలోని పండ్ల మార్కెట్ వ్యాపారుల పరిస్థితి. నూతనంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తామని చెప్పిన అధికారులు.. మూడేళ్ల కిందట ఉన్న మార్కెట్‌ను కూల్చేశారు. దీంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. తమ వ్యాపారం ఇంకా బాగా సాగుతుందని ఆశపడ్డారు. కానీ వారి ఆశలు అడియాశలయ్యాయి. మూడేళ్ల కిందట ప్రారంభించిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అదేమంటే.. చేసిన పనులకు బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ కరాఖండిగా చెప్పేస్తున్నాడు. మరోవైపు దీనిపై ఆధారపడిన వ్యాపారులు రోడ్డున పడ్డారు. ఉపాధి కరువై.. కుటుంబపోషణ భారమై ఎలాగోలా కాలం వెల్లదీస్తున్నారు.

### ఉన్నఫలంగా కూల్చేశారు..

ఏటా కోటి నుంచి రెండు కోట్ల రూపాయల పన్ను కట్టే పండ్ల వ్యాపారుల దుకాణాలను అధికారులు ఉన్నఫలంగా కూల్చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తామంటూ ఆశలు కల్పించారు. పోనీ ఇచ్చిన మాట నిలుపుకున్నారా.. అంటే అదీ లేదు. మూడేళ్లుగా పనులు సా...గుతూనే ఉన్నాయి. ఎప్పుడు పూర్తవుతాయో తెలియని దుస్థితి నెలకొంది. వ్యాపారులంతా చెట్టుకొక్కరు.. పుట్టకొక్కరు అన్నట్లు చెల్లాచెదురైపోయారు. వ్యాపారాలు సాగక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. మరోవైపు హామీ ఇచ్చిన అధికారులు అదిగో ఇదిగో.. అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప సమస్యను పట్టించుకోవడంలేదు.

### రూ.27 కోట్లతో పనులు ప్రారంభం

వరంగల్ లక్ష్మీపురం పండ్ల మార్కెట్‌ను కూల్చివేసి సుమారు రూ.27 కోట్లతో 2022లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం తలపెట్టారు. యేడాదిలోగా పనులు పూర్తి చేస్తామని పండ్ల వ్యాపారులను ఒప్పించి దుకాణాలను కూల్చివేశారు. ఇప్పటికీ మూడేళ్లు గడుస్తున్నా.. పనులు పూర్తి కాలేదు. కాంట్రాక్టర్‌ను అడిగితే ఇప్పటికే సుమారు రూ.14కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ డబ్బులు వస్తేనే మిగతా పనులు చేస్తామని చెపుతున్నారు. దీంతో ప్రభుత్వం ఆ డబ్బులు ఇచ్చేదెపుడు..? కాంట్రాక్టర్ మిగతా పనులు చేసేదెప్పుడు? అంటూ వ్యాపారాలు నిట్టూరుస్తున్నారు.

### మామిడి సీజన్ వస్తోంది..

మార్చి నుంచి మే నెలాఖరు వరకు మూడునెలల పాటు మామిడి పండ్ల సీజన్ ఉంటుంది. చుట్టుపక్కల జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు మామిడికాయలను ఇక్కడికి తెచ్చి విక్రయిస్తుంటారు. సీజన్‌లో లక్ష్మీపురం పండ్ల మార్కెట్ వద్ద ట్రాఫిక్ జామ్ అవుతుందంటే.. వ్యాపారం ఏ స్థాయిలో కొనసాగుతుందో అర్థం చేసుకోవచ్చు. పదేళ్ల నుంచే మామిడి మార్కెట్ కోసం 20ఎకరాల స్థలం కేటాయించాలని వ్యాపారులు మార్కెట్ అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతూ వస్తున్నారు. 2022లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంతో ఉన్న దుకాణాలను కూల్చివేయడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వ్యాపారులు పొదుపు చేసుకొని ధర్మారం వద్ద కొనుగోలు చేసిన నాలుగు ఎకరాల స్థలంలో తాత్కాలికంగా మార్కెట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అయితే అది కూడా సీజన్‌లో సరిపోవడంలేదని వ్యాపారులు అధికారులకు, చాంబర్ ఆఫ్ కామర్స్‌కు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నారు. దీంతో మామిడి మార్కెట్ కోసం ఏనుమాముల మార్కెట్ పరిధిలోని ముసలమ్మకుంట గోదాముల వద్ద ఉన్న పదెకరాల స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్, మార్కెటింగ్‌శాఖ రీజియన్ జాయింట్ డైరెక్టర్, ఉన్నతశ్రేణి కార్యదర్శి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు చూసి మార్కెట్ ఏర్పాటుకు సంసిద్ధత తెలిపారు. తాత్కాలికంగా షెడ్లు నిర్మించి, టాయ్‌లెట్స్, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తామని, ఈ వచ్చే మామిడి సీజన్ వరకు ఏర్పాట్లు అన్ని చేస్తామని మూడు నెలల క్రితమే చెప్పారు. కానీ ఇప్పటి వరకు పనులు కార్యరూపం దాల్చలేదు.



ఏనుమాముల ముసలమ్మకుంట గోదాముల పరిసరాలను పరిశీలిస్తున్న మార్కెట్ పాలకవర్గం

### మామిడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు..

**వెల్డి సాంబయ్య, ఫ్రూట్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు**



వరంగల్ మామిడికాయలకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఇతర రాష్ట్రాలకు ఇక్కడి నుంచి ఎగుమతులు జరుగుతాయి. దాంతో పాటు ఇక్కడ మంచి ధర పలుకుతుందని మామిడి రైతులు సైతం చుట్టుపక్కల జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఇక్కడికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఏనుమాముల ముసలమ్మకుంట వద్ద వెంటనే మామిడి మార్కెట్ ఏర్పాటు చేస్తే బిజినెస్ బాగా సాగుతుంది. రైతులతో పాటు వ్యాపారులకు మేలు జరుగుతుంది. ఈ విషయంలో మార్కెటింగ్‌శాఖ అధికారులు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. వెంటనే పనులు చేపట్టి ఈ సీజన్‌లోనే క్రయవిక్రయాలు జరిగేలా చూడాలి. అదేవిధంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు కూడా పూర్తి చేసి వ్యాపారులకు దుకాణాలు కేటాయించాలి.



గద్దెల ప్రాంగణంలో భక్తులు

# అదే భక్తి.. అవే మొక్కులు..

- మేడారంలో తగ్గని భక్తజన సందోహం
- తల్లులను దర్శించుకున్న సుమారు లక్ష మంది
- వారాంతపు సెలవు కావడంతో భారీ సంఖ్యలో రాక

తాడ్వాయి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మేడారంలోని వనదేవతల సన్నిధి భక్తులతో కిటకిటలాడింది. నాలుగు రోజులపాటు జరిగిన మినీ జాతర శనివారం ముగిసినా సందడి నెలకొంది. ఆదివారం కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి వనదేవతలను దర్శించుకున్నారు. వనదేతలను సుమారు లక్ష మంది దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో పూజారుల గద్దెల వద్ద ఉంచి భక్తులకు పూజలు చేసి అమ్మవార్ల ఆశీస్సులతో పాటుగా దర్శనభాగ్యం కల్పించారు. ముందుగా జంపన్నవాగులో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. సమ్మక్క, సారలమ్మల నామాన్ని జపిస్తూ గద్దెల వద్దకు చేరుకున్నారు. ఎత్తు బంగారంతో క్యూలైన్ల ద్వారా అమ్మవార్లను దర్శించుకొని ఎత్తుబంగారం, పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారెలు, కొబ్బరికాయలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం వారాంత సెలవు కావడంతో భక్తులు మేడారానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వనదేవతలను దర్శనాల అనంతరం వీరితోపాటు మినీ జాతరలో నాలుగు రోజులపాటు పాల్గొన్న భక్తులు కూడా తిరుగుప్రయాణమయ్యారు. 'చల్లగా చూడు తల్లీ.. తిరిగి మళ్లీ మహా జాతరకు వస్తాం' అని వనదేవతలను మొక్కి అక్కడి నుంచి బయల్దేరారు. కాగా, మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను మహా జాతర పునరుద్ధరణ కమిటీ మాజీ చైర్మన్ అరెం లచ్చుపటేల్ ఆదివారం దర్శించుకున్నారు.



వనదేవతల సన్నిధిలో గంట మోగిస్తున్న భక్తురాలు





తిరుగు ప్రయాణంలో భక్తుల రద్దీ

# మల్లన్న నామస్మరణతో మార్మోగిన ఐనవోలు

- వారాంతపు జాతరకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు



ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో రథం లాగుతున్న భక్తులు

ఐనవోలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి వారాంతపు జాతర ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచే భక్తులు ఆలయ ప్రాంగణంలో విడిదిచేశారు. ఆదివారం ఉదయం స్వామివారికి మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు కల్యాణం నిర్వహించి, రుద్రాభిషేకాలు జరిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో నజర్, చెలక పట్నాలు వేసి బోనం వండి అమ్మవార్లకు స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాల వద్ద పూర్వీకులను స్తుతించారు. ఆపదల నుంచి గట్టెక్కించి కోర్కెలు తీర్చమని మల్లికార్జునస్వామిని భక్తులు వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామగ్రిని ముట్టచెప్పారు. మరికొందరు భక్తులు రథసేవ మొక్కుల్లో భాగంగా రథంను (రథంలో ఉత్సవవిగ్రహాలు) ఆలయం చుట్టు లాగుతూ ప్రదక్షణలు చేశారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తును నిర్వహించగా ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

## పౌష్టికాహారంతో ఆరోగ్యం

- చిరుధాన్యాలతో అల్పాహారం, రాగి జావతో రక్ష
- క్రీడా మైదానాల వద్ద వెలుస్తున్న షాపులు
- అందుబాటులో విభిన్న రకాల జ్యూస్‌లు
- ఉపాధి పొందుతున్న పలువురు నిరుద్యోగులు

7

## బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకే తాను ముక్కలు

- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోంది..
- రాహుల్‌గాంధీ డైరెక్షన్‌లో మోదీపై రేవంత్ బురదజల్లే ప్రయత్నం
- పట్టభద్రులు, టీచర్ల సమస్యలపై పోరాడతాం..
- కాంగ్రెస్ పాలన గుడ్డెద్దు చేనులో పడ్డ చందంగా ఉంది..
- రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి గడ్డుకాలం
- టీచర్ల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, డీఏలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం
- మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

7



మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

## సోషల్ మీడియా కృషితో అధికారంలోకి వచ్చాం..

- ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి
- 'కాఫీ విత్ ఎమ్మెల్యే'లో నాయిని రాజేందర్‌రెడ్డి



'కాఫీ విత్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, తదితర కాంగ్రెస్ నాయకులు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం కృషితో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ వరంగల్ పార్లమెంట్ సోషల్ మీడియా ఇన్‌చార్జి నేహాల్ ఆధ్వర్యంలో 'సోషల్ మీడియా వారియర్స్- కాఫీ విత్ ఎమ్మెల్యే' కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. తన గెలుపులో కూడా సోషల్ మీడియా శ్రేణుల కృషి అనిర్వచనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సోషల్ మీడియా నాయకుల సేవలను పార్టీ తప్పక గుర్తిస్తుందన్నారు. సముచిత స్థానం కల్పించే చొరవ తీసుకుంటానని రాజేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రతిపక్షాలు చేసే విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, డాక్టర్ నాయిని గోదా విష్ణువర్ధన్‌రెడ్డి, బంక సరళ, డాక్టరు పెరుమాండ్ల రామక్రిష్ణ, రమేశ్, తిరుపతి రెడ్డి, జీవన్‌రెడ్డి, హస్సేన్, సోమలక్ష్మి, భరత్, చందు రమేశ్ తదితర కాంగ్రెస్ సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

## మహాశివరాత్రి వేడుకలు

- ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించిన భద్రకాళి శేషు



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు వైభవాన్ని చాటేలా యేటా మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్న ఇండస్ ఫౌండేషన్ కార్యక్రమాలు అభినందనీయమని భద్రకాళి ఆలయ చైర్మన్ శేషగిరిరావు అన్నారు. ఆదివారం హనుమకొండలోని హరిత హోటల్‌లో ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదిన వేళ హయగ్రీవాచారి గ్రౌండ్‌లో జరిగే శివరాత్రి వేడుకల ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించారు. ప్రముఖ గేయ రచయిత వెన్నెల శ్రీనాథ్, ప్రఖ్యాత శాస్త్రీయ నృత్య కళాకారిణి కాట్రగడ్డ హిమాన్సీ, ఇండస్ ఫౌండేషన్ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన సంస్కృతిని, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఐదేళ్లుగా ఇండస్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనంలో ఓరుగల్లు వాసులంతా భాగస్వాములై విజయవంతం చేయాలని చెప్పారు.

ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మన వారసత్వ వైభవాన్ని సంస్కృతి, సంప్రదాయాలు, కళల ఔన్నత్యాన్ని చాటి చెప్పడం కోసమే ఇండస్ ఫౌండేషన్ నగరంలో ఐదేళ్ల కిందట మహాశివరాత్రి వేళ ఇలాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇదే క్రమంలో ఈసారి చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్, ఇస్కాన్‌కు చెందిన స్వామి ప్రణవానందదాస్, ప్రముఖ సినీ గేయ రచయిత, ఆధ్యాత్మికవేత్త జొన్నవిత్తుల రామలింగేశ్వరావుతో ప్రవచనాలు, చిందుయక్షగాన కళాకారులు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య, ప్రముఖ గేయ రచయిత, తెలంగాణ కవి దేశపతి శ్రీనివాస్, మరో సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్‌లతో తెలంగాణ సాంస్కృతిక కళావైభవ సందేశాలు, దేశభక్తి గీతాలు, పేరిణి శివతాండవం, సప్తహారతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. నగర వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరమశివుడి కృప పొందాలని రాకేశ్‌రెడ్డి ఆకాంక్షించారు. ఇండస్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్స్ పురుషోత్తం, అభిషేక్, దీపక్, కార్పొరేటర్ రవినాయక్, డాక్టర్ కొమురన్న, అఖిల్‌రెడ్డి, వినయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- కాజీపేట సర్కిల్ కార్యాలయంలో సిటిజన్ సెంటర్ సందర్శన



కాజీపేట సర్కిల్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సర్వే వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. ఆదివారం బల్దియా పరిధిలోని కాజీపేట సర్కిల్-2 కార్యాలయంలో సిటిజన్ సెంటన్‌ను సందర్శించారు. అక్కడి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి 28 వరకు బల్దియా పరిధిలో సమగ్ర కులగణన సర్వే చేయడం జరుగుతుందని, గతంలో దరఖాస్తులు చేసుకోని వారిని ఈ అవకాశం సద్వినియోగం చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తులను ఈ-సేవా కేంద్రాలలో అప్పగించాలన్నారు. ఈ సర్వేలో ప్రజలు తప్పకుండా పేర్లు నమోదు చేసుకోవాలని, లేదంటే ప్రభుత్వ పథకాలకు అనర్హులవుతారని అన్నారు. బల్దియా వ్యాప్తంగా 8 కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్, రెవెన్యూ అధికారి యూసుఫ్, సూపరింటెండెంట్ అనిల్, ఆర్ఐలు దేవరాజ్, రజినీ, బిల్‌కలెక్టర్ రాజేశ్ పాల్గొన్నారు.

### పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

పన్నులు సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కోరారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రికి సంబంధించిన ఆస్తి పన్ను రూ.7.24లక్షల చెక్కులను ఆస్పత్రి యాజమాన్యం శనివారం కాజీపేట సర్కిల్ కార్యాలయంలో కమిషనర్‌కు అందించారు. ఈసందర్భంగా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. బల్దియా పరిధిలోని విద్య, వాణిజ్య, వ్యాపార సంస్థలు, ఆస్పత్రులు, బహుళ అంతస్తులు, ఇంటి యజమానులు బల్దియాకు చెల్లించవలసిన పన్నులను సకాలంలో చెల్లించాలని అన్నారు. లేదంటే జరిమాన విధిస్తామని చెప్పారు. పన్నులు చెల్లించడం వల్ల నగరంలో అభివృద్ధికి నిధులు సమకూరుతాయని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బుర్స పోచయ్య

## లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

ఏప్రిల్ 7, 8, 9 న రాష్ట్ర మహాసభలు

### తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య

వడ్డెపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల రిజర్వేషన్లను అనుభవిస్తున్న లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ అంబేద్కర్ భవన్ రోడ్డులోని గిరిజన భవన్ ఆవరణలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయ, ఆర్థిక, సామాజికంగా వెనుకబడిన ఆదివాసీల హక్కుల కోసం పాలకులపై నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పీసా యాక్ట్ చట్టాన్ని అమలు చేసి ఆదివాసీలకే జల్, జమీన్, జంగల్‌పై హక్కులు కల్పించాలన్నారు. ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతాల్లో కార్పొరేట్ సంస్థల వనరుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఏప్రిల్ 7 నుంచి 9 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలోని జోడేన్‌ఘాట్‌లో నిర్వహించే తుడుం దెబ్బ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆదివాసీలకు బుర్స పోచయ్య పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్లు గోడెం గణేష్, సిద్దబోయిన లక్ష్మీనారాయణ, కొట్నాక విజయ్, ఈసం నర్సింహారావు, ఆగబోయిన రవి, మెస్రం మోలురాంతో పాటు వివిధ జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## గైర్హాజరైన వారికి మరోసారి ప్రాక్టికల్ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు గైర్హాజరైన విద్యార్థులకు బోర్డు మరోసారి ప్రాక్టికల్ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించినట్లు వరంగల్, హనుమకొండ డీఐఈవోలు డాక్టర్ శ్రీధర్ సుమన్, ఎ.గోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి 22 వరకు గైర్హాజరైన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా విద్యార్థులకు ఎస్వీఎన్ రోడ్‌లోని ఏవీవీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో, హనుమకొండ జిల్లా విద్యార్థులకు వడ్డెపల్లిలోని ప్రభుత్వ పింగిళి బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ప్రాక్టికల్స్ జరుగుతాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## ఏసీబీ అధికారుల పేరుతో ఫోన్ వస్తే సంప్రదించాలి: ఏసీడీ డీఎస్పీ సాంబయ్య

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఏసీబీ అధికారుల పేరుతో ప్రభుత్వ ఉద్యోగులు, సామాన్యులకు ఫేక్ ఫోన్ కాల్స్ వస్తే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబర్ 1064ను సంప్రదించాలని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ లేదా ఏసీబీ తెలంగాణ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లైన వాట్సాప్ నెంబర్ 9440446106, లేదా ఏసీబీ ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో సంప్రదించవచ్చని, బాధితుల వివరాలను రహస్యంగా ఉంచుతామన్నారు. నకిలీ కాలర్స్‌ను నమ్మి ఎలాంటి చెల్లింపులు చేయరాదని పేర్కొన్నారు. ఏసీబీ అధికారులు ప్రభుత్వ ఉద్యోగులకు ఎప్పుడు ఫోన్‌చేయరని, ఈ విషయాన్ని ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## రైలు కిందపడి మహిళ ఆత్మహత్య



రమ్య (ఫైల్)

గీసుగొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన గోపాల రమ్య (35) అనే మహిళ ధర్మారం వద్ద గూడ్స్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రమ్య నగరంలోని ఓ ఆప్టికల్స్‌లో పనిచేస్తుంది. కాగా, కొంత కాలంగా ఆమె కడుపునొప్పితో బాధ పడుతోంది. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున ఆమెకు కడుపు నొప్పి రాగా, భరించలేక ఇంటికి సమీపంలో గల ధర్మారం రైల్వే ట్రాక్‌పైకి వెళ్లింది. అదే సమయంలో వరంగల్ నుంచి విజయవాడకు వెళ్తున్న ఓ గూడ్స్ రైలు ఆమెను ఢీకొట్టడంతో తలపగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త సతీష్, ఒక కుమార్తె ఉంది. పోస్టుమార్టం అనంతరం మృతురాలి తండ్రి రాజారాంనకు మృతదేహాన్ని అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

# వరంగల్ నిట్‌లో ఇన్నోథాన్ 2.0

- 30 గంటల పాటు సాగిన హ్యాకథాన్
- పాల్గొన్న 120 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు
- స్థిరమైన శక్తి కోసం కనుగొన్న పరిష్కారాలు




నగదు బహుమతులు అందిస్తున్న అఖిలూర్ రహమాన్

హనుమకొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో 30 గంటల ఇన్నోథాన్ 2.0 కార్యక్రమం శనివారం సాయంత్రం 7 గంటలకు విజయవంతంగా ముగిసింది. 'పునరుద్ధరణీయ శక్తి, విద్యుత్ మొబిలిటీ కోసం పర్యవేక్షణ, విశ్లేషణ వ్యవస్థలు' అనే ఇతివృత్తంపై నిర్వహించిన ఈ హ్యాకథాన్ శుక్రవారం ఉదయం ప్రారంభమై 30 గంటల పాటు ఏకధాటిగా సాగింది. వరంగల్ ఎన్ఐటీ, హిటాచీ ఎనర్జీ సంయుక్తంగా నిర్వహించిన సుదీర్ఘ ఇన్నోథాన్ 2.0లో 120 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు పాల్గొన్నారు. వీరు 25 బృందాలుగా ఏర్పడి దేశంలో సుస్థిర శక్తికి సంబంధించినన సమస్యల సత్వర పరిష్కారాలను వేగంగా కనుగొనడంలో ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. ఈ ఇతివృత్తంపై పాల్గొన్న బృందాలు రెండు ప్రధాన ఉప ఇతివృత్తాలపై కూడా పని చేశాయి. పునరుత్పాదక శక్తి వినియోగాన్ని మెరుగుపరిచే, ఎలక్ట్రిక్ మొబిలిటీకి మద్దతు నిచ్చే సాంకేతిక పరిష్కారాలు. ఇతివృత్తంపై వరంగల్ ఎన్ఐటీ క్యాంపస్ విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు వినియోగ యోగ్యమైన సముదాయం కేంద్రిత పునరుద్ధరణ శక్తి పరిష్కారాలు అనే దానిపై హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ పాఠశాల విద్యార్థులు పని చేశారు. హ్యాకథాన్ బృందాలు 30 గంటల పాటు అహర్నిశలు శ్రమించి విస్తరించగల, ప్రభావవంతమైన పరిష్కారాలను రూపొందించాయి. ఎన్ఐటీ ఆధ్యాపకులు, హిటాచీ ఎనర్జీ నిపుణులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహించారు. ప్రతీ ఉప థీమ్ నుంచి మూడు బృందాల చొప్పున ఆరు బృందాలను విజేతలుగా ప్రకటించారు. విజేతల బహుమతుల కార్యక్రమంలో హిటాచీ ఎనర్జీ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ అఖిలూర్ రహమాన్, వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ (ఇన్‌చార్జ్) ప్రొఫెసర్ వేణు వినోద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విజేతలకు ధ్రువపత్రాలు, నగదు బహుమతులను అందజేశారు.

విద్యార్థుల వినూత్న ఆలోచనలను రహమాన్ ప్రశంసించారు. ఇన్నోథాన్ 3.0ను వచ్చే సంవత్సరం జనవరిలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రొఫెసర్ వేణు వినోద్ హిటాచీ ఎనర్జీ సహకారంతో అమలైన క్యాంపస్ ఈ-కార్ట్స్, స్మార్ట్‌గ్రిడ్ ల్యాబ్ వంటి ప్రాజెక్టులను ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యార్థులు స్థిరమైన శక్తి పరిష్కారాల దిశగా మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ హ్యాకథాన్ పోటీలో బహుమతులు గెలుచుకున్న ప్రాజెక్టులను వరంగల్ ఎన్ఐటీ, ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో త్వరలో అమలు చేయనున్నామన్నారు. హిటాచీ ఎనర్జీ ఈ ప్రాజెక్టులకు ఆర్థిక, సాంకేతిక మద్దతును అందించడం ద్వారా సమాజానికి దీర్ఘకాలిక ప్రయోజనాలను కలిగించనున్నదని ప్రశంసించారు. ఈ హ్యాకథాన్ భారత దేశ పునరుత్పాదక శక్తి లక్ష్యాన్ని సాధించడంలో మైలురాయిగా నిలువనున్నదన్నారు.

# సేవాలాల్ మహారాజ్ బోధనలు అనుసరణీయం

- గోర్ సభ జాతీయ అధ్యక్షుడు జైసింగ్ రాథోడ్
- ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి



సేవాలాల్ జయంతి సభలో మాట్లాడుతున్న జైసింగ్ రాథోడ్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజానికి అనుసరణీయమని గోర్ సభ జాతీయ అధ్యక్షుడు జైసింగ్ రాథోడ్, సంత్ సేవాలాల్ బంజారా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బానోత్ జవహర్‌లాల్ అన్నారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని సంత్ సేవాలాల్ మందిరంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత బోగ్ బండారో కార్యక్రమంలో భాగంగా పూజారి రాంచందర్ నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పుష్పాలంకరణ చేసి నైవేద్యాన్ని సమర్పించారు. సేవాలాల్ మహారాజ్, మేరా మాయాడీ నినాదాలతో గోపాల్‌పూర్ మార్మోగింది. కార్యక్రమంలో సంత్ సేవాలాల్ బంజారా సంక్షేమ సంఘం గోపాల్‌పూర్ శాఖ ప్రతినిధులు రామెల్ నాయక్, రాజు, ప్రొఫెసర్ వీరన్న నాయక్, దాస్యనాయక్, జవహర్ నాయక్, జుమ్లా, శంకర్, వెంకట్రాం, శివరామ్, కృష్ణ, సర్వన్, ధరంసింగ్ తదితరులు పాల్గొని సేవాలాల్‌ను కొలిచారు.

# పట్టణీకరణకు డిజిటల్ హంగులు

- పక్కాగా ఆస్తుల నమోదు సర్వే
- పైలెట్ ప్రాజెక్టు కింద వర్ధన్నపేట మున్సిపాలిటీ
- నక్ష సర్వే కోసం గ్రౌండ్ కంట్రోల్ పాయింట్ల ఏర్పాటు
- ఏరియల్, ఫీల్డ్ సర్వేకు త్వరలో రానున్న బృందాలు



వర్ధన్నపేట మున్సిపాలిటీ వ్యూ

వర్ధన్నపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పక్కాగా ఆస్తుల రికార్డులను తయారు చేయనున్నారు. పట్టణీకరణకు డిజిటల్ హంగులను తీసుకురానున్నారు. మునిసిపాలిటీ పరిధిలోని ప్రజల ఆస్తులను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి శాటిలైట్‌తో అనుసంధానం చేసేందుకు పకడ్బందీ చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. ఆస్తుల పక్కా సమాచారాన్ని క్షణాల్లో అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. డైరెక్టర్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ పర్యవేక్షణలో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతుంది. రెవెన్యూ, సర్వే ల్యాండ్, మునిసిపల్ శాఖల సమన్వయంతో ఏరియల్ సర్వేతో పాటు క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి ఆస్తుల వివరాలను నమోదు చేయనున్నారు. రాబోయే రోజుల్లో పట్టణ ప్రాంతాల్లోని ప్రజల ఆస్తులకు పక్కాగా రికార్డులతో పాటు ఉపగ్రహ ఛాయా చిత్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం ఆయా శాఖల అధికారులతో 18 బృందాలను ఏర్పాటు చేశారు. ఏరియల్ సర్వే క్షేత్రస్థాయి సర్వేలకు సంబంధించి మొదటి విడతగా నాలుగు బృందాలకు శిక్షణ ఇచ్చారు. ఒక ఏడాది పాటు ఈ సర్వే ప్రక్రియ కొనసాగనుంది. పైలెట్ ప్రాజెక్టు కింద దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల్లోని 150 మునిసిపాలిటీలను ఎంపిక చేయగా తెలంగాణ మునిసిపాలిటీల్లో వర్ధన్నపేట మునిసిపాలిటీకి చోటు దక్కడం విశేషం.

### క్రయ, విక్రయాలు సులభతరం

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే ద్వారా మునిసిపాలిటీల్లో ఉన్న ప్రజల ఆస్తులకు పారదర్శకత రానుంది. తద్వారా క్రయ, విక్రయాలు సులభతరం కానున్నాయి. దీంతో పాటు ప్రజల ఆస్తులతో పాటు ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పక్కాగా ఉంటాయి.


### సర్వేలో ముందుగా ఏరియల్ సర్వే

రెవెన్యూ, ల్యాండ్ సర్వే, మునిసిపల్ శాఖల సమన్వయంతో చేపడుతున్న మునిసిపాలిటీ సర్వేలో ముందుగా ఏరియల్ సర్వే నిర్వహిస్తారు. మునిసిపాలిటీలో నమోదై ఉన్న ప్రజల ఆస్తులకు సంబంధించి అక్షాంశ, రేఖాంశాలను గుర్తిస్తారు. ప్రభుత్వ, దేవాదాయ, భూదాన్ తదితర రకాల భూములతో పాటు మునిసిపల్ రికార్డుల్లోని వివరాల ప్రకారం ప్రజల ఆస్తులకు సంబంధించి కమర్షియల్, డొమెస్టిక్ వివరాలను సరి చూస్తూ భవనం అంతస్తులు, నాలా వివరాలు, సర్వే నెంబర్లను నమోదు చేస్తూ ఇంటింటి సర్వే నిర్వహిస్తారు.

ఆస్తికి సంబంధించి యజమాని, విస్తీర్ణం, మల్టీ స్టోరేజ్ భవనమా ? ఎన్ని అంతస్తులు ఉన్నాయి. లొకేషన్ మ్యాపింగ్‌తో పాటు పూర్తి వివరాలు నమోదు చేస్తారు. ప్రభుత్వ ఆస్తులైన రోడ్లు, పార్కులు, భవనాలు, నీటి ట్యాంకులు, పైపులైన్లు వంటి వివరాలను సైతం సర్వే బృందాల సభ్యులు సేకరిస్తారు.

### మున్సిపాలిటీకి ప్రయోజనం

ఇమ్మడి సుధీర్‌కుమార్, కమిషనర్, వర్ధన్నపేట మునిసిపాలిటీ



వర్ధన్నపేట మునిసిపాలిటీ నక్షకు ఎంపిక కావడం ఎంతో ప్రయోజనకరం. మునిసిపాలిటీకి సంబంధించిన అన్ని ఆస్తుల వివరాలు లెక్కించి, వాటికి మ్యాప్‌లు ఇస్తూ డిజిటలైజ్ చేయడం వల్ల ఆస్తి పన్ను లెక్కింపు సులభమవుతుంది. ఇటీవల అమృత్ 2.0లోనూ డ్రోన్ సహాయంతో సర్వే పూర్తి చేశారు. ఆ వివరాలు అందాల్సి ఉంది.

# గడువులోగా పూర్తయ్యేనా ?

- పన్ను వసూళ్లలో చతికిలపడ్డ వ్యవసాయ మార్కెట్లు
- లక్ష్యం రూ.449.27కోట్లు.. వసూలైంది రూ.291.37 కోట్లు
- మార్చిలో వంద శాతం పూర్తి చేయాలని అధికారుల ఆదేశాలు

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రీజియన్ పరిధిలోని 19 జిల్లాలు, 110 వ్యవసాయ మార్కెట్లు పన్ను వసూళ్లలో చతికిలబడ్డాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి వెనకబడ్డాయి. 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి 31 వరకు 64 శాతం మాత్రమే వసూలు చేశాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం జనవరి 31 వరకు రూ.311.48కోట్లు పన్ను వసూలు చేయగా, ప్రస్తుతం రూ.291.37కోట్లు మాత్రమే వసూలయ్యాయి. గతేడాది కంటే రూ.20.10కోట్లు తగ్గింది. గతేడాది ఇదే సమయానికి 71శాతం వసూలు చేయగా, ఈఏడాది 64.85శాతం మాత్రమే వసూలు చేశారు. ఇక మార్చి నెలాఖరులోగా మిగతా 35.15శాతం వసూలు చేయాలని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవోలు మార్కెట్ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు.

### వరంగల్ రీజియన్‌లో..

2024-25 ఆర్థిక సంవత్సరం జనవరి 31 వరకు వరంగల్ రీజియన్ పరిధిలోని 19 జిల్లాలు 110 మార్కెట్లలో మొత్తం రూ.449.27 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.291.37 కోట్లు (64.85 శాతం) వసూలు చేశారు. మిగిలిన రెండు నెలల్లో వందశాతం లక్ష్యాన్ని చేరేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

### గడువులోగా లక్ష్యాన్ని చేరుకుంటాం..

- ఉప్పుల శ్రీనివాస్, వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్



ప్రభుత్వం, ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరేందుకు కృషి చేస్తున్నాం. ఇందుకోసం కింది స్థాయిలో ఉన్న అధికారులను సమన్వయం చేస్తూ ముందుకు వెళుతున్నాం. ప్రతీరోజు మార్కెట్లను సందర్శిస్తూ అక్కడి సాధకబాధకాలను తెలుసుకుంటున్నాం. వారికి తగిన సూచనలు, సలహాలు ఇస్తూ మార్కెట్ ఫీజును వసూలు చేసేందుకు ప్రోత్సహిస్తున్నాం. సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. అయినప్పటికీ లక్ష్యాన్ని చేరేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నాం. పన్ను వసూళ్లలో ముందజలో ఉన్న వారికి డిపార్ట్‌మెంట్ తరుపున ప్రశంసా పత్రాలు, అవార్డులు అందిస్తాం.




ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రధాన ద్వారం

| జిల్లా పేరు | వసూలు చేయాల్సింది (రూ.కోట్లలో) | వసూలు చేసింది (రూ.కోట్లలో) |
|---|---|---|
| 1. వరంగల్ | 66.05 | 29.73 |
| 2. హనుమకొండ | 6.00 | 2.88 |
| 3. జనగామ | 17.95 | 8.89 |
| 4. మహబూబాబాద్ | 19.39 | 16.44 |
| 5. భూపాలపల్లి | 6.65 | 5.25 |
| 6. ములుగు | 5.40 | 1.83 |
| 7. ఖమ్మం | 63.94 | 44.70 |
| 8. భద్రాద్రికొత్తగూడెం | 21.69 | 16.39 |
| 9. కరీంనగర్ | 24.47 | 20.58 |
| 10. రాజన్నసిరిసిల | 10.32 | 12.93 |
| 11. పెద్దపల్లి | 18.38 | 18.18 |
| 12. జగిత్యాల | 14.05 | 8.59 |
| 13. నల్లగొండ | 65.02 | 50.87 |
| 14. సూర్యాపేట | 31.78 | 27.94 |
| 15. యాదాద్రి భోనగిరి | 22.49 | 7.39 |
| 16. ఆదిలాబాద్ | 19.47 | 4.52 |
| 17.ఆసిఫాబాద్ | 12.85 | 4.70 |
| 18. నిర్మల్ | 13.96 | 2.75 |
| 19. మంచిర్యాల్ | 11.74 | 4.78 |

## ఘనంగా చిగురు-2024

- బాలల ప్రతిభా వేదికగా ప్రశంసలు
- పాల్గొన్న 1200 మంది విద్యార్థులు

హనుమకొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో ఆదివారం చిగురు-2024ను నిర్వహించారు. ఇది సైన్స్ పట్ల బాలబాలికల్లో అంతర్గతంగా దాడి ఉన్న సృజనాత్మకతను వెలికితీసే వేదిక. వరంగల్ యూత్ ఫర్ సేవా, వరంగల్ నిట్ సంయుక్తంగా చిగురును నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో వరంగల్‌లోని 12 ప్రభుత్వ పాఠశాలల నుంచి 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళలు, క్రీడలు, సాహిత్య తదితర 15రంగాల్లో నిర్వహించిన పోటీలో పాల్గొని తమ ప్రతిభా పాఠశాలను ప్రదర్శించారు. వివిధ కాలేజీ విద్యార్థులతో పాటు వరంగల్ ఎన్ఐటీ విద్యార్థులు పాల్గొని స్వచ్ఛంద సేవలను అందజేయడం ద్వారా చిగురు-2024ను విజయవంతం చేశారు.

ఈ వేడుకల్లో చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, సృజనాత్మకతను వెలికి తీయడంతో పాటు సమాజసేవలో వారి పాత్రను గుర్తు చేసేలా కార్యక్రమాలను నిర్వహించారు. వరంగల్ ఎన్ఐటీ యేటా చిగురు పేరుతో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. తద్వారా కళాశాల విద్యతో పాటు సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో ఎక్కువ మంది పేద పిల్లలు, అట్టడుగు వర్గాలకు చెందినారు. వారిలోని ప్రతిభను వెలికితీయడం వెలుగు ప్రధాన లక్ష్యం.



అయోధ్య రామ మందిరం మోడల్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థిని

## విద్యార్థినితో లెక్చరర్ అసభ్య ప్రవర్తన

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో పాఠాలు బోధించే లెక్చరర్ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన వరంగల్ కొత్తవాడలోని ఓ ప్రైవేటు బాలికల జూనియర్ కళాశాలలో చోటు చేసుకుంది. విద్యార్థిని తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో తల్లిదండ్రులు, బంధువులు ఆదివారం కళాశాలలో ఆందోళన చేశారు. విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన లెక్చరర్‌ను తమకు అప్పగించాల్సిందిగా నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. ఆందోళన విషయాన్ని తెలుసుకున్న సదరు లెక్చరర్ అక్కడ నుంచి పలాయనం చిత్తగించారు. ఘటన వివరాలు తెలుసుకున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కళాశాలకు చేరుకొని ఆందోళన చేశారు. విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన లెక్చరర్‌పై పోక్సో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే సదరు లెక్చరర్‌ను కళాశాల నుంచి తీసివేస్తామని, చట్టపరమైన చర్యలకు సహకరిస్తామని తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదుతో మట్టెవాడ పోలీసులు సంఘటన వివరాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

## ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన లారీ

### పది మందికి గాయాలు

పాలకుర్తి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్ అతివేగం, నిద్రమత్తుతో ఓ లారీ ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. అంతేకాకుండా ఓ వైన్‌షాపులోకి దూసుకెళ్లింది. ఘటన పాలకుర్తి మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ నుంచి సిమెంట్ లోడుతో హనుమకొండకు సదరు లారీ సిమెంట్ లోడ్‌తో వస్తోంది. ఈ క్రమంలో తొర్రూరు నుంచి జగద్గిరి గుట్టకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఢీకొట్టింది. అంతేగాకుడా లారీ దుకాణ సముదాయాల్లోకి చొచ్చుకుపోయింది. ఈ ఘటనలో పది మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ముగ్గురు తలకు, నడుమును గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిలో వావిలాలకు చెందిన నారబోయిన యాకమ్మ, అనపర్తి చిలకమ్మ, రేగుల గ్రామానికి చెందిన కొత్త పద్మారెడ్డి ఉన్నారు. స్వల్ప గాయాలైన వారిలో నారబోయిన కొంరయ్య, అనపర్తి వెంకటయ్య, సోమయ్య, బెజ్జోజు రాజేశం, నాగరాణి, వేల్పుల శ్రీశైలం, ఈరవెన్నుకు చెందిన దుంపల గౌరమ్మకు కూడా గాయాలయ్యాయి. వీరిని పాలకుర్తి ఉన్నతశ్రేణి ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించారు. లారీ దూసుకెళ్లడంతో రోడ్డుపై నిలిపిన రెండు మోటార్ సైకిళ్లు కూడా ధ్వంసమయ్యాయి. అనంతరం మెరుగైన వైద్యం కోసం పది మందిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలిని సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు పవన్‌కుమార్, లింగారెడ్డి సందర్శించారు. అనంతరం దుకాణంలోకి దూసుకుపోయిన లారీని పోలీసులు ఎక్స్‌కవేటర్‌ల సాయంతో రోడ్డు పక్కన తరలించారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.



ప్రమాదానికి గురైన తొర్రూరు ఆర్టీసీ బస్సు

# పౌష్టికాహారంతో ఆరోగ్యం

- చిరు ధాన్యాలతో అల్పాహారం, రాగి జావతో రక్ష
- క్రీడా మైదానాల వద్ద వెలుస్తున్న షాపులు
- అందుబాటులో విభిన్న రకాల జ్యూస్‌లు
- ఉపాధి పొందుతున్న పలువురు నిరుద్యోగులు

ఆధునిక జీవితంలో ఆరోగ్యకర జీవన విధానంపై ప్రజల్లో రోజు రోజుకూ అవగాహన పెరుగుతోంది. ప్రసార మాధ్యమాలు, వైద్య నిపుణుల సలహా మేరకు ఆహారపు అలవాట్లను మార్చుకుంటున్నారు. ఆరోగ్య స్పృహతో మితాహారం మేలని అన్ని వయస్సుల వారు గ్రహిస్తున్నారు. ఈ క్రమంలో చిరుధాన్యాలు, రాగిజావా, జొన్నగటుక, మొలకెత్తిన ధాన్యాలను ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహారంగా తీసుకుంటూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపేందుకు ఆసక్తి కనబర్చుతున్నారు. నిత్యం భుజించే ఆహార పదార్థాలకు భిన్నంగా ఆలోచన చేస్తూ రోగ నిరోధక శక్తిని పెంపొందించుకుంటున్నారు. రోగాలకు మందులు వెచ్చించే సగానికి పైగా డబ్బులతో అవి రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వరంగల్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కరోనా తర్వాత వ్యాయామంపై అందరికీ ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా వరంగల్ నగరంలో ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో తమ ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకునేందుకు వయోభేదం లేకుండా సమీపంలోని పార్కులు, మైదానాలకు బారులు తీరుతూ వాకింగ్ చేస్తున్నారు. అదే విధంగా పార్కులు, క్రీడా మైదానాల సమీపంలో విక్రయిస్తున్న వివిధ రకాల పండ్లు, కూరగాయలతో చేసిన జ్యూస్‌లను సేవించడంతో పాటు పోషక విలువలు గల రాగిజావా, గటక, చిరుధాన్యాలు, మొలకెత్తిన . ధాన్యాలను భుజిస్తూ ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు.



హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ వద్ద జ్యూస్ విక్రయిస్తున్న యువకుడు

### చిరు ధాన్యాలతో అల్పాహారం

వివిధ రకాల రుగ్మతులు కలిగిన వారు ఉదయం అల్పాహారం తీసుకుని మందులు వేసుకుంటారు. ఈ నేపథ్యంలో నూనెతో తయారు చేసిన అల్పాహారం ఆరోగ్యానికి హాని చేస్తుందని భావించి.. పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను భుజించడానికి మొగ్గు చూపుతున్నారు. పలు క్రీడా మైదానాలు, వాకింగ్ చేసే పార్కుల వెంబడి పదుల సంఖ్యలో చిరుధాన్యాలు, జ్యూస్‌లు అందించే విక్రయదారులు పెరిగిపోతున్నారు. నగర వ్యాప్తంగా పలు టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు రుచికరమైన రాగులతో చేసిన ఇడ్లీ, దోశ, కొర్రల ఉప్మా, విలైట్ దోశలు తయారు చేస్తూ విక్రయాలు జరుపుతూ ఉపాధిని పొందుతున్నారు. వీటిలో పీచు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం ఎక్కువగా లభించడంతో పాటు కొవ్వు శాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో మధుమేహం, అధిక బరువుతో బాధపడుతున్న వారు ఈ అల్పాహారాన్ని తీసుకునేందుకు ఆసక్తి కనబర్చుతున్నారు.

### విభిన్న రకాల జ్యూస్‌లు

ఉదయం వేళల్లో క్రీడా మైదానాల బాటపట్టిన పలువురు వ్యాయామం పూర్తికాగానే సమీపంలోని జ్యూస్ కేంద్రాలను ఆశ్రయిస్తూ నచ్చిన జ్యూస్‌లను సేవిస్తున్నారు.

నగరంలోని వివిధ ప్రాంతాల్లో పలు రకాల జ్యూస్‌ల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. బూడిద గుమ్మడికాయ, సొరకాయ, క్యారెట్, బీట్‌రూట్, మునగాకు, గోధుమగడ్డి, కలబందలతో జ్యూస్‌లు తయారుచేసి కేంద్రాలు నగరంలో చాలా వెలిశాయి. వీటిల్లో అధిక పోషక విలువలు ఉంటాయని పలువురు వైద్య నిపుణులు తెలుపడంతో ఊబకాయం, వివిధ రకాల రుగ్మతుల నివారణ కోసం జ్యూస్ కేంద్రాల వద్దకు ప్రజలు బారులు తీరుతున్నారు.

### జావ విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నా..



బి. రమాదేవి, వరంగల్

కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా పదో తరగతి వరకు చదుకున్నాను. వ్యాపారం చేయాలంటే లక్షల్లో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. దీంతో నా భర్త సహకారంతో హనుమకొండ జేఎన్ఎస్ గేటు వద్ద 11ఏళ్లుగా ప్రతీరోజు మొలకెత్తిన గింజలతో పాటు పజ్జొన్నల, రాగులు, సజ్జలతో తయారుచేసిన జావాను ఉదయం మైదానానికి వచ్చే వాకర్లకు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాను. కుటుంబ పోషణకు, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి రోజులో 10నుంచి 12గంటల వరకు సమయం వెచ్చించి రాగి జావా విక్రయిస్తున్నాను. పెద్ద కుటుంబం కావడంతో పిల్లలను చదివిస్తూ ఉద్యోగాల్లో స్థిరపడేందుకు ఈ వ్యాపారం ఎంతో దోహదపడింది.

### పీజీ, బీఈడీ చదివినా ఉద్యోగం రాలేదు..



ఎం.కల్యాణ్ కుమార్ (జావ విక్రయదారుడు)

పీజీ, బీఈడీ వరకు చదివినా ప్రభుత్వ ఉద్యోగం లభించక పోవడంతో ఏమి తోచని సందర్భంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ వద్ద ఐదేళ్ల కిందట జ్యూస్ విక్రయించడం ప్రారంభించాను. నగర ప్రజల్లో ఆరోగ్యంపై ఉన్న శ్రద్ధ కారణంగా జ్యూస్ అమ్మకాలకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. పెద్ద చదువులు చదివినా ఉద్యోగం లేని నాకు జ్యూస్ విక్రయాలతో నా కుటుంబానికి ఆర్థికంగా ఆసరా దొరికింది. ప్రజల్లో ఆరోగ్య స్పృహతో వివిధ రకాల జ్యూస్‌లు తాగేందుకు మొగ్గు చూపుతున్నారు. మునగాకు, బూడిద గుమ్మడి, సొరకాయ, కాకరకాయ, బీట్‌రూట్, క్యారెట్, గోధుమ గడ్డి, కలబందతో తయారు చేసిన జ్యూస్‌లో అందు బాటులో ఉండటంతో వాకర్లు ఆసక్తి కనబరుస్తున్నారు.



పాలు పితుకుతున్న రైతు దినేష్



దినేష్ పెంచుతున్న పాడి గేదెలు

# కంప్యూటర్ వదిలి.. పాలు పట్టి..

**పాడి పరిశ్రమతో యువకుడి స్వయం ఉపాధి**
**నెలకు రూ.లక్ష సంపాదిస్తున్న దినేష్**

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రాలేదని, నిరుద్యోగ యువత, నిరాశ నిస్పృహలకు లోను కావద్దు.. స్వయం ఉపాధితో ఆర్థికంగా బలపడాలని ఇంజనీరింగ్ చదివిన ఓ యువకుడు నిరూపిస్తున్నాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నాలుగేళ్లుగా చేసిన ఆ యువకుడు.. నగరంలో వాతావరణ కాలుష్యం తట్టుకోలేక.. తాను పుట్టి పెరిగిన పల్లెటూరిలోని స్వచ్ఛమైన వాతావరణంలో పాడిపరిశ్రమ వైపు దృష్టి సారించాడు. ఒక పాడి గేదెతో ప్రస్థానం ప్రారంభించాడు. ఐదేళ్ల కిందట సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి.. నేడు ఎనిమిది పాడి గేదెలతో రోజుకు 40 లీటర్ల పాలను ఉత్పత్తి చేస్తూ నెలకు రూ.లక్ష సాధిస్తూ యువతకు భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామానికి చెందిన కరెట్లపల్లి దినేష్ ఆదర్శంగా నిలుస్తున్నాడు. కరెట్లపల్లి దినేష్ పదో తరగతి పెద్దపూర్‌లోని రెసిడెన్సియల్ పాఠశాలలో పూర్తి చేశాడు. వరంగల్‌లో పాలిటెక్నిక్ చేసిన దినేష్.. 2017లో బీటెక్ పూర్తి చేశాడు. అప్పుడే సాఫ్ట్‌వేర్ కంపెనీలో హైద్రాబాద్‌లో ఉద్యోగంలో చేరాడు. నెలకు రూ.30వేలకు పైగా వేతనంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశాడు. కానీ హైదరాబాద్‌లో కాలుష్యం కోరలు, నిత్యం వాహనాల రద్దీతో ఆఫీస్‌కు వెళ్లాలంటే వాహనాల రద్దీతో తీవ్ర మథనపడేవాడు. దీంతో తన కాళ్లపై తాను నిలబడి పాడిపరిశ్రమను చేపట్టాలని దృఢంగా సంకల్పించాడు. 2019లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసి తన స్వగ్రామమైన రత్నగిరిలో ఒక పాడి గేదెతో తన ప్రస్థానం మొదలు పెట్టాడు. నేడు 8 పాడి గేదెలను సమకూర్చుకున్నాడు. ఒక్కొక్క పాడి గేదెలకు రూ.1.30లక్షలు పెట్టి హైద్రాబాద్‌లో కొనుగోలు చేశాడు. క్రమంగా పాడి పరిశ్రమతో స్వయం ఉపాధి పొందుతున్నాడు. ఆ పాడి గేదెలకు అవసరమైన చిన్న చిన్న వైద్యాన్ని సైతం నేర్చుకుని తానే చేస్తున్నాడు. ఇందు కోసం తన పాడి గేదెల షెడ్డు వద్ద ఓ ట్రేవి బోల్‌ను ఏర్పాటు చేసుకొని పాడి గేదెలకు వైద్యం సైతం చేస్తున్నాడు.



పాల ప్యాకెట్లను తయారు చేస్తున్న దినేష్

### రోజు 40 లీటర్ల పాల ఉత్పత్తి

ప్రతీ రోజు తనకున్న ఎనిమిది పాడి గేదెలతో ప్రతీరోజు 40 లీటర్ల పాలను సేకరిస్తున్నాడు. పాలను అర లీటర్, లీటర్ ప్యాకెట్లలో ప్యాకింగ్ చేస్తున్నాడు. తమ గ్రామంతో పాటు హుజూరాబాద్ పట్టణానికి పాల ప్యాకెట్లను చేరవేస్తూ విక్రయిస్తున్నాడు. లీటర్ పాలకు రూ.80 చొప్పున పాల ప్యాకెట్లను విక్రయిస్తున్నాడు. దినేష్ చేస్తున్న పాలప్యాకెట్లు నాణ్యమైనవిగా ఉండడంతో హుజూరాబాద్ పట్టణంలో వెంటనే అమ్ముడు పోతున్నాయి. పాల ప్యాకెట్లను ఇంటింటికీ తిరుగుతూ దినేష్ విక్రయిస్తున్నాడు. పాడిగేదెల కోసం తమకున్న ఎకరం పొలంలో పచ్చిగడ్డిని పెంచుతున్నాడు. అలాగే వరిగడ్డి కట్టలను సైతం పోగు చేసి ఆహారంగా వేస్తున్నాడు. దాణా, తౌడు, కుడిది తదితర వంటివి ప్రతీరోజు పెడుతూ పాడిగేదెలను ప్రేమతో పెంచుతున్నాడు. వాటికి దోమలు కుట్టకుండా, షెడ్డులో ఫ్యాన్‌లను సైతం అమర్చాడు.

### స్వయం ఉపాధితో ఆర్థికంగా బలపడాలి



కరట్లపల్లి దినేష్, యువరైతు, రత్నగిరి

స్వయం ఉపాధితో నిరుద్యోగ యువకులు ఆర్థికంగా బలపడాలి. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని నిరుద్యోగ యువకులు అధైర్యపడొద్దు. స్వయం ఉపాధి పొందాలి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కన్నా స్వయం ఉపాధితోనే సంతృప్తి కలుగుతుంది. నిరుద్యోగ యువకులు స్వయం ఉపాధి ఎన్నో రకాలుగా ఉన్నాయి. వాటిలో ఏదో ఒకటి ఎంచుకొని ఆర్థికంగా బలపడాలి.

# బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒకే తాను ముక్కలు

- బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోంది..
- కాంగ్రెస్ పాలన గుడ్డెద్దు చేనులో పడ్డ చందంగా ఉంది..
- రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి గడ్డుకాలం
- మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హనుమకొండలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందని, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వేర్వేరు కాదని, రెండు ఒకే తాను ముక్కలని, నాణానికి బొమ్మాబొరుసులాంటివని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం హనుమకొండ హంటర్‌రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల హక్కుల కోసం శాసనమండలిలో గళం వినిపించేందుకు బీజేపీ పార్టీ రాష్ట్రంలో జరుగుతున్న రెండు టీచర్స్ ఎమ్మెల్సీ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉందన్నారు. ఆరు గ్యారంటీలు, ఇతర హామీలను అమలు చేయకలేక కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకత రావడానికి 10 యేళ్లు పడితే.. 14 నెలల్లోనే కాంగ్రెస్‌పై, రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గాలను కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఏనాడూ పట్టించుకోలేదని, మండలి అస్థిత్వాన్ని తగ్గించే విధంగా గతంలో కేసీఆర్ వ్యవహరించారన్నారు. అధికార పక్షం, ప్రశ్నించేతత్వం లేకుండా ఉండేందుకు కాంగ్రెస్‌లో ఉన్నవారందరనీ మూకుమ్మడిగా బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నారన్నారు. ప్రజల గొంతుకును వినిపించేందుకు 3 ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేస్తున్నామన్నారు. తెలంగాణ ఉద్యమకారులతో పాటు టీజాక్‌లో పని చేసిన నాయకులు బీజేపీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతు ఇస్తున్నారన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పులి సరోత్తంరెడ్డిని గెలిపిస్తే శాసనమండలిలో సమస్యలపై ప్రశ్నిస్తాడన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల దృష్టిమరల్చేందుకు వారానికోసారి ఢిల్లీలో హాజరు వేసుకొని రాహుల్‌గాంధీ డైరెక్షన్‌లో కేంద్ర ప్రభుత్వం, మోదీపై రేవంత్‌రెడ్డి అవాస్తవాలు పేల్చుతున్నాడని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు రానున్నరోజుల్లో గడ్డుకాలమేనని, కాంగ్రెస్ వాళ్లు ఎవరూ బయట తిరిగే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ హామీలపై రానున్నరోజుల్లో బీజేపీ ఎక్కడికక్కడ నిలదీస్తూ ప్రశ్నిస్తుందన్నారు. 2లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ఏ ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. గత నోటిఫికేషన్‌లలో ఎంపికైన వారికే నియామక పత్రాలు అందజేసిందని గుర్తు చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టడంవల్ల ఆయా సంస్థల యజమానులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్‌లు ఇవ్వలేని దయనీయమైన స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. డీఏలు, వేతన సవరణ కమిటీలపై ఆలోచనే లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్క డీఏ పెండింగ్‌లో లేకుండా మోదీ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేసిన కేసీఆర్ అడుగుజాడల్లోనే రేవంత్‌రెడ్డి నడుస్తున్నాడని విమర్శించారు. ఏ భూములు అమ్ముకుందాం.. ఏ సంస్థలో అప్పులు తెచ్చుకుందామనే ఆలోచలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ గ్యారంటీలు, హామీలను అమలు చేయడానికి వాళ్ల దగ్గర రోడ్డు మ్యాప్‌లేదని, గుడ్డెద్దు చేనులో పడ్డ చందంగా ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. రేవంత్‌రెడ్డి మాటలతో తెలంగాణ ప్రజల కడుపు నిండదని, బలహీన వర్గాల గృహసముదాయాల కోసం ఒక్క పునాదిరాయి కూడా వేయని కాంగ్రెస్ పార్టీకి, బీఆర్‌ఎస్ పార్టీకి మధ్య పెద్దగా తేడా లేదన్నారు. రాష్ట్రంలో అప్పుల భారం పెరుగుతోందని, ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు రంగు వేసే పరిస్థితి కూడా ఈ ప్రభుత్వానికి లేదని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

చివరిగా విలేకరులకు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి రూ.10లక్షల కోట్లు నిధులు కేటాయించడంతోపాటు రూ.10 లక్షల కోట్లు రుణాల పేరిట ఇచ్చామని వివరించారు. కులగణన సర్వేకు సానుకూలంగా ఉన్నామన్నారు. అనంతరం హంటర్‌రోడ్డులో జరిగిన ఉపాధ్యాయ ఆత్మీయ సమ్మేళనంలో అభ్యర్థి సరోత్తంరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, రాష్ట్ర నాయకులు కాశీప్రసాద్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, జిల్లా నాయకులు ఆర్‌పి జయంత్, చల్లా జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖండాంతరాలు

# దాటిన ప్రేమ

- అమెరికా అమ్మాయి.. నీరుకుళ్ల అబ్బాయి



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : అమెరికా అమ్మాయి జెస్సికతో హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన అబ్బాయి తాటిపర్తి సతీష్‌చంద్రతో హిందూ సంప్రదాయ ప్రకారం హనుమకొండలోని ఏఆర్‌ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం వివాహం జరిగింది. నీరుకుళ్ల గ్రామానికి చెందిన తాటిపర్తి రఘునాథరావు ఏకైక పుత్రుడు సతీష్ చంద్ర అమెరికాలో ఉద్యోగ రీత్యా స్థిరపడ్డాడు. అమెరి కాకు చెందిన జెస్సికతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల పెద్దల అంగీ కారంతో వివాహం చేసుకోవడానికి వారిద్దరు నిశ్చయించుకున్నారు. ఆదివారం హిందూ సంప్రదాయ ప్రకారం జెస్సిక మెడలో సతీష్‌చంద్ర మాంగళ్యధారణ గావించి అర్థాంగిగా స్వీకరించారు. ఈ కల్యాణ మహోత్సవానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ వధూవరులను ఆశీర్వదించారు. తాటిపర్తి రఘునాథారావు హనుమకొండలో సిమెంట్ పైప్‌ల కంపెనీ పెట్టుకొని స్థిరపడ్డారు.

# ఘనంగా సదాశివరావు స్మారక కవి సమ్మేళనం

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ సాహిత్య పరిషత్ పూర్వ అధ్యక్షుడు, వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ కవి, రచయిత బండారు సదాశివరావు స్మారక కవి సమ్మేళనం హంటర్‌రోడ్‌లోని శ్రీ వ్యాస ఆవాసంలో ఆదివారం వైభవంగా జరిగింది. 'హిందువుగా జీవించు.. హిందువునని గర్వించు..' అనే అంశంపై నిర్వహించిన కవితా పోటీల్లో అనేక మంది కవులు ఉత్సాహంగా పాల్గొని కవితాగానం చేశారు. ప్రముఖ కవి, పిల్లల వైద్యులు బండారు ఉమామహేశ్వర్‌రావు కవి సమ్మేళనానికి అధ్యక్షత వహించగా జాతీయ సాహిత్య పరిషత్ నగర ప్రధాన కార్యదర్శి తాడిచెర్ల రవి కవి సమ్మేళనాన్ని ప్రారంభించారు. ఆర్‌ఎస్ఎస్ వరంగల్ విభాగ్ సంచాలక్ ఆచార్య చిలకమారి సంజీవ, ప్రముఖ వైద్యుడు డాక్టర్ బి.శివసుబ్రమణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సదాశివరావు రాసిన అగ్నిమూర్తులు గ్రంథంపై వరిగొండ కాంతారావు స్మారకోపన్యాసం చేశారు. జీవనపర్యంతం జాతీయవాదమే ఊపిరిగా జీవించిన మహావ్యక్తి సదాశివరావు అని ఆయన ఆశయం అందరికీ ఆదర్శకం కావాలన్నారు. వ్యాసప్రతిష్ఠ కార్యదర్శి బూర రాంచందర్‌తోపాటు పెద్ద సంఖ్యలో కవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవులందరికీ ప్రత్యేక జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. లక్ష్మణ్, సుధాకర్ సంయోజకులుగా వ్యవహరించారు.



సమ్మేళనంలో పాల్గొని, సత్కారం అందుకున్న కవులు

# ఆవిష్కరణల మాంత్రికుడు యశ్వంత్

- అంతర్జాతీయ హ్యాకథాన్‌లో ప్రథమ బహుమతి
- గ్లోబల్ నాసా స్పేస్ యాప్ చాలెంజ్ పోటీల్లో స్పెషల్ జ్యూరీ అవార్డు
- అరుదైన రెండు అవార్డులు సొంతం చేసుకున్న హనుమకొండ వాసి

హనుమకొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ గ్లోబల్ నాసా స్పేస్ యాప్ చాలెంజ్ పోటీల్లో యశ్వంత్ టీమ్ ఇటీవల స్పెషల్ జ్యూరీ అవార్డును అందుకున్నది. అలాగే యశ్వంత్ కృష్ణ ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ హైపర్మోడ్ నాలెడ్జ్ గ్రాఫ్, ఏఐ చాలెంజ్ ఇంటర్నేషనల్ హ్యాకథాన్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా కూడా నిలిచాడు. ఇలా రెండు అవార్డులు అందుకున్న వారు చాలా అరుదు. హనుమకొండ బాలసముద్రంలో నివాసముంటున్న ఈ యువ మేధావి స్వస్థలం ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామం. యశ్వంత్ నాన్న ప్రముఖ హోమియోపతి వైద్యుడు డాక్టర్ పావుశెట్టి శ్రీధర్. ఈ నేపథ్యంలో యశ్వంత్ విజయ రహస్యం మీ కోసం.

### 533 బృందాలతో పోటీ

కంప్యూటర్ సైన్స్ మూడో సంవత్సరం చదువుతున్న యశ్వంత్.. నూతన ఆవిష్కరణలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. గత నెలలో అంతర్జాతీయ స్థాయిలో రెండు అవార్డులు అందుకొని ఎందరికో ప్రేరణగా నిలిచాడు. అంతర్జాతీయ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), నాలెడ్జ్ గ్రాఫ్ హ్యాకథాన్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన యశ్వంత్ కృష్ణ.. విజేతగా నిలిచి మూడు వేల అమెరికన్ డాలర్ల ప్రైజ్ మనీ అందుకున్నాడు. ఈ పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా 533 బృందాలు పాల్గొనగా, భారత్ నుంచి పాల్గొన్న యశ్వంత్ టీమ్ ప్రథమ బహుమతి సాధించడం విశేషం.

అలాగే అంత ర్జాతీయ గ్లోబల్ నాసా యాప్ చాలెంజ్ పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల విద్యార్థులు పాల్గొన్నారు. పంజాబ్‌లో జనవరిలో జరిగిన ఈ పోటీ ల్లో యశ్వంత్ టీమ్ స్పెషల్ జ్యూరీ అవార్డు అందుకొని పలువురి మన్ననలు అందుకున్నది.



యశ్వంత్ టీమ్‌ను అభినందిస్తున్న టీ-వర్క్స్ సీఈవో జోగేందర్

### నాసా స్పేస్ యాప్స్ చాలెంజ్ అంటే..?

నాసా ఇంటర్నేషనల్ స్పేస్ యాప్స్ చాలెంజ్ అనేది ప్రపంచ వ్యాప్తంగా కోడర్లు, శాస్త్రవేత్తలు, డిజైనర్లు, థీమ్ నిపుణులు, తయారీదారులు సాంకేతిక నిపుణులు, ఆవిష్కర్తల కోసం ఉద్దేశించిన ఒక హ్యాకథాన్. ఈ చాలెంజ్‌లో పాల్గొన్న పుడు ఒకేలాంటి ఆలోచనలు గల వ్యక్తులను కలిసే అవకాశం లభిస్తుంది. సైన్స్, టెక్నాలజీని సృజనాత్మకంగా ఉపయోగించడం ద్వారా కొత్త అన్వేషణల పట్ల ఆసక్తి పెరుగుతుంది. నాసా స్పేస్ చాలెంజ్ బృందాలు నాసా నిపుణులు విసిరిన సవాళ్లను పరిష్కరించే సమర్థతను బట్టి విజేతలుగా నిలుస్తారు. ఆ కోవలో యశ్వంత్ బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. నాసా భారతదేశంలో నిర్వహించిన ఈ ఈవెంట్‌లో యశ్వంత్ బృందం పాల్గొని ప్రతిభను కనబరిచింది. ఆ తర్వాత పంజాబ్‌లో నిర్వహిం చిన గ్లోబల్ స్థాయి చాలెంజ్‌లో పాల్గొన్నది. ఇక్కడ కూడా యశ్వంత్ టీమ్ అసాధారణ ప్రతిభను ప్రదర్శించి టాప్ టెన్ టీమ్‌లో ఒకటిగా నిలిచింది. ఈ పది టీమ్‌లకు ఒక్కొక్క అంశంలో ఒక్కో అవార్డు లభించింది. ఇందులో భాగంగా యశ్వంత్ టీమ్‌కు పీపుల్స్ చాయిస్ అవార్డు దక్కింది. కాలేజీ స్థాయిలో పోటీ చిన్నగానే ఉన్నప్పటికీ గ్లోబల్ స్థాయి పోటీ మాత్రం కఠినంగా ఉంటుంది. ఈ చాలెంజ్‌ను 48గంటల్లో విజయవంతంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. యశ్వంత్ టీమ్ ఈ చాలెంజ్‌లో భాగంగా నాసా కనిపెట్టిన ఒక టెలిస్కోప్‌ను ఇతివృత్తంగా తీసుకున్నారు. ఈ టెలిస్కోప్ గురించి సాధారణ ప్రజలకు అంతగా తెలియదు. నాసా విసిరిన సవాల్ మేరకు యశ్వంత్ బృందం ఈ టెలిస్కోప్ గురించి అందరూ చాలా సులభంగా తెలుసుకునే విధంగా ఒక వెబ్‌సైట్‌ను నిర్ణీత గడువులో రూపకల్పన చేశారు. అలా అంతర్జాతీయ స్థాయిలో అరుదైన అవార్డును సొంతం చేసుకున్నారు.



యశ్వంత్ కృష్ణ

### మరో హ్యాకథాన్ ఏమిటంటే?

యశ్వంత్ టీమ్ పాల్గొన్న మరొక చాలెంజ్ అంతర్జాతీయ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), నాలెడ్జ్ గ్రాఫ్ హ్యాకథాన్. ఇందులో కూడా విజయం సాధించారు. ఈ పోటీ అంతా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. 48 రోజులు నిరంతరాయంగా కోడింగ్ చేసి ఇచ్చిన గడువు పూర్తయ్యే నాటికి పోటీ నిర్వాహకులు సూచించిన ఒక ప్రాజెక్టును రూపొందించాలి. ఇది సదరు కంపెనీ సాఫ్ట్‌వేర్‌కు అనుగుణంగా వారికి ఉపయోగపడే రీతిలో ఉండాలి. ఈ పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా 533 బృందాలు పాల్గొన్నగా యశ్వంత్ బృందానికి ప్రథమ బహుమతి వచ్చింది.

## ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని పార్కు స్థలాల్లో వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. స్వరాష్ట్రాన్ని సాధించి తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దాస్యం వినయ్ భాస్కర్ కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో మొక్కలు నాటుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

## ముచ్చర్లలో అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముచ్చర్ల ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం 2004-2005 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 20ఏళ్ల తరువాత జరుపుకున్న ఈవేడుకల్లో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందోత్సాహాలతో తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు లక్ష్మీనర్సయ్య, పావుశెట్టి వెంకటేశం, బి.జయపాల్‌రెడ్డి, ఇ.సుమతి, ఎల్.శ్రీలక్ష్మీ, కె.స్వామినాథ్, ఎం.దేవేందర్, వై.శ్రీదేవి, జి.రజనీదేవిలు పాల్గొని తమ అనుభవాలను, అప్పటి విద్యార్థుల స్థితిగతులను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా చదువు నేర్పిన టీచర్లను విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేడుక ఆర్గనైజర్లు బండ స్రవంతి, గుడికందుల బిందు, చిర్ర శరత్, మట్టెడ శ్రీకాంత్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శాగంటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయంవర్ పదో వార్షికోత్సవ వేడుకలు



హనుమకొండలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న స్వయంవర్ డైరెక్టర్ కాసం మల్లికార్జున్, ఓం నమఃశివాయ

హనుమకొండటౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని స్వయంవర్ షోరూం పదో వార్షికోత్సవ వేడుకలను సంస్థ డైరెక్టర్ కాసం మల్లికార్జున్, కాసం నమఃశివాయ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి స్వయంవర్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో డైరెక్టర్ కాసం మల్లికార్జున్ మాట్లాడుతూ.. వరంగల్ నగరంలో దేశంలోనే 12 రాష్ట్రాలు, 47 నగరాలలో స్వయంవర్ 85 బ్రాంచ్‌లను ఏర్పాటు చేసిందన్నారు. నాణ్యతతో పాటు అందరికీ అందుబాటు ధరలలో షేర్వాణి ఇండో వెస్ట్రన్, జోధపూరి బ్లాజర్స్, సెమీ ఇండోవెస్ట్రన్ కుర్తా పూజామా మోడీసెట్, పట్టు పంచె, పగిడి మోజిడీ టై పెర్ఫ్యూమ్స్ దుపట్టా లెనిన్ కుర్తాస్ షర్ట్స్ అనేక ప్రత్యేకతలతో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పీఎన్ మూర్తి, పుల్లూరు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చికెన్ వండించాలంటూ విద్యార్థుల నిరసన



కేయూ కామన్ మెస్‌లో వంటకాలను వడ్డిస్తున్న పోలీసులు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం చికెన్ వండించాలంటూ విద్యార్థులు ఘెరావ్‌కు దిగారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో తాత్కాలికంగా చికెన్ వద్దంటూ హాస్టల్ అధికారులు నచ్చజెప్పారు. చివరకు వర్సిటీలోనే బందోబస్తు డ్యూటీలో ఉన్న పోలీసులు విద్యార్థులకు భోజనాలు వడ్డించడం వర్సిటీలో తీవ్ర చర్చకు దారితీసింది. ప్రతీ ఆదివారం కాకతీయ యూనివర్సిటీ మెస్‌లన్నింట్లో ఆదివారం చికెన్ కర్రీ విద్యార్థులకు వడ్డిస్తారు. అయితే బర్డ్‌ఫ్లూ వైరస్‌సోకి కోళ్లు చనిపోతుండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు వర్సిటీలో ఆదివారం చికెన్ వంటకాలను నిలిపివేశారు. దీంతో కొందరు విద్యార్థులు తమకు చికెన్ కర్రీ కావాలంటూ వర్సిటీ కామన్ మెస్‌లో ఘెరావ్‌కు దిగారు. దీంతో పోలీసులు మెస్‌లోకి వెళ్లి చికెన్‌కు బదులుగా పండ్లు, స్పెషల్ ఫ్రై కర్రీతో పాటు గుడ్లను విద్యార్థులకు అందచేశారు.

## పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పెగడపెల్లి పూర్వ విద్యార్థులు

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ పెగడపెల్లి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు 10వ తరగతి పూర్తి చేసి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. హనుమకొండ సుబేదారిలోని రాఘవేంద్ర కన్వెషన్ హాల్‌లో 1999- 2000 పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సుమారు వంద మంది పాల్గొన్న కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఆగయ్య, రమేష్‌కుమార్, ఏకనాథం, విజయలక్ష్మి, శశికళ, శ్రీలత, లక్ష్మి, అటెండర్ అక్కయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోయిని కృష్ణయ్య, రణధీర్, రాజేంద్రప్రసాద్, శంకర్‌తో పాటు డి.సరిత, బేబీ, ఆర్.విజయ, బిల్లా ప్రభావతి, లక్ష్మి, విజయలక్ష్మి, మమత, కోమల, పావని పాల్గొన్నారు.

## దేశం బీజేపీ పాలనను కోరుతోంది..

▸▸ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

శంభునిపేట ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రజలంతా బీజేపీ పాలననే కోరుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. పార్టీ జిల్లా నాయకుడు కర్నె రవీందర్ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ బలపరిచిన టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డికి మద్దతుగా 41వ డివిజన్ విశ్వనాథకాలనీలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. దేశంలో గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రజలు బీజేపీకే పట్టం కడుతున్నారని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్‌రావు, రాష్ట్ర నాయకులు కుసుమ సతీష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి మురళీ కృష్ణ, బోరిగం నాగరాజు, కర్నె వాసుదేవ్, శేర్ల అనిల్ కుమార్, నవీన్‌రెడ్డి, గందె గోపి, జక్కంపూడి దామోదర్, సాంబరాజు, చాపల నాగరాజు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చెస్‌తో మేధో సంపత్తి పెంపొందుతుంది

▸▸ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

▸▸ జేఎన్ఎస్‌లో సందడిగా ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : చెస్ క్రీడల్లో పాల్గొనడం ద్వారా మేధో సంపత్తి పెంపొందుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ చెస్ క్రీడా పోటీలను నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెస్ క్రీడలో రాణించాలంటే పట్టుదలతోపాటు ఏకాగ్రతఎంతగానో అవసరమన్నారు. ప్రపంచ స్థాయి చెస్‌లో కీర్తిప్రతిష్టలు పొందిన హనుమకొండ వాసి ఇరిగేసి అర్జున్‌ను వర్ధమాన క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో చేపట్టిన ఓపెన్ టు ఆల్ చెస్ టోర్నీలో 170 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ టోర్నీలో తొలిరోజు ఆట ముగిసెసరికి నాలుగు రౌండ్లు పూర్తి కాగా, అల్లాడి శ్రీవాత్సన్, రజనీకాంత్, వివేక్, ఆద్య, రవీంద్రనాథ్, కొమురవెల్లి విక్రమ్‌లు ముందంజలో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఈవీ శ్రీనివాసరావు, బట్టి శ్రీను, ఆర్బిటర్లు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, తదితరులు పాల్గొన్నారు.



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

## పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

• బీసీ ఇంటలెక్చువల్స్ తెలంగాణ ఫోరం అధ్యక్షుడు చిరంజీవులు

బాలసముద్రం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉపాధ్యాయులందరూ పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని, అనంతరం పోటీలో ఉన్న బీసీ అభ్యర్థులకు మాత్రమే ప్రాధాన్యత క్రమంలో ఓట్లు వేయాలని బీసీ ఇంటలెక్చువల్స్ తెలంగాణ ఫోరం అధ్యక్షుడు కె.చిరంజీవులు విజ్ఞప్తి చేశారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో బీసీ ఇంటలెక్చువల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వరంగల్ యూనైటెడ్ చీఫ్ కోఆర్డినేటర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ.. 77ఏళ్లుగా అధికారం కోల్పోయిన బీసీలు ప్రస్తుత పరిస్థితుల్లో శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సీట్లు గెలుచుకోలేక పోతున్నామని, ఈసారి అందరూ సంఘటితమై బీసీ ఉపాధ్యాయుల గెలుపు కోసం ఎన్నికల ప్రచారానికి సిద్ధమై బీసీ శక్తిని నిరూపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కోఆర్డినేటర్లు మండల పరశురాములు, సాయిని నరేందర్, ప్రొఫెసర్ కె. విజయ్‌బాబు, చందా మల్లయ్య, సంపత్, బాబురావు, పలువురుఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిరంజీవులు

## క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగ నియామకాలు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భీమారంలోని మాతృశ్రీ మహిళ డిగ్రీ, పీజీ కళాశాల ప్రాంగణంలో స్నేహ గ్రూప్ ఆఫ్ మల్టినేషన్ ఆధ్వర్యంలో డీఎస్సీ ఫుడ్ సైన్స్, బీజడ్సీ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 24 మంది విద్యార్థినులను ఎంపిక చేసినట్లు స్నేహ గ్రూప్ ఆఫ్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రిప్రజెంటెటీవ్ ఒంటెల యాకుబ్‌రెడ్డి, అసిస్టెంట్ రిప్రజెంటెటీవ్ నిర్మళ, అశ్విని, మమతలు తెలిపారు. ఈ ఎంపికలపై మాతృశ్రీ మహిళ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ ఎం.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డి.రజినిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, ఇంటర్వ్యూ కన్వీనర్ సంకెపెల్లి శ్రీనివాస్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఎంపికైన వారిలో 12 మంది మాతృశ్రీ మహిళ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు నలుగురు, వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు నలుగురు, న్యూ సైన్స్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినీ ఒకరు, భూపాలపల్లిలోని సంఘమిత్ర డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థిని, కరీంనగర్‌లోని వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి ఒకరు, జగిత్యాలలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు ఇద్దరు చొప్పున ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్ సిటీ స్నేహ గ్రూప్ ఆఫ్ మల్టీనేషనల్ కంపెనీ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేస్తారని కన్వీనర్ సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

## న్యూస్ బాక్స్

### కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నేతలు

మడికొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డి ప్రచారంలో భాగంగా జిల్లాకు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆదివారం 64వ డివిజన్ నాయకులు కలిసి అభినందించారు. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామని మంత్రికి చెప్పారు. కొప్పిరాల శైలశ్రీ రాకేశ్ ఆధ్వర్యంలో సరోత్తంరెడ్డికి ప్రచారం నిర్వహించారు.

### అఖిల గాండ్ల తేలికుల సంఘం అధ్యక్షుడిగా సురేందర్



బాలసముద్రం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని హరిత హోటల్‌లో నిర్వహించిన అఖిల గాండ్ల తేలికుల సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా డాక్టర్ జక్కం సురేంద ర్, ప్రధాన కార్యదర్శిగా పిల్లలమర్రి శివ ఎన్నికయ్యారు. ఎన్నికలఅధికారిగా రాష్ట్ర ఎన్నికల అధికారి బొల్లం వీరసుందర్ వ్యవహరించారు.

### బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

కమలాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కమలాపూర్ మండలం కానిపర్తి గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి యువకుడు మృతి చెందాడు. సీఐ హరికృష్ణ తెలిపిన ప్రకారం... ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామానికి చెందిన సబ్బు మధుకర్ (26) అనే యువకుడు కమలాపూర్ మండలం కానిపర్తి గ్రామానికి ఆదివారం సాయంత్రం వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ఆదివారం రాత్రి శంభునిపల్లి గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. దీంతో మధుకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి శవాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించారు. కాగా, మృతుడి తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. మృతుడి డిగ్రీ వరకు చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు.

## సర్కారు బడులను పరిరక్షించడం అగ్రవర్ణాలకు సాధ్యం కాదు

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడులను పరిరక్షించడం అగ్రవర్ణాలతో సాధ్యం కాదని బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ రాజ్యాధికార జాక్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ విశారదన్ మహరాజ్ అన్నారు. ఆదివారం నయీంనగర్‌లోని ఆదర్శకాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత అగ్రవర్ణకుల పాలకుల వల్ల విద్యారంగం భ్రష్టు పట్టిందన్నారు. ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధిక శాతం అగ్రవర్ణ కులాల వారు పోటీచేస్తున్నారని, ఇప్పటివరకు ఆ వర్గాల వారే పెద్దల సభలో ఎమ్మెల్సీగా కొనసాగుతూ వారి సొంత ఎజెండాలను అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. నర్సిరెడ్డి ఉపాధ్యాయ సమస్యలపై ఏనాడూ మాట్లాడని దాఖలు లేవన్నారు. బీసీ కార్డులపై గెలిచిన పూల రవిందర్ వెలమ దొరల పార్టీలో పనిచేసి సొంత లాభాలను చేకూర్చుకున్నాడన్నారు. 33 యేళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్యార్థులను తన సొంత బిడ్డలను తీర్చిదిద్ది అక్కున చేర్చుకున్న ధర్మ టీచర్స్ యూనియన్ (డీటీయూ) తరపున టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న దళిత బిడ్డ దామెర బాబురావును ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో డీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లు, ప్రధాన కార్యదర్శి ఉమేందర్, సాంబయ్య, రాజు, కుమార్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

## కారు షెడ్లను ప్రారంభించిన జస్టిస్ మౌసమి భట్టాచార్య

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాల కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల కోసం నిర్మించిన కారు షెడ్లను రాష్ట్ర హైకోర్టు జడ్జి, ఉమ్మడి జిల్లాల పోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ మౌసమి భట్టాచార్య ప్రారంభించారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు కారు షెడ్లతో పాటు కోర్టులో నిర్మించిన లిఫ్ట్‌ను కూడా వర్చువల్‌గా హైకోర్టు న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల జడ్జిలు నిర్మల గీతాంబ, సీహెచ్. రమేష్‌బాబు, ఇతర న్యాయమూర్తులు, ఉభయ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాతంగి రమేష్‌బాబు, తీగల జీవన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు లాడె రమేష్, ముదసిర్ అహ్మద్, ఇతర కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



కారు షెడ్లను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న జస్టిస్ భట్టాచార్య



వేయిస్తంభాల ఆలయంలో విఘ్నేశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు

## రుద్రేశ్వరాలయంలో వైభవంగా సంకటహార చతుర్థి

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఆదివారం మాఘశుద్ధ బహుళ చతుర్థి వేళ సంకటహర చతుర్థి వేడుకలు నిర్వహించారు. సకలదోష నివారణార్థమై గణపతికి ప్రత్యేక పూజలను నిర్వహింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, మణికంఠ శర్మ, ప్రణవ్‌ల ఆధ్వర్యంలో ఉత్తిష్ఠ గణపతికి నవసర పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. హరిద్రా కుంకుమ విలేపనంతో గరిక పూజ, పుష్పార్చన చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు తమ విఘ్నాలు తొలగిపోవాలని గణపతిని కోరుకొని రుద్రేశ్వరునికి సన్నిధిలో అభిషేకం నిర్వహించారు.

### సంకటచతుర్థి పూజలు

మడికొండ : మడికొండ మెట్టురామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం సంకటచతుర్థి పూజలు జరిగాయి. గణపతి స్వామికి పంచామృత అభిషేకం చేసి గరికతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో కార్యనిర్వాహక అధికారి కె.శేషు భారతి, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాషశర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సుబేదారి పీఎస్ పరిధిలోని ఎన్జీవోస్‌కాలనీలో పేకాటడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.51,610 నగదును స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. తదుపరి చర్యల కోసం ఏడుగురు నిందితులతోపాటు వారి నుంచి స్వాధీనం చేసుకున్న 7 సెల్‌ఫోన్లు, నగదును పోలీసులకు అప్పగించామన్నారు.

## జర్నలిస్టుల రైల్వే పాస్‌లు పునరుద్ధరించాలి



మంత్రి కిషన్‌రెడ్డి వినతిపత్రం ఇస్తున్న టీఎస్ జేయూ నేతలు

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రద్దు చేసిన జర్నలిస్టు రైల్వే రాయితీ పాస్‌లను పునరుద్ధరించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. కరోనావ్యాప్తి సమయంలో రైల్వే మంత్రిత్వ శాఖ రాయితీ పాస్‌లు రద్దు చేసినప్పటి నుంచి అక్రిడిటేషన్ జర్నలిస్టులు వార్తా కథనాల సేకరణ కోసం సొంత ఖర్చులతో ప్రయాణం చేయాల్సి వస్తోందని మంత్రికి వివరించారు. టీఎస్‌జేయూ రాష్ట్ర, జిల్లా బాధ్యులు తోకల అనిల్, కందికొండ మోహన్, కుమారస్వామి, సత్యం, గంగరాజు, శ్రీహరి, హరికృష్ణలు పాల్గొన్నారు.

## మోటార్లు బంద్ చేయకుంటే రోడ్డెక్కుతాం..

• దేవాదుల పంప్‌హౌస్ ఎదుట రైతుల ధర్నా



పంప్‌హౌస్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

శాయంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : చలివాగు నుంచి నీటిని లిఫ్ట్ చేసే దేవాదుల పంప్‌హౌస్‌లోని మోటార్లు వెంటనే బంద్ చేయాలని, లేకుంటే రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని జోగంపల్లి శివారు పంప్‌హౌస్ వద్ద రైతులు ఆదివారం సాయంత్రం ధర్నా చేశారు. ఈ ధర్నాకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి మద్దతు తెలిపారు. చలివాగు ప్రాజెక్టులో నీటి నిల్వ తగ్గిపోవడంతో మండలంలోని హుస్సేన్‌పల్లి, పత్తిపాక, ప్రగతిసింగారం, వసంతాపూర్, మైలారం గ్రామ రైతుల పంటలకు నీరు అందడం లేదు. దీంతో ధర్మసాగర్ రిజర్వాయర్‌కు నీరు లిఫ్ట్ చేసే రెండు మోటార్లలలో ఇటీవల ఓ మోటార్‌ను రైతుల విజ్ఞప్తి మేరకు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవతో నిలిపి వేశారు. అయినప్పటికీ నీటి నిల్వ పెరగడం లేదని రెండవ మోటార్ కూడా రెండు రోజులు నిలిపివేయాలని రైతులు కోరారు. ఈ నేపథ్యంలో అధికారులు పట్టించు కోకపోవడంతో పంప్‌హౌస్‌ను ముట్టడించారు. తామే మోటార్‌లు నిలిపివేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... అధికారులు పంటలను పట్టించుకోవడం లేదని అక్కడున్న సిబ్బంది ఏఈఈ కార్తీక్‌ను ఫోన్‌లో సంప్రదించగా బాధ్యత రహితంగా మాట్లాడు తున్నాడని ఆరోపించారు. లిఫ్టింగ్ మోటార్ నిలిపివేస్తే భీంఘన్‌పూర్ నుంచి చలివాగు ప్రాజెక్టులోకి నీటిని పంపింగ్ చేసే మోటార్‌లు నిలిపివేస్తామని రైతులను బెదిరిస్తున్నారని వాపోయారు. సిబ్బంది సోమవారం అధికారులు రైతులతో మాట్లాడతారని చెప్పడంతో రైతులు శాంతించారు. ఈ ధర్నాలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో మత్స్య సొసైటీ మాజీ చైర్మన్ మృతి



తిరుపతి (ఫైల్)

ఆత్మకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోనీ నీరుకుళ్ల నుంచి ఆత్మకూ రు వస్తుండగా మార్గ మధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిన సంఘటనలో మాజీ మత్స్య సొసైటీ చైర్మన్ బయ్య తిరుపతి(40) అక్కడిక్కడే మృతి చెందా డు. గ్రామస్తులుతెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెం దిన తిరుపతి నీరుకుళ్లలో వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి ఆత్మకూరుకు వస్తున్నాడు. ఈ క్రమంలో శ్మశాన వాటిక వద్ద ఎస్సారెస్పీ కాలువ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఎగిరి కెనాల్‌పై పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఒంటరిగా ద్విచక్ర వాహనంపై వస్తు న్న తిరుపతి మృతి పట్ల కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందా.. ఇంకేమైనా జరిగిందా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య రజిని, ఇద్దరు కుమారులు ఉన్నారు. తిరుపతి అకాల మృతి పట్ల కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## స్క్రీన్ టైమ్ తగ్గించాలంటే...

మొబైల్‌తో ఎక్కువ సమయం గడపడం వల్ల ప్రతి ఒక్కరి జీవితంలో డిజిటల్ స్క్రీన్ టైమ్ పెరిగిపోయింది. దీంతో శారీరక, మానసిక సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ స్క్రీన్ టైమ్‌ను ఎలా తగ్గించుకోవాలో తెలుసుకుందాం!

- నోటిఫికేషన్ ఆప్షన్‌ను సెట్‌చేసి పెట్టుకోవడం వల్ల అవి వచ్చిన ప్రతిసారీ చేస్తున్న పనిని ఆపి మొబైల్ చూడాలనిపిస్తుంది. అందుకే పని పూర్తయ్యే వరకూ ఈ ఆప్షన్‌ను ఆపి ఉంచుకోవడం మంచిది. దీంతో ఏకాగ్రతగా పనిచేసుకోగల్గుతాం.
- రంగులతో డిస్‌ప్లే ఉంటే తరచూ మొబైల్ చూడాలనిపిస్తుంది. అదే బ్లాక్ అండ్ వైట్ థీమ్‌లోకి మారిస్తే మనకు తెలియకుండానే మొబైల్ నుంచి ధ్యాస మళ్లుతుంది.
- భోజనం చేసే సమయంలో, రాత్రి పడుకునేటప్పుడు మొబైల్‌ను సాధ్యమైనంత దూరంలో ఉంచాలి. కుటుంబ సభ్యులతో, చుట్టుపక్కలవారితో మాట్లాడుతూ ఉంటే మొబైల్ గుర్తుకు రాదు.




- ప్రతి రోజూ కొంత సమయాన్ని డిజిటల్ బ్రేక్‌గా నిర్ణయించుకుని అనుసరించాలి. ఈ సమయంలో అత్యవసరమైతే తప్ప మొబైల్‌ను ముట్టుకోవద్దు. దీనివల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది.
- రాత్రిపూట మొబైల్‌లో అలారం సెట్ చేయవద్దు. దీనికోసం గడియారాన్ని ఉపయోగించడం మంచిది. బెడ్‌రూమ్‌లో మొబైల్ ఫోన్ ఉంచవద్దు.
- తరచూ వార్తాపత్రికలు, లేదా పుస్తకాలు చదువుతూ ఉంటే మొబైల్ చూసే అలవాటు నుంచి బయటపడవచ్చు. దీనివల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది.
- సోషల్ మీడియా వాడకాన్ని తగ్గించుకోవాలి. ఎక్కువగా రీల్స్ ఫొటోలు, మెసేజ్‌లు షేర్ చేసేవారిని మ్యూట్‌లో పెడితే కొంతవరకూ ప్రయోజనం ఉంటుంది.
- ఇష్టమైన మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్ నేర్చుకోవడం, మంచి పుస్తకాలు చదవడం, పిల్లలతో కలిసి ఆటలాడడం, వ్యాయామం చేయడం, ధ్యానం, నడక, గార్డెనింగ్ లాంటివి అలవాటు చేసుకుంటే డిజిటల్ స్క్రీన్ టైమ్‌ని తగ్గించుకోవచ్చు.

## పెరుగుతో ఫేషియల్...

ముఖం అందంగా కనిపించాలని మహిళలు ఫేషియల్ చేయించుకుంటూ ఉంటారు. ప్రతిసారీ పార్లర్‌కి వెళ్లకుండా ఇంట్లో వుండే పెరుగుతో స్వయంగా ఫేషియల్ చేసుకుని ముఖాన్ని కాంతివంతంగా మార్చుకోవచ్చు. ఆ వివరాలు తెలుసుకుందాం!

- ముందుగా ముఖాన్ని సున్నిపిండితో శుభ్రం చేసుకోవాలి. ఒక గిన్నెలో రెండు గంటెల పుల్లని పెరుగును తీసుకుని చెంచాతో బాగా కలిపి చిక్కని మిశ్రమంలా చేయాలి. దీనిని వేళ్లతో కొద్దిగా తీసుకుంటూ ముఖమంతా పట్టించి అయిదు నిమిషాలు సున్నితంగా మర్దన చేయాలి. పది నిమిషాల తరవాత చల్లని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే చర్మానికి తగినంత తేమ అంది ముఖం మెరుపు సంతరించుకుంటుంది. పెరుగులో ఉండే లాక్టిక్ యాసిడ్... నుదుటిపై ముడుతలు, గీతలు రాకుండా కాపాడుతుంది. అంతేకాదు బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేసి ముఖానికి సహజ కాంతిని అందిస్తుంది.
- ఒక గిన్నెలో రెండు గంటెల పెరుగు, ఒక చెంచా కాఫీ పొడి, రెండు చెంచాల పంచదార వేసి కలపాలి. పెరుగులో పంచదార కరగడానికి ముందే ఈ మిశ్రమాన్ని వేళ్లతో ముఖమంతా పట్టించాలి. నుదురు, చెంపలు, ముక్కు భాగాల్లో కింది నుంచి పైకి వేళ్లతో సున్నితంగా రుద్దాలి. ఈ మిశ్రమం చక్కని స్క్రబ్‌లా పనిచేసి చర్మ రంధ్రాలను శుభ్రం చేస్తుంది. చర్మం మీద పేరుకున్న మృతకణాలన్నీ తొలగిపోతాయి. తరచూ ఇలా చేస్తూ ఉంటే ముఖం మీద బ్లాక్ హెడ్స్, మొటిమలు రావు. ఎండ వల్ల కలిగే నలుపుదనం కూడా తగ్గిపోతుంది.
- చిన్న గిన్నెలో ఒక గంటె పెరుగు, ఒక గంటె టమాటా గుజ్జు వేసి బాగా కలపాలి. మెత్తని బ్రష్ సహాయంతో ముఖంపై కింది నుంచి పైకి దిశలో ఈ మిశ్రమాన్ని పట్టించాలి. కళ్ల మీద గుండ్రంగా తరిగిన టమాటా ముక్కలు పెట్టుకోవాలి. కళ్లు మూసుకుని అరగంట విశ్రాంతి తీసుకోవాలి. తరవాత చల్లని నీళ్లతో ముఖం కడుక్కోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే ముఖం మీద చర్మం బిగుతుగా మారి నున్నగా ఆరోగ్యంగా కనిపిస్తుంది.



విజేత



ఐదు పదులు దాటిన వయసులో పరుగు మొదలుపెట్టారు. అరవైల్లో పోటీల బరిలోకి దిగారు. ఇప్పుడు తొంబై ఏళ్ల వయసులోనూ అదే ఉత్సాహంతో... సరికొత్త 'ట్రాక్' రికార్డులు నెలకొల్పుతున్నారు. కేరళలో ఇటీవల జరిగిన 'జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్'లో మూడు పతకాలు మెడలో వేసుకున్నారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో 'పరుగుల బామ్మ'గా పేరుపొందిన... ముత్యం లక్ష్మితో 'నవ్య' మాటామంతి.

# ఈ బామ్మ క్రీడా ముత్యం

"మూడు దశాబ్దాలు దాటిపోయాయి... నేను పోటీల్లోకి దిగి. అప్పుడు నాకు యాభై ఎనిమిదేళ్లు. పరుగు మొదలుపెట్టినప్పుడు... ఇంటి పట్టునే కూర్చొని మనవళ్లతో ఆడుకొనే వయసులో ఆటలేంటని అన్నవారూ ఉన్నారు. అందుకు నేను చిన్నబుచ్చుకోలేదు. అది వారి అభిప్రాయం. నేనేంటో, నా సామర్థ్యం ఏంటో నాకు తెలిసినప్పుడు... ఎవరో ఏదో అన్నారని బాధ పడుతూ కూర్చోవడంలో అర్థంలేదు. అందుకే నాకు నచ్చిన దారిలో నేను అడుగులు వేశాను. ఇవాళ మాస్టర్స్ అథ్లెట్‌గా, 'పరుగుల బామ్మ'గా మీ అందరి మన్ననలు పొందుతున్నాను. అనకాపల్లి జిల్లా చోడవరం మాది. ఏడో తరగతి వరకే చదువుకున్నాను. మావారు శ్రీనివాసరావు సర్పంచ్‌గా పని చేసేవారు. మాకు ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల. పెద్ద కొడుకు పదవీ విరమణ పొందాడు.

### రిటైర్మెంట్ వయసులో...

పిల్లలంతా పెద్దవారైపోయారు. పెళ్లిళ్లు చేసుకున్నారు. ఇంట్లో ఖాళీగా ఉండడం ఎందుకని రిటైర్మెంట్ వయసులో నడక మొదలుపెట్టాను. తరువాత చిన్న చిన్న పరుగు, నడక పందేల్లో పాల్గొనేదాన్ని. ఆరు పదులు దగ్గరపడుతున్న వయసులో ఏదో సాధించాలని నేను పడుతున్న తపన చూసి స్థానికులు నన్ను ప్రోత్సహించారు. వారందరి ప్రోద్బలంతో 1993లో తొలిసారి జిల్లా స్థాయి పరుగు పోటీలకు వెళ్లాను. అందులో పతకాలు గెలిచాను. అది నాలో ఎనలేని ఉత్సాహం నింపింది. ఇక అక్కడి నుంచి వెనుదిరిగి చూడలేదు. క్రమంగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పోటీపడుతూ వచ్చాను. పతకాలు గెలవడం ఒక ఆనవాయితీగా మారిపోయింది.

### గాయంతో బ్రేక్ పడినా...

ఐదేళ్ల కిందటి వరకు నేను పరుగు పోటీల్లో పాల్గొనేదాన్ని. అయితే ఒకరోజు ఇంట్లో జారి పడ్డాను. కాలు విరిగింది. ఇక క్రీడలు వద్దని కొందరు సలహా ఇచ్చారు. కానీ నేను పరుగు పోటీలను పక్కన పెట్టి... జావెలిన్ త్రో, డిస్క్ త్రో, షార్ట్‌పుట్ ఎంచుకున్నాను. సాధన మొదలుపెట్టాను. నైపుణ్యం సాధించాను. నాపై నాకు నమ్మకం కుదిరడంతో, బరిలోకి దిగాను. దానికి ముందు 2010లో కౌలాలంపూర్‌లో జరిగిన 'ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్'లో స్వర్ణ, రజత పతకాలు గెలుచుకున్నాను.

### నడకే నన్ను నడిపిస్తోంది...

ఇటీవల కేరళలో కేరళలో ముగిసిన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో మూడు విభాగాలు... షాట్‌పుట్, డిస్క్ త్రో, జావెలిన్ త్రోల్లో పాల్గొన్నాను. అందులో రెండు స్వర్ణ పతకాలు, ఒక రజతం నెగ్గాను. జాతీయ స్థాయిలో నేను సాధించిన పతకాలు ఎన్నో ఉన్నాయి. ఏ పోటీకి వెళ్లినా పతకం లేకుండా తిరిగి వచ్చిన సందర్భాలు అరుదు. తొమ్మిది పదుల వయసులో కూడా ఇంత ఉత్సాహంగా, ఆరోగ్యంగా

> **ప్రోత్సాహం అవసరం...**
>
> మాది సాధారణ మధ్యతరగతి కుటుంబం. గతంలో చోడవరం తహసీల్దారుగా పని చేసిన శైలజ నాకు ఇంటి స్థలం మంజూరు చేశారు. అందులో చిన్న ఇల్లు కట్టుకొని నివసిస్తున్నాను. పిల్లలు అందరూ విశాఖపట్టణంలో ఉంటున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నాలుగు వేల వృద్ధాప్య పింఛను మినహా నాకు వేరే ఆధారం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో క్రీడాకారుల పింఛన్ కింద ఏడాదికి ఆరు వేలు వచ్చేది. విభజన తరువాత అదీ ఆపేశారు. దాతల సహకారంతో ఈవెంట్లకు వెళుతున్నాను. ఈ వయసులో కూడా పోటీల్లో పాల్గొంటున్నానంటే క్రీడలపై నాకున్న మక్కువ. ఇంకా ఏదో సాధించాలన్న తపన. ప్రభుత్వం నుంచి కూడా ప్రోత్సాహం లభిస్తే, నాలాంటి మరెందరో క్రీడాకారులు ముందుకు వస్తారు.

ఉండటానికి కారణం... నడక. నా జీవితంలో నడక ఒక భాగమైపోయింది. స్థానికంగా ఎక్కడికైనా సరే... నడిచే వెళతాను. తప్పనిసరి అయితే తప్ప వాహనాలు ఎక్కను.

### ఇంటి వంట...

వయసు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్య సమస్యలు కూడా పెరుగుతుంటాయి. అందుకే క్రమబద్ధమైన ఆహార నియమాలను నా జీవనశైలిలో చేర్చుకున్నాను. ప్రత్యేకమైన ఆహారం ఏమీ ఉండదు కానీ... ఉదయం అల్పాహారం తీసుకోను. మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం... అంతే. రాత్రి ఏమీ తినను. ఉదయం, సాయంత్రం... రెండుసార్లు కాఫీ తాగుతాను. ఏదైనా ఇంటి వంటే. బయటవి అస్సలు ముట్టుకోను. ఇతర ప్రాంతాలకు వెళ్లినా అక్కడ వంట చేసుకొంటాను. ఇది మా అమ్మ నుంచి వచ్చిన



అలవాటు. ఇంట్లో వండిన ఆహారం తినడంవల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. నా ఈ ప్రయాణంలో ఎన్నో కష్టాలు. అడుగడుగునా సవాళ్లు. ఆటపై ఇష్టంతోనే వీటన్నిటినీ అధిగమించి, రాణించగలుగుతున్నాను. సాధించాలన్న తపన ఉండాలే కానీ... వయసు అడ్డంకి కాదని చెప్పడానికి నేనే ఒక ఉదాహరణ."

• వి.జోజిబాబు, చోడవరం

# అమ్మ మనసు అమృతం పంచుతోంది!


**తల్లిపాలకు నోచుకోని శిశువుల అవస్థలు చూసి విచిత్ర సెంథిల్ కుమార్ అమ్మ మనసు చలించిపోయింది. తమిళనాడులోని తిరుప్పూర్‌కు చెందిన ఆమె తనవంతు ప్రయత్నంగా ప్రారంభించిన 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్' నాలుగువేల లీటర్లకి పైగా చనుబాలను సేకరించి, ఎంతోమంది పిల్లలకు జీవనాధారంగా నిలుస్తోంది.**



ఫుట్‌బాల్ క్రీడాకారిణిగా పేరు తెచ్చుకోవాలి. మన దేశం తరపున ఆడాలి... విద్యార్థిగా ఉన్నప్పుడు విచిత్ర సెంథిల్‌కుమార్ కల ఇది. ఆమె కాలేజీ, యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్లకు కెప్టెన్‌గా ఉన్నారు. కోయంబత్తూర్ జిల్లా మహిళా ఫుట్‌బాల్ జట్టులో సభ్యురాలుగా 1999-2002 మధ్య అనేక విజయాల్లో కీలకపాత్ర పోషించారు. రాష్ట్ర జట్టుకు ఆమెను పరిగణనలోకి కూడా తీసుకున్నారు. కానీ గాయాల కారణంగా... ఆటకు దూరం కావలసి వచ్చింది. "కానీ ఎలాంటి పరిస్థితుల్లోనైనా లక్ష్యాన్ని సాధించడానికి నన్ను నేను సిద్ధం చేసుకోవడం, ఎలాంటి అవరోధాలనైనా పట్టుదలతో అధిగమించి ముందుకు సాగడం లాంటివి నాకు క్రీడలే నేర్పించాయి" అని చెబుతున్నారు 41 ఏళ్ళ విచిత్ర. ఆమె స్వస్థలం తమిళనాడులోని చిన్నకలిపాళ్యం. క్రీడల తరువాత ఆమెకు చాలా ఇష్టమైన పని... అవసరంలో ఉన్నవారికి సాయం చెయ్యడం. ఈ విషయంలో తండ్రి మరుదాచలం ఆమెకు స్ఫూర్తి. పేద కుటుంబాల్లోని పిల్లల చదువుకు ఆయన సాయం చేసేవారు. ఆయన అండతో ఎందరో పెద్ద చదువులు చదివి, ఉన్నతోద్యోగాలు సంపాదించుకున్నారు. తండ్రి బాటనే అనుసరించిన విచిత్ర... ప్రభుత్వ పాఠశాలలోని పేద పిల్లలకు ట్యూషన్ ఫీజులు కట్టేవారు. "చిన్న చిన్న పనులు చేస్తూ బతుకు సాగించే కుటుంబాలు... తమ పిల్లల్ని బాగా చదివించాలనుకుంటాయి. కానీ ఆర్థిక పరిస్థితుల వల్ల అది చాలాసార్లు సాధ్యం కాదు. దానికోసం పాకెట్ మనీని వారి ఫీజుల కోసం ఖర్చు చేసేదాన్ని. ఈ సంగతి తెలిసి మా నాన్న నా పాకెట్ మనీని రెట్టింపు చేశారు. "మంచి పని చేస్తున్నావు. ఇంకా డబ్బు కావాలంటే అడుగు" అన్నారు. ఆ మాట విని ఉద్వేగాన్ని ఆపుకోలేక ఏడ్చేశాను" అని గుర్తు చేసుకున్నారు విచిత్ర.

### అంతగా పట్టించుకోని పెద్ద సమస్య...

"వివాహం తరువాత తిరుప్పూర్‌లో స్థిరపడ్డాక కూడా సేవా కార్యక్రమాలను కొనసాగించాను. దీనికి నా భర్త సెంథిల్ కుమార్ అన్ని విధాలుగా మద్దతిచ్చారు. పిల్లల చదువుకు సాయం చెయ్యడంతో పాటు... గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధుల కోసం నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వెయ్యికి పైగా క్యాటరాక్ట్ సర్జరీలు చేయించాం. ఇవన్నీ నేను, నా కుటుంబం, కొద్దిమంది స్నేహితులు కలిసి చేసిన కార్యక్రమాలు. కానీ 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్' నా పరిధిని పెంచింది. సేవాభావం ఉన్న ఎందరో మహిళలను నాకు పరిచయం చేసింది" అంటారు విచిత్ర. 2021లో... ఆమెలో ఈ ఆలోచనకు బీజం పడింది. "అప్పుడు నేను నెలల బిడ్డకు తల్లిని. నా స్నేహితురాలు ఒకరు ఫోన్ చేసి "ఈరోడ్‌లో ఒక శిశువుకు తల్లిపాలు కావాలి. ఇవ్వగలవా?" అని అడిగింది. అలా అడగడం నాకు ఆశ్చర్యం అనిపించింది. అయితే చనుబాలు ఆ శిశువుకు కేవలం పోషకాహారం మాత్రమే కాదనీ, జీవనాధారం అనీ తెలుసుకున్నాక 'సరే' అన్నాను. అక్కడికి వెళ్ళిన తరువాత... వైద్యుల ద్వారా చాలా విషయాలు విన్నాను.. తల్లిపాలకు దూరమైన పిల్లల రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉంటుంది. అలెర్జీలు, జీర్ణ సంబంధమైన ఇబ్బందులు పెరుగుతాయి. ఉబ్బసం లాంటి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. కొందరు పిల్లలకు పోతపాలు పడవు. దీనివల్ల వారు తీవ్ర అనారోగ్యాలకు గురవుతారు. కొన్నిసార్లు ప్రాణాపాయ స్థితి కూడా



ఏర్పడవచ్చునని తెలిశాక.... 'ఇది మనం అంతగా పట్టించుకోని పెద్ద సమస్య' అని అర్థమయింది. అప్పుడే చనుబాల బ్యాంక్ ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చింది"అంటారు విచిత్ర. ప్రసవించిన తల్లులకు, వారి శిశువులకు ఆ బ్యాంక్ అందుబాటులో ఉండాలని ఆమె అనుకున్నారు. తిరుప్పూర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి యాజమాన్యాన్ని కలిసి, తన ప్రతిపాదనను వారికి వివరించారు. వారి అంగీకారంతో... అదే ఏడాది 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్' ఏర్పాటు చేశారు. పాలిచ్చే తల్లులు... వారి మిగిలిన పాలను ఈ బ్యాంకుకు దానం చేస్తే... ఎందరో చిన్నారులకు ప్రాణదానం చేసినట్టవుతుందని ప్రచారం చేశారు.

### వారి ఉదారతే ఎక్కువ...

"తమ పిల్లల కోసం ఉద్దేశించిన పాలను ఇతరులకు ఇవ్వడం చాలామందికి ఇష్టం ఉండదు. అంతేకాదు... ఈ విషయంలో ఎన్నో అపోహలు, అనుమానాలు, మూఢ నమ్మకాలు ఉన్నాయి. ఈ అవరోధాలన్నిటినీ మెల్లగా దాటుతూ వచ్చాం" అని అంటారు విచిత్ర. తనది చిత్తశుద్ధి కలిగిన ప్రయత్నం అనే విశ్వాసాన్ని కలిగించడం కోసం... తల్లులను ఆమె స్వయంగా కలిశారు. వారి ఇంటికి వెళ్ళి వారికి, వారి కుటుంబ సభ్యులకు 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్' గురించి, వారు విరాళంగా ఇచ్చే పాల ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. క్రమంగా దాతల సంఖ్య పెరిగింది. ఎంతోమంది ఉత్సాహంగా ముందుకువచ్చారు. "ఒక మహిళ కేవలం తొమ్మిది నెలల్లోనే 117 లీటర్ల చనుబాలను ఈ బ్యాంక్‌కు అందించారు. నేను చేసే పని మీద మహిళలకు ఏర్పడిన నమ్మకానికి ఇదొక నిదర్శనం" అని చెప్పారు విచిత్ర. గత నాలుగేళ్లలో... నాలుగు వేల లీటర్లకు పైగా చనుబాలను ఆమె సేకరించారు. నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు, తల్లితండ్రులు వదిలేసిన శిశువులు, అనారోగ్యం వల్ల, ఇతర కారణాల వల్ల చనుబాలు ఇవ్వలేని తల్లుల సంతానం... ఇలా ఎందరో ఈ బ్యాంక్ నుంచి ప్రయోజనం పొందుతున్నారు. "ప్రజలతో మమేకమై, వారి విశ్వాసాన్ని పొందే సామర్థ్యం ఆమెకు ఉంది. పసి ప్రాణాలను కాపాడాలనే ఆమె తపన అందరికీ స్ఫూర్తిదాయకం" అంటారు తిరుప్పూర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి వైద్యులు. "ఇది తల్లులకు, బిడ్డలకు మాత్రమే కాదు, కుటుంబాలకు, సమాజానికి సంబంధించిన సమస్య కూడా. అందరం కలిస్తేనే ప్రపంచంలో మార్పు సాధ్యమవుతుంది. ఇందులో నేను చేసిన దానికన్నా... ఎందరో మాతృమూర్తుల ఉదారతే ఎక్కువ. నేను ఇద్దరు పిల్లల తల్లిని. అమ్మ మనసు, అమ్మ కష్టాలు మరో అమ్మకే తెలుస్తాయి. మా 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్'ను నడిపిస్తున్నది, పిల్లలకు తమ పాల రూపంలో అమృతాన్ని పంచుతున్నది అలాంటి అనేక మాతృ హృదయాలే" అని చెబుతున్నారు విచిత్ర.

## పరీక్షల సమయంలో...

పరీక్షల సమయంలో పిల్లలు సహజంగానే ఒత్తిడి, ఆందోళనకు గురవుతూ ఉంటారు. వీటినుంచి విశ్రాంతి లభించాలంటే రోజుకు కనీసం ఎనిమిది గంటలు నిద్రపోవాలని నిపుణులు చెబుతున్నారు. పరీక్షలంటే భయపడకుండా పిల్లలు హాయిగా పడుకోవడానికి పాటించాల్సిన చిట్కాల గురించి తెలుసుకుందాం!



- పరీక్షలు దగ్గరకు రాగానే పిల్లలు రాత్రిపూట పడుకునే సమయాన్ని నిర్దేశించాలి. ఎలాంటి పరిస్థితుల్లోనైనా దానికి కట్టుబడి ఉండేలా చూసుకోవాలి. మరుసటి రోజు ఉదయమే నిద్రలేపాలి. లేదంటే రాత్రికి త్వరగా పడుకోరు.
- పడుకునే సమయానికి రెండు గంటల ముందే భోజనం పూర్తి చేయించాలి. గంట తరవాత గోరువెచ్చని పాలు, అరటిపండు, వాల్‌నట్ లాంటివి ఇస్తే పిల్లలు వెంటనే నిద్రపోతారు.
- టీ, కాఫీలను పిల్లలకు అలవాటు చేయవద్దు. వీటిలో ఉండే కెఫిన్ వల్ల సరిగా నిద్ర పట్టదు.
- పడుకునే ముందు మొబైల్ లేదా టీవీని చూడనివ్వకూడదు. గదిలో వెలుతురు లేకుండా నిశ్శబ్దంగా ఉండేలా చూడాలి.
- పరీక్షల గురించి అతిగా ఆలోచించకుండా ప్రశాంతంగా ఉండడాన్ని పిల్లలకు అలవాటు చేయాలి. సాయంత్రం పూట కొద్దిసేపు ధ్యానం, శ్వాస వ్యాయామాలు చేయిస్తే పిల్లలు వెంటనే నిద్రపోతారు.
- బడిలో చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు చదువుకుంటూ హోమ్ వర్క్‌లు పూర్తిచేసేలా పిల్లలను ప్రోత్సహించాలి. దీనివల్ల పరీక్షలంటే ఆందోళన తగ్గి ప్రశాంతంగా పడుకుంటారు.
- తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు, తాజా పళ్లు, కూరగాయలతో పాటు పోషకాహారాన్ని పిల్లలకు తినిపించాలి. ఎటువంటి అనారోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే పిల్లలు ప్రశాంతంగా నిద్రించగల్గుతారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. పరీక్షలు బాగా రాస్తారు.

## ఇంటికి అందాన్నిచ్చే సోఫాలు

ఇంటిని ఆకర్షణీయంగా మార్చడంలో సోఫా సెట్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. కూర్చోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా ఉంటూ విలాసవంతంగా కనిపించే సోఫాలు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అత్యధికంగా ఆదరణ పొందుతున్న సోఫా సెట్లు ఇవే...



**కర్వ్ సోఫా**

ఇది అర్ధ చంద్రాకారంలో ఉంటుంది. వంపు ఎదురుగా అద్దంతో ఉన్న టీపాయ్‌ని అమరిస్తే చాలా గ్రాండ్‌గా కనిపిస్తుంది. విశాలమైన డ్రాయింగ్ రూమ్‌లో ఈ సోఫా సెట్ వేస్తే క్లాసీ లుక్ వస్తుంది.

**ఎల్ సోఫా**



ఎల్ ఆకారపు సోఫా... హాల్ అందాన్ని పెంచుతుంది. మ్యాచింగ్ కుషన్‌లను పెడితే గ్రాండ్ లుక్ వస్తుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు ఇలా అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.



**బెడ్ సోఫా**

దీనికి అన్ని వర్గాల్లో అధిక డిమాండ్ ఉంది. సోఫాలా ఉపయోగించుకుంటూనే బెడ్ మాదిరి మార్చవచ్చు. సింగిల్ బెడ్‌రూమ్ ఉన్న ఇళ్లకు ఇది అనుకూలంగా ఉంటుంది. హాల్, డ్రాయింగ్ రూమ్, లివింగ్ రూమ్, స్టడీ రూమ్‌లలో వేసుకోవచ్చు. లేత రంగులో ఉన్న సోఫా కవర్ వేస్తే ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

**సర్క్యులర్ సోఫా**



విశాలమైన హాల్‌లో ఈ సోఫాసెట్ చక్కగా అమరుతుంది. సోఫా చివరల్లో వృత్తాకారపు అమరికలు ఉంటాయి. ఫ్లోరింగ్‌కు మ్యాచ్ అయ్యే కలర్ ఎంచుకుంటే హాల్ లేదా డ్రాయింగ్ రూమ్‌కి స్టయిలిష్ లుక్ వస్తుంది.



**రాయల్ సోఫా**

ఇది పెద్ద సైజు సింహాసనంలా కనిపిస్తుంది. అందమైన నగిషీ వర్క్‌తో పొడవైన మెత్తని కుషన్లతో పేరుకు తగ్గట్టు రాజసం ఉట్టిపడుతూ ఉంటుంది. ఈ సోఫాసెట్‌ని వేస్తే హాల్ మొత్తం రాయల్ లుక్‌తో మెరిసిపోతుంది.

**అడ్జస్టబుల్ సోఫా**




దీనిని పలు విధాలుగా మార్చుకునే వీలుంటుంది. ఒకవైపు దివాన్ కాట్‌లా, మరోవైపు ఎల్ సోఫా లేదా సర్క్యులర్ సోఫాలా వేసుకోవచ్చు. విశ్రాంతి తీసుకోవడానికి అనువుగా ఉంటుంది. అవసరాన్ని బట్టి సోఫాను సర్దుబాటు చేసుకునే వీలుంది.



**వాల్ సోఫా**

విశాలమైన డ్రాయింగ్ రూమ్ లేదా హాల్‌లో మూడు గోడల వెంబడి ఈ సోఫా సెట్‌ను అమర్చుకోవచ్చు. ఫ్లోర్ మీద పరచిన కార్పెట్‌కి మ్యాచ్ అయ్యేలా కుషన్స్, కర్టెన్స్ అమరిస్తే రిచ్ లుక్ వస్తుంది. లోనికి ప్రవేశిస్తూనే అద్భుతమైన అనుభూతిని అందిస్తుంది.



జనవరి 22న, "979 పోస్టులతో" యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్- 2025 విడుదలైంది. అయితే గత ఏడాది (2024లో) వెయ్యికి పైగా పోస్టులుండగా, అంతకుముందు సంవత్సరం (2023లో) 1100లకు పైగా పోస్టులున్నాయి. అయితే మొత్తం భర్తీ చేసే సర్వీసులను ఈ సారి 23కు పెంచడం జరిగింది (గత ఏడాది 21 సర్వీసులతో నోటిఫికేషన్ ఇచ్చారు). ఈసారి ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ (IRMS)ను విభజించి, ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్, ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీస్-ఇండియన్ రైల్వే పర్సనల్ సర్వీస్‌లుగా చేయడంతో ఈసారి భర్తీ చేసే సర్వీస్‌ల సంఖ్య 23కు పెరిగింది.

# యూపీఎస్సీ సివిల్స్ ప్రిపరేషన్ ప్లాన్

### తాజా నోటిఫికేషన్‌లో మార్పులు

- సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్‌కు కనీస విద్యార్హత అయిన గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు హాజరుకావచ్చు. గతంలో వీరు కేవలం ప్రిలిమినరీ వరకు మాత్రమే అవకాశం ఉండేది, మెయిన్స్ పరీక్షలకు హాజరు కావాలంటే మాత్రం గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్ సమర్పించాలి. ప్రస్తుతం ఇంటర్వ్యూకి ముందు నిర్దేశిత గడువులోగా ఉత్తీర్ణత సర్టిఫికేట్ సమర్పిస్తే చాలు.
- రిజర్వేషన్లు, వయోపరిమితి సడలింపులు కోరుతున్న అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ప్రిలిమినరీ అప్లికేషన్‌లోనే సమర్పించాలి. గతంలో ఈ నియమం ప్రిలిమ్స్ దశలో లేదు.
- ఆదేవిధంగా OBCలు కుల ధ్రువీకరణ పత్రంతో పాటుగా, నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్‌ను కూడా దాఖలు చేయాలి. నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్ గడచిన మూడు ఆర్థిక సంవత్సరాలు(2021-22, 2022-23, 2023-245) సంబంధించినదై ఉండాలి OBC సర్టిఫికేట్ 01-04-2024 మరియు 11-02-2025 మధ్య జారీ అయినదై వుండాలి .
- EWS రిజర్వేషన్‌కు అర్హులైనవారు కూడా, 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, నిర్ణీత అధికారిచే 01-04-2024 మరియు 11-02-2025 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వ క్రైటీరియా ప్రకారం జారీ చేయబడిన ఇన్ కమ్ అండ్ అసెట్ సర్టిఫికెట్‌ను ప్రిలిమినరీ అప్లికేషన్ దశలోనే సమర్పించాల్సి వుంటుంది.
- ఈసారి "సర్వీస్ ప్రిఫరెన్స్"లను కూడా ప్రిలిమినరీ ఎగ్జామ్ అప్లికేషన్‌లోనే ఎంచుకోవాల్సి ఉంది. అదేవిధంగా "క్యాడర్ ప్రిఫరెన్స్"లను ప్రిలిమ్స్ పరీక్ష అయిన 10 రోజుల తరువాత సమర్పించాలి.
- UPSC పరీక్షకు వన్ టైమ్ రిజిస్ట్రేషన్ అనేది తప్పనిసరి. తొలిసారిగా పరీక్షకు హాజరయ్యేవారు ముందుగా UPSC వెబ్‌సైట్‌లో వన్ టైమ్ రిజిస్ట్రేషన్‌ను చేసుకోవాలి. ఈ వన్ టైమ్ రిజిస్ట్రేషన్లో సమర్పించిన వివరాలను (డేట్ ఆఫ్ బర్త్ మినహా), సమర్పించిన తేదీ నుండి 2025 ఫిబ్రవరి 25 లోపుగా ఎప్పుడైనా సవరించుకోవచ్చు.

### పరీక్ష విధానం:

భారతదేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పోటీ పరీక్షల్లో యూపీఎస్సీ సీఎస్ఈ ఒకటి. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్(ఐఏఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్(ఐపీఎస్), ఇండియన్ ఫారిన్ సర్వీస్(ఐఎఫ్ఎస్) మరియు ఇతర కేంద్రప్రభుత్వ సర్వీస్‌లకు అభ్యర్థులను ఎంపిక చేయడానికి యూపీఎస్సీ ఈ పరీక్షను నిర్వహిస్తుంది.

- **పరీక్ష విధానం:** యూపీఎస్సీ సీఎస్ఈ పరీక్ష మూడు దశలలో జరుగుతుంది.
- **మొదటి దశ:** ప్రిలిమినరీ ఎగ్జామినేషన్
- **రెండవ దశ:** మెయిన్ ఎగ్జామినేషన్ (మెయిన్స్)
- **మూడో దశ:** పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)
- మెయిన్స్, ఇంటర్వ్యూ మార్కులు కలిపి ఫైనల్ ర్యాంక్ లిస్ట్‌ను ఇస్తారు.

**ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ (ప్రిలిమ్స్):** ఇది మొదటి దశ, ఇందులో రెండు ఆబ్జెక్టివ్ తరహా పేపర్లు ఉంటాయి.

**జనరల్ స్టడీస్ పేపర్-1:** ఇందులో హిస్టరీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ జనరల్ నాలెడ్జ్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

**సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (సీశాట్) పేపర్ 2:** పేపర్-2లో కాంప్రహెన్షన్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, లాజికల్ రీజనింగ్ అండ్ అనలిటికల్ ఎబిలిటీ, డెసిషన్ మేకింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, బేసిక్ న్యూమరసీ, ఇంగ్లీష్ లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి(ఒక్కో పేపర్ 200 మార్కులకి ఉంటుంది).

## దిక్సూచి

DIKSUCHI

- CSAT కేవలం క్వాలిఫైంగ్ పేపర్ మాత్రమే. దీనిలో తప్పనిసరిగా 200 మార్కులకి 33%/66 మార్కులు రావాలి.
- పేపర్ 1 మాత్రం కట్ ఆఫ్ మార్కులు ఉంటాయి. ప్రతి సంవత్సరం కట్ ఆఫ్ మార్కు మారుతూ ఉంటుంది.

**మెయిన్స్:** రాత పరీక్ష. ఇందులో తొమ్మిది పేపర్లు ఉంటాయి. ఇవి అభ్యర్థి పరిజ్ఞానాన్ని, లోతుగా పరీక్షిస్తాయి. నిజ జీవిత సంఘటనలను అభ్యర్థులు ఏ విధంగా అర్థం చేసుకోగలుగుతున్నారో అంచనా వేస్తాయి.

**తప్పనిసరి పేపర్లు:** పేపర్ ఏ(ఇండియన్ లాంగ్వేజ్), పేపర్ బి(ఇంగ్లిష్) ఈ రెండు పేపర్లు ఒక్కో పేపర్‌కి 300 మార్కులు ఉంటాయి. ఒక్కో పేపర్‌లో తప్పనిసరిగ్గా 75 మార్కులు సాధించాలి.

**పేపర్ 1:** జనరల్ ఎస్సే **పేపర్ 2:** జనరల్ స్టడీస్-1
**పేపర్ 3:** జనరల్ స్టడీస్-2 **పేపర్ 4:** జనరల్ స్టడీస్-3
**పేపర్ 5:** జనరల్ స్టడీస్-4 **పేపర్ 6:** ఆప్షనల్ పేపర్ -1
**పేపర్ 7:** ఆప్షనల్ పేపర్-2 (ఒక్కో పేపర్ 250 మార్కులు)

**పర్సనాలిటీ టెస్ట్(ఇంటర్వ్యూ):** అభ్యర్థుల వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, వారి పరిపాలన సామర్థ్యాన్ని అంచనా వేస్తారు(దీనికి 275 మార్కులు).

### అర్హతలు:

**వయోపరిమితి:** అభ్యర్థుల వయస్సు 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి(కేటగిరీలను అనుసరించి సడలింపు ఉంటుంది).

**విద్యార్హతలు:** బ్యాచిలర్ డిగ్రీ

**ఎన్నిసార్లు రాయవచ్చు:** అభ్యర్థులు తమ కేటగిరీని బట్టి (జనరల్ కేటగిరీ అభ్యర్థులు-6 సార్లు, ఓబీసీ-9 సార్లు, ఎస్సీ/ ఎస్టీ-అపరిమితం) పరిమిత సంఖ్యలో రాయవచ్చు.

**ఆప్షనల్ సబ్జెక్టులు(మెయిన్స్‌కి మాత్రమే):** నోటిఫికేషన్‌లోని జాబితా నుంచి ఒక ఆప్షనల్ సబ్జెక్టును ఎంచుకోవాలి.

**పరీక్ష షెడ్యూలు:** ప్రతి ఏడాది ఫిబ్రవరి/మార్చిలో నోటిఫికేషన్ వెలువడుతుంది. ప్రిలిమినరీ పరీక్ష మే/జూన్‌లో, మెయిన్స్ సెప్టెంబర్/అక్టోబర్‌లో, ఇంటర్వ్యూను మరుసటి సంవత్సరం ఫిబ్రవరి/మార్చిలో నిర్వహిస్తారు.

**ప్రిపరేషన్:** సిలబస్ చాలా విస్తృతంగా ఉంటుంది, పరీక్ష సంక్లిష్టత కారణంగా చాలా మంది అభ్యర్థులు ఏడాది లేదా అంతకంటే ఎక్కువ కాలంపాటు ప్రిపేర్ అవుతారు. చాలా మంది కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, స్టడీ మెటీరియల్, ఆన్‌లైన్ రిసోర్సెస్, కరెంట్ అఫైర్స్ అప్‌డేట్స్‌పై ఆధారపడతారు.

- ప్రిపరేషన్‌లో నిరంతరం చదవడం, రైటింగ్ ప్రాక్టీస్, ప్రాక్టీస్ ఎగ్జామ్స్ రాయాలి.
- సంక్షిప్తంగా, యుపీఎస్సీ సీఎస్ఈ అనేది భారతదేశంలోని పరిపాలనా వ్యవస్థలో ఉన్నతమైన పదవులకు అత్యంత సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేసే సవాలుతో కూడిన పరీక్ష. దీనికి క్రమశిక్షణ, అంకితభావం, విభిన్న అంశాలపై సమగ్ర అవగాహన అవసరం.

**స్టడీ మెటీరియల్:** మార్కెట్‌లో రకరకాల స్టడీ మెటీరియల్స్ ఉన్నాయి. ఇందులో ఆన్‌లైన్ మెటీరియల్స్ కోచింగ్‌లు అధిక సంఖ్యలో అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఎంపిక చాలా జాగ్రత్తగా ఉండాలి.



ఎం. బాలలత,
సివిల్స్ మెంటార్

# షైనింగ్ కెరీర్ ఫుట్‌వేర్ డిజైనింగ్

ఒక వ్యక్తి ఆహార్యాన్ని ఉన్నతంగా రూపొందించడంలో మేకప్, దుస్తులతో సమాన ప్రాధాన్యం పాదరక్షలది కూడా. ఆకట్టుకునే బట్టలు కట్టుకున్న వ్యక్తి ఆకు చెప్పులతో తిరిగితే ఎబ్బెట్టుగా ఉంటుంది. సమయానికి అనుగుణమైన పాదరక్షలు ధరిస్తే సౌకర్యవంతంగా, హుందాగా ఉంటుంది. పాదరక్షల తయారీ అనేది ఒక పెద్ద ఇండస్ట్రీ. అందుకే భారతదేశంలో ప్రధాన రంగాల్లో లెదర్ ఇండస్ట్రీ ఒకటిగా ఎదిగింది. దేశ జాతీయ ఉత్పత్తిలో రెండు శాతం వాటా ఉన్న ఈ రంగం, దాదాపు 44 లక్షల మందిపైగా ఉద్యోగాలు కల్పిస్తోంది. లెదర్ ఇండస్ట్రీని మార్కెట్‌కు అనుగుణంగా తీర్చిదిద్దడంలో 'ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్'(ఎఫ్‌డీడీఐ)లు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.



ఇంజనీరింగ్ చదువులకు ఐఐటీ, మేనేజ్‌మెంట్ కోర్సులకు ఐఐఎమ్, దుస్తుల ఫ్యాషన్‌కు నిఫ్ట్ ఎలాగో ఫుట్‌వేర్ చదువులకు ఎఫ్‌డీడీఐ అలాంటిది. దేశ వ్యాప్తంగా హైదరాబాద్‌తో సహా నోయిడా, కోల్‌కొతా, రోహ్‌తక్, రాయ్‌బరేలీ, జోధ్‌పూర్, చెన్నై, చింద్వారా, చండీగఢ్, గుణ, అంకలేశ్వర్, పట్నాల్లో 12 ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో 2025-26 అకడమిక్ సంవత్సరం యూజీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ వెలువడింది. ఆల్‌ఇండియా సెలెక్షన్ టెస్ట్-2025 (ఏఐఎస్‌టీ-2025) ఆధారంగా ఎంపిక జరుగుతుంది.

### బ్యాచిలర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు:

**1. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీడీఎస్):** నాలుగు సంవత్సరాల కోర్సు ఇది. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి.

- బీడీఈఎస్(ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్)
- బీడీఈఎస్(ఫ్యాషన్ డిజైన్)
- బీడీఈఎస్(లెదర్, లైఫ్ స్టయిల్ అండ్ ప్రొడక్ట్ డిజైన్)

**2. బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(బీబీఏ):** నాలుగు సంవత్సరాల కోర్సు ఇది. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి.

- బీబీఏ(రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్)

### మాస్టర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు

**1. మాస్టర్ ఆఫ్ డిజైన్(ఎండీఎస్):** రెండు సంవత్సరాల కోర్సు ఇది. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

- ఎండీఈఎస్(ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్)
- ఎండీఈఎస్(ఫ్యాషన్ డిజైన్)

**2. మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ):** ఎంబీఏ(రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్)

**అర్హతలు:** బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు ఇంటర్‌మీడియేట్, మాస్టర్ డిగ్రీ కోర్సులకు ఏదైనా డిగ్రీ పాసై ఉండాలి.

**వయస్సు:** బ్యాచిలర్ డిగ్రీలో చేరాలనుకునే వారి వయస్సు 25 సంవత్సరాలలోపు ఉండాలి. పీజీ కోర్సులకు వయోపరిమితి లేదు.

**చివరి తేదీ:** ఏప్రిల్ 20 **ఎంట్రెన్స్ తేదీ:** మే 11
**ఫలితాలు:** 2025 జూన్ **మొత్తం సీట్లు:** 2390
**వెబ్‌సైట్:** https://fddiindia.com/

## ఐఐటీల్లో ఏఐ కోర్సులు

ఐఐటీలాంటి సంస్థల్లో చదువుకోలేక పోతున్నాం అని బాధ పడాల్సిన అవసరమే వద్దు. దేశంలోని చాలా ఐఐటీలు పలు విభాగాలకు సంబంధించిన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. ఐఐటీ ఫ్యాకల్టీల ఆధ్వర్యంలో నడిచే ఈ కోర్సుల్లో చేరితే తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో వీటిని పొందవచ్చు. వీటికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంటుంది. తమ రెగ్యులర్ చదువులు కొనసాగిస్తూనే వీటిలో చేరవచ్చు. రాబోయే కాలం అంతా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌దే. దీనిని దృష్టిలో ఉంచుకుని ఐఐటీ మద్రాస్, రూర్కీలు కొన్ని కోర్సులను రూపొందించాయి.

**ఐఐటీ మద్రాస్:** వర్కింగ్ ప్రొఫెషనల్స్‌ను ఉద్దేశించి ఐఐటీ మద్రాస్ 'వెబ్ ఎంటెక్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' కోర్సును ప్రారంభించింది. 2025 మే 31లోపు ఈ కోర్సులో చేరవచ్చు. దీనితోపాటుగా ఏరోస్పేస్ ఇంజనీరింగ్(ఏరో స్పేస్, అమ్యునిషన్ టెక్నాలజీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ), ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ అండ్ సిస్టమ్స్, కమ్యూనికేషన్ సిస్టమ్స్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, మల్టీ మీడియా, మైక్రో ఎలక్ట్రానిక్స్), మెకానికల్ ఇంజనీరింగ్(మెకానికల్ డిజైన్, ఆటోమోటివ్ టెక్నాలజీ), ఈ మొబిలిటీ తదితర కోర్సులు ఉన్నాయి. వివరాల కోసం code.iitm.ac.in/webmtech వెబ్‌సైట్ చూడవచ్చు.

**ఐఐటీ రూర్కీ:** ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ఏఐ, జెన్ ఏఐ, ఎజెంటిక్ ఏఐ, మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్స్'లలో పీజీ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. ఇది పదకొండు నెలల ప్రోగ్రామ్. లైవ్, రికార్డెడ్ సెషన్స్‌లో ఉంటుంది. ఇంజనీరింగ్ విద్యార్థులకు హాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ ఉండేలా డిజైన్ చేశారు. వివరాల కోసం www.iitr.ac.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

## చిత్రజ్యోతి

SINCE 1965

### ఆషికి-3లో శ్రీలీల



పుష్ప-2 సినిమాలో కిస్సిక్ పాటతో అభిమానులను అలరించారు కథానాయిక శ్రీలీల. కొంతకాలంగా ఆమె బాలీవుడ్ అరంగేట్రంపై ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు అధికారిక ప్రకటన వచ్చింది. 'ఆషికీ 3' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికయ్యారు. ఇందులో కార్తిక్ ఆర్యన్ సరసన శ్రీలీల కనిపించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ టీజర్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. అనురాగ్ బసు దర్శకత్వంలో టీ సిరీస్, అనురాగ్ బసు ప్రొడక్షన్స్ బ్యానర్లపై భూషణ్ కుమార్, కృష్ణ కుమార్ నిర్మిస్తున్నారు. కాగా, టీజర్‌లో బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ 'ఆషికి-2'కి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతున్నట్లు అర్థమవుతోంది. 1990లో 'ఆషికి' మొదటి భాగం విడుదలై ఘన విజయం సాధించింది. ఆ తర్వాత 2013లో 'ఆషికి-2' వచ్చింది. ఈ చిత్రం దాదాపు రూ.100 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఇప్పుడు దీనికి సీక్వెల్‌గా వస్తున్న 'ఆషికి-3'లో శ్రీలీల నటిస్తుండటం ఆమె అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కాగా, ఈ చిత్రాన్ని దీపావళికి విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

### ఆదరణ ఆనందాన్నిస్తోంది



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తండేల్'. ఈ చిత్రానికి దక్కుతున్న ఆదరణ పట్ల చిత్రబృందం సంతోషాన్ని వ్యక్తం చేసింది. అక్కినేని అభిమానులకు సూపర్‌హిట్‌చిత్రాన్ని అందిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని ఆదివారం చిత్రబృందం తెలిపింది. నాగచైతన్య, సాయిపల్లవి నటన, చందు మొండేటి దర్శకత్వ ప్రతిభతో ఈ అద్భుతం సాధ్యమైందని పేర్కొంది. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం రూ.వంద కోట్ల క్లబ్‌లో చేరిన విషయం తెలిసిందే.




### అందుకోసమే ఆ చీర దాచుకున్నా

\- సాయిపల్లవి

జాతీయ అవార్డు కోసం ఎదురు చూస్తున్నానని, అవార్డుల ప్రదానోత్సవానికి అమ్మమ్మ ఇచ్చిన చీర కట్టుకుని వెళ్లే సమయం కోసం వేచి చూస్తున్నానని సాయిపల్లవి తెలిపారు. తన అభినయంతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్న ఈ భామ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో జాతీయ అవార్డు కోసం ఎదురుచూడటం వెనక ఉన్న బలమైన కారణాన్ని వివరించారు. 'జాతీయ అవార్డు అందుకోవాలని ఎంతో ఆశగా ఉంది. నాకు 21 ఏళ్ల వయసు ఉన్నప్పుడు మా అమ్మమ్మ ఓ చీర ఇచ్చి, నా పెళ్లిలో కట్టుకోమ్మంది. అప్పటికి నేనింకా సినిమాల్లోకి రాలేదు. కనుక పెళ్లి చేసుకునేటప్పుడు కట్టుకుందామనుకున్నా. ఆ తర్వాత మూడేళ్లకు సినిమాల్లో నటించడం మొదలు పెట్టా. నా తొలి చిత్రం 'ప్రేమమ్'లో నటిస్తున్నప్పుడే ఏదో ఒక రోజు జాతీయ స్థాయి అవార్డును అందుకోగలననే నమ్మకం ఏర్పడింది. ఆ రోజు అమ్మమ్మ ఇచ్చిన చీర కట్టుకుని అవార్డుల ప్రదానోత్సవానికి హాజరవ్వాలని నిర్ణయించుకున్నా. అవార్డును అందుకున్నా... అందుకోకపోయినా చీర కట్టుకోవాలనే ఒత్తిడి ఉండనే ఉంటుంది' అని చెప్పారు సాయిపల్లవి. కాగా, 'గార్గి' చిత్రానికి గాను జాతీయ అవార్డు వస్తుందని సాయిపల్లవి అభిమానులు ఎంతగానో ఆశించారు. చివరకు నిరాశే ఎదురైంది.

### మల్లయుద్ధం నేపథ్యంలో



తమిళ హీరో శివకార్తికేయన్, దర్శకుడు మురుగదాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'ఎస్‌కె23'(వర్కింగ్ టైటిల్). ఈ చిత్రంలో సప్త సాగర దాచె ఎల్లో(సప్త సాగరాలు దాటి) ఫేమ్ రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో చెన్నైలో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో మల్లయుద్ధం నేపథ్యంలో సాగే పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ చిత్రం టైటిల్‌ను నేడు ప్రకటించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

## తొలి తెలుగు మహిళా నిర్మాత
# కృష్ణవేణి అస్తమయం

**తెలుగు వారి ఆరాధ్య నటుడు నందమూరి తారకరామారావును వెండితెరకు పరిచయం చేసిన సినిమా 'మనదేశం'. జాతీయోద్యమ స్ఫూర్తిని కళ్లకు కట్టిన మొట్టమొదటి చిత్రరాజం కూడా ఇదే.! ఈ చిత్ర నిర్మాత, కథానాయికి, తెలుగు సినిమా చరిత్రకు నూరు వసంతాల సజీవ సాక్షి, ప్రతిష్ఠాత్మక రఘుపతి వెంకయ్య అవార్డు గ్రహీత మేకా కృష్ణవేణి ఆదివారం కన్నుమూశారు.**



తెలుగు సినిమా రంగంలో తొలితరం నాయిక, తొలి మహిళా నిర్మాతగా ఖ్యాతి గడించిన మేకా కృష్ణవేణి ఆదివారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. తెలుగు సినిమా చరిత్రలో ఆమెది ఓ ప్రత్యేక అధ్యాయం. తొలితరం నటిగా, గాయనిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా తనదైన ముద్రను వేశారు కృష్ణవేణి. 1924, డిసెంబర్ 24న పశ్చిమ గోదావరి జిల్లా పంగిడి గ్రామంలో కృష్ణవేణి జన్మించారు. బాల్యం నుంచి నాటకాలంటే కృష్ణవేణికి ఆసక్తి ఎక్కువ. బాల తారలతో 'అనసూయ' చిత్రాన్ని రూపొందించాలని భావించిన దర్శకులు సి. పుల్లయ్య రాజమండ్రిలో కృష్ణవేణి నటించిన 'తులాభారం' నాటకాన్ని చూసి టైటిల్ రోల్‌కు ఆమెను ఎంపిక చేశారు. అప్పుడు కృష్ణవేణి వయసు పది సంవత్సరాలు. ఈ సినిమా నిర్మాణం మొత్తం కోల్‌కతాలో జరిగింది. ఆ తర్వాత ఆమె తిరిగి రాజమండ్రి వచ్చి నాటకాలు వేయడం ప్రారంభించారు. అదే సమయంలో ఆమె తండ్రి డాక్టర్ కృష్ణారావు కన్నుమూశారు. దాంతో తల్లి, చిన్నానల ప్రాపకంలో పెరిగింది. 1937లో సి.ఎస్.ఆర్. ఆంజనేయులు ఆమెను ప్రోత్సహిస్తూ చెన్నయ్ తీసుకెళ్లారు. ఆ సమయంలో ఆమె 'తుకారం' సినిమాలో నటించారు. అలా కొన్ని చిత్రాలలో బాల నటిగా రాణించారు.

### 'కచదేవయాని'తో హీరోయిన్‌గా

కృష్ణవేణి హీరోయిన్ గా నటించిన తొలి చిత్రం 'కచదేవయాని' 1938లో వచ్చింది. ఆ తర్వాత ఆమె దాదాపు ఇరవై సినిమాలలో నటించారు. 1939లో 'మహానంద' చిత్రంలో నటిస్తుండగా ప్రసిద్ధ దర్శక నిర్మాత మీర్జాపురం రాజా తో పరిచయం అయ్యింది. అది ప్రేమగా మారి 1940లో వారు విజయవాడలో వివాహం చేసుకున్నారు. వివాహానంతరం భర్త కోరిక మేరకు కృష్ణవేణి బయటి చిత్రాలలో నటించలేదు. సొంత చిత్రాలలోనే నటించారు.

అలానే తమ శోభనాచల స్టూడియోస్ వ్యవహారాలను పర్యవేక్షించారు. అదే బ్యానర్ లో పలు చిత్రాలను నిర్మించారు. ఈ బ్యానర్ లో వచ్చిన తొలి సాంఘీక చిత్రం 'జీవనజ్యోతి' ద్వారానే చదలవాడ నారాయణరావు హీరోగా పరిచయం అయ్యారు. నటిగా కెరీర్ ప్రారంభించినప్పటి నుంచీ కృష్ణవేణి తన పాటలను తానే పాడుకున్నారు. విశేషం ఏమంటే ఆమె 'కీలుగుర్రం' సినిమాలో అంజలీదేవికి ప్లేబ్యాక్ పాడారు. త్రిపురనేని గోపీచంద్ 'లక్ష్మమ్మ' చిత్రాన్ని మొదట మాలతీతో మొదలు పెట్టినా ఆ ప్రాజెక్ట్ ఆగిపోయింది. దానిని శోభనాచల స్టూడియోస్ టేకోవర్ చేసింది. దాంతో అందులో కృష్ణవేణి నాయికగా నటించారు. ఈ సినిమాకు పోటీగా అంజలీదేవి నాయికగా 'శ్రీ లక్ష్మమ్మ కథ' మొదలైంది. రెండూ పోటాపోటీగా జనం ముందుకు వచ్చాయి. అయితే కృష్ణవేణి నటించిన 'లక్ష్మమ్మ' చిత్రానికే జనాదరణ దక్కింది. ఇక 1947లో వచ్చిన 'గొల్లభామ' నటిగా కృష్ణవేణికి అఖండ కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిపెట్టింది. కేవలం కథానాయిక పాత్రలే కాకుండా భిన్నమైన పాత్రలను చేయాలని తపించారు. ఆమె 'తిరుగుబాటు' సినిమాలో వ్యాంప్ పాత్రను పోషించారు.


### 'మనదేశం'తో ఎన్టీఆర్‌కు తొలి అవకాశం

1942లో కృష్ణవేణి, మీర్జాపురం రాజా దంపతులకు అనూరాధాదేవి జన్మించారు. ఆమె పేరుతో ఎం.ఆర్.ఎ. అనే బ్యానర్ ను స్థాపించి, ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వంలో కృష్ణవేణి 'మనదేశం' చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ద్వారానే ఎన్టీఆర్ చిత్రసీమకు పరిచయం అయ్యారు. బెంగాలీ భాషలో వచ్చిన 'విప్రదాసు' నవల ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఘంటసాల, రమేశ్ నాయుడుని సంగీత దర్శకులుగా పరిచయం చేశారు, పి. లీల, జిక్కీ లను గాయనీ మణులుగా, ఎర్రా అప్పారావును దర్శకుడిగా జనం ముందుకు తీసుకొచ్చిందీ కృష్ణవేణే! తొలితరం నటీమణులలో అత్యధిక పారితోషికం తీసుకున్న వ్యక్తి కూడా ఆమే. అప్పట్లోనే రూ. 45 వేల పారితోషికం తీసుకున్నారామె. ఆమెతో సరిసమానంగా పారితోషికం తీసుకున్న మరో నటీమణి భానుమతి. నటిగా కృష్ణవేణి చివరగా 'సాహసం' సినిమా చేశారు. అలానే నిర్మాతగా ఆమె చివరి చిత్రం 1957లో వచ్చిన 'దాంపత్యం'. ఇందులో హీరోగా కోన ప్రభాకరరావు నటించారు. ఆమె కుమార్తె అనూరాధాదేవి తల్లి అడుగుజాడల్లో నడుస్తూ పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. తెలుగు సినిమా రంగానికి కృష్ణవేణి అందించిన సేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో రఘుపతి వెంకయ్య నాయుడు అవార్డుతో సత్కరించింది. ఇటీవల విజయవాడలో జరిగిన 'మనదేశం' వజ్రోత్సవ వేడుకల్లోనూ కృష్ణవేణి పాల్గొన్నారు. చక్రాల కుర్చీలోనే విజయవాడకు వెళ్ళిన ఆమెను ఆ వేదికపై భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సత్కరించారు. కృష్ణవేణి మరణంతో తెలుగు సినిమా రంగం తొలితరం ధ్రువతార రాలిపోయినట్టయ్యింది. ఆమె పార్థివ దేహానికి పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు నివాళులర్పించారు. ఆదివారం మహా ప్రస్థానంలో కృష్ణవేణి భౌతిక కాయానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.



"నటీమణి, సినీ నిర్మాత కృష్ణవేణి గారి మరణం నన్ను బాధించింది. 'మనదేశం' చిత్రంతో ఎన్టీఆర్‌ను చిత్రరంగానికి పరిచయం చేసి కళారంగానికి వారు చేసిన సేవ మరువలేనిది"

\- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



"ఎన్టీఆర్ నట జీవితానికి తొలి అవకాశమిచ్చిన కృష్ణవేణి గారి మృతి బాధాకరం. నటి, నిర్మాత, స్టూడియో అధినేతగా ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించారు. ఆమె మృతి వ్యక్తిగతంగా మాకు తీరని లోటు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను"

\- నందమూరి బాలకృష్ణ



తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తొలి మహిళా నిర్మాతగా గుర్తింపు పొందిన కృష్ణవేణి తుదిశ్వాస విడిచారని తెలిసి చింతిస్తున్నాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

\- ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

# గుజరాత్ ఖాతా తెరిచింది

అరు వికెట్లతో యూపీపై గెలుపు

**వడోదర:** తొలి మ్యాచ్‌లో 200 పరుగులు చేసీ భంగపడిన గుజరాత్ జెయింట్స్.రెండో పోరులో ఆల్‌రౌండ్ షోతో విజయం అందుకుంది. డబ్ల్యూపీఎల్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో జెయింట్స్ ఆరు వికెట్లతో యూపీ వారియర్స్‌ని ఓడించింది. తద్వారా పాయింట్ల ఖాతా తెరిచింది. తొలుత యూపీ 20 ఓవర్లలో 143/9 స్కోరు సాధించింది. దీప్తీశర్మ (27 బంతుల్లో 6 ఫోర్లతో 39), ఉమా ఛెత్రి (24) రాణించగా.. చివర్లో అలనా కింగ్ (14 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 19 నాటౌట్) బ్యాట్ ఝళిపించింది. ప్రియా మిశ్రా 3, డాటిన్, గార్డ్‌నర్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో గుజరాత్ 18 ఓవర్లలో 144/4 స్కోరు చేసి నెగ్గింది. ఆష్లీ గార్డ్‌నర్ (32 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 52) మెరుపు హాఫ్ సెంచరీ చేసింది. హర్లీన్ డియోల్ (34 నాటౌట్), డాటిన్ (33 నాటౌట్) సత్తా చాటారు. ఎకిల్‌స్టోన్ రెండు వికెట్లు తీసింది. గార్డ్‌నర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. వారియర్స్‌కిది తొలి మ్యాచ్.

**డబ్ల్యూపీఎల్‌లో నేడు**
ఢిల్లీ × బెంగళూరు
రాత్రి 7.30 నుంచి

**సంక్షిప్తస్కోర్లు**

**యూపీ వారియర్స్:** 20 ఓవర్లలో 143/9 (దీప్తీ శర్మ 39, ఉమా ఛెత్రి 24, అలనా కింగ్ 19 నాటౌట్, శ్వేత 16, కిరణ్ 15, ప్రియా మిశ్రా 3/25, డాటిన్ 2/34, గార్డ్‌నర్ 2/39).

**గుజరాత్ జెయింట్స్:** 18 ఓవర్లలో 144/4 (గార్డ్‌నర్ 52, హర్లీన్ 34 నాటౌట్, డాటిన్ 33 నాటౌట్, వోల్వార్ట్ 22, ఎకిల్‌స్టోన్ 2/16).

## అబ్బాయిలకు గెలుపు.. అమ్మాయిలకు ఓటమి

**భువనేశ్వర్:** ఎఫ్ఐహెచ్ హాకీ ప్రొ లీగ్‌లో ఆదివారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. పురుషుల జట్టు గెలుపొందగా, మహిళల బృందం నిరాశపరిచింది. హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత పురుషుల బృందం 2-0తో స్పెయిన్‌ను చిత్తుచేసింది. జట్టులో రెండు గోల్స్‌ను మన్‌దీప్ (32వ), దిల్‌ప్రీత్ (39) సాధించారు. భారత అమ్మాయిల జట్టు షూటౌట్‌లో 1-2తో ఇంగ్లండ్ చేతిలో ఓటమిపాలైంది. నిర్ణీత సమయానికి ఇరు జట్లు 2-2తో సమంగా నిలిచాయి. దీంతో అనివార్యమైన షూటౌట్‌లో ఇంగ్లండ్ ఫలితం రాబట్టింది.

# ఉప్పల్‌లో 9 వైజాగ్‌లో 2




- 12 డబుల్ హెడర్‌లు
- మార్చి 22న ప్రారంభం
- మే 25న ఈడెన్‌లో ఫైనల్

**ఐపీఎల్ పూర్తి షెడ్యూల్ విడుదల**

**న్యూఢిల్లీ:** మండు వేసవిలో క్రికెట్ ప్రేమికులను ఉర్రూతలూగించే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పూర్తి షెడ్యూల్‌ను బీసీసీఐ వెల్లడించింది. ఈ లీగ్ 18వ సీజన్ మార్చి 22 నుంచి ఆరంభమై మే 25న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. ఇందులో భాగంగా 65 రోజుల పాటు దేశంలోని 13 నగరాల్లో మొత్తంగా 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్- రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడనున్నాయి. ఆరంభ, ఫైనల్ మ్యాచ్‌లకు కూడా ఈడెన్ గార్డెన్స్ వేదిక కానుంది. ఇక షెడ్యూల్‌లో 12 డబుల్ హెడర్ (ఒకే రోజు రెండు) మ్యాచ్‌లున్నాయి. ఎప్పటిలాగే వైజాగ్‌ను ఢిల్లీ క్యాపిటల్స్, ధర్మశాలను పంజాబ్ కింగ్స్, గువాహటిని రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలు తమ రెండో హోమ్ గ్రౌండ్‌గా ఎంచుకున్నాయి. దీంతో ఆయా వేదికల్లో రెండేసి మ్యాచ్‌లు జరుగనుండగా, ధర్మశాల మాత్రం మూడు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుంది. వైజాగ్‌లో మార్చి 24న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, 30న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఢిల్లీ జట్టు తలపడుతుంది.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ షెడ్యూల్**

| తేదీ | ప్రత్యర్థి | వేదిక | సమయం |
|---|---|---|---|
| మార్చి 23 | రాజస్థాన్ | హైదరాబాద్ | మ.3.30 |
| మార్చి 27 | లఖ్‌నవూ | హైదరాబాద్ | రా.7.30 |
| మార్చి 30 | ఢిల్లీ | విశాఖపట్నం | మ.3.30 |
| ఏప్రిల్ 03 | కోల్‌కతా | కోల్‌కతా | రా.7.30 |
| ఏప్రిల్ 06 | గుజరాత్ | హైదరాబాద్ | రా.7.30 |
| ఏప్రిల్ 12 | పంజాబ్ | హైదరాబాద్ | రా.7.30 |
| ఏప్రిల్ 17 | ముంబై | ముంబై | రా.7.30 |
| ఏప్రిల్ 23 | ముంబై | హైదరాబాద్ | రా.7.30 |
| ఏప్రిల్ 25 | చెన్నై | చెన్నై | రా.7.30 |
| మే 02 | గుజరాత్ | అహ్మదాబాద్ | రా.7.30 |
| మే 05 | ఢిల్లీ | హైదరాబాద్ | రా.7.30 |
| మే 10 | కోల్‌కతా | హైదరాబాద్ | రా.7.30 |
| మే 13 | బెంగళూరు | బెంగళూరు | రా.7.30 |
| మే 18 | లఖ్‌నవూ | లఖ్‌నవూ | రా.7.30 |

**ప్లేఆఫ్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం**

గతేడాది ఉప్పల్ మైదానం ఏడు లీగ్ మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వగా.. ఈసారి ఆ సంఖ్య పెరిగింది. ఎందుకంటే ప్లేఆఫ్స్‌లో భాగంగా క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచ్‌లు ఇక్కడ జరగనుండడమే. దీంతో హైదరాబాద్‌లో జరిగే మొత్తం మ్యాచ్‌ల సంఖ్య తొమ్మిదికి పెరిగింది. ఇక మార్చి 23న ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ జట్టు రాజస్థాన్ రాయల్స్‌తో తమ ఆరంభ మ్యాచ్‌ను ఆడనుంది. అలాగే క్వాలిఫయర్ 2, ఫైనల్ మ్యాచ్‌లకు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదిక కానుంది.

# జోరుగా భారత్ ప్రాక్టీస్



**దుబాయ్:** చాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టు శనివారమే దుబాయ్‌లో అడుగుపెట్టింది. ఈనెల 20న బంగ్లాదేశ్‌తో తొలి మ్యాచ్ ఆడనుండగా, దీనికి ముందు జట్టుకు ఎలాంటి వామప్ మ్యాచ్ లేవు. అందుకే విశ్రాంతి తీసుకోకుండా ఆదివారం మధ్యాహ్నం నుంచే స్థానిక ఐసీసీ ఎకాడమీలో ప్రాక్టీస్ ఆరంభించింది. బోర్డు కొత్త నిబంధనల ప్రకారం జట్టులో ఎవరికీ ఆప్షనల్ ప్రాక్టీస్ అంటూ లేకపోవడంతో కెప్టెన్ స్థాయి నుంచి జూనియర్ ప్లేయర్ వరకు అంతా విధిగా నెట్స్‌లో పాల్గొన్నారు. ఇటీవలే పునరాగమనం చేసిన వెటరన్ పేసర్ షమి.. కెప్టెన్ రోహిత్, విరాట్, గిల్‌లకు బౌలింగ్ చేశాడు. అంతకుముందు తను బౌలింగ్ కోచ్ మోర్కెల్‌తో సంభాషించాడు. ఈనేపథ్యంలో తన లెంగ్త్‌ను సరిచూసుకోవడం కనిపించింది.



పంత్

**కోలుకున్న పంత్**

వికెట్ కీపర్ రిషబ్ పంత్‌కు నెట్స్‌లో స్వల్ప గాయమైంది. హార్దిక్ ఆడిన షాట్ నేరుగా పంత్ మోకాలికి తాకింది. దీంతో తను బాధతో విలవిల్లాడగా ఫిజియో కమలేష్ చికిత్స చేశాడు. అటు పాండ్యా కూడా పరుగున వచ్చి పంత్‌ను పరిశీలించాడు. అయితే పంత్ గాయం సీరియస్ కాకపోవడం ఊరటనిచ్చింది. ఫిజియో చికిత్స తర్వాత తను ప్యాడ్స్ ధరించి బ్యాటింగ్ ప్రాక్టీస్ సాగించాడు.

**భారత్ మ్యాచ్‌లకు అదనపు టిక్కెట్లు**

చాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆడే మ్యాచ్‌లకు ఫుల్ డిమాండ్ నెలకొంది. దీంతో ఐసీసీ అదనపు టిక్కెట్లను కేటాయించింది. ఇందులో పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్ టిక్కెట్లయితే బుధవారం గంటన్నరలోనే అమ్ముడవడం విశేషం. కివీస్‌తో పాటు తొలి సెమీస్ మ్యాచ్‌ల టిక్కెట్ల అమ్మకాలు మాత్రం నెమ్మదిగా సాగుతున్నాయి.

## ముంబై × విదర్భ



ముంబై కెప్టెన్ రహానె



విదర్భ సారథి అక్షయ్

గుజరాత్‌తో కేరళ ఢీ | నేటినుంచే రంజీ సెమీస్

**నాగ్‌పూర్:** డిఫెండింగ్ చాంపియన్ ముంబై.. విదర్భ జట్ల మధ్య రంజీట్రోఫీ సెమీఫైనల్ సోమవారం ఇక్కడ ప్రారంభం కానుంది. యశస్వీ జైస్వాల్ గాయంతో మ్యాచ్ నుంచి వైదొలగినా ముంబై పటిష్ఠంగానే కనిపిస్తోంది. కెప్టెన్ రహానె, శివమ్ దూబే, శార్దూల్ ఠాకూర్ వంటి స్టార్లతో ఆ జట్టు కళకళలాడుతోంది. అయితే ఈ సీజన్‌లో ముంబై టాపార్డర్ కాకుండా లోయరార్డర్ బ్యాటర్లు భారీ స్కోర్లతో జట్టును ఆదుకుంటున్నారు. ఇక సెమీస్‌లో టాపార్డర్ కూడా రాణిస్తే ముంబైకి తిరుగుండదు. మరోవైపు కరుణ్ నాయర్, కెప్టెన్ అక్షయ్‌తో కూడిన విదర్భ ఫ్రంట్‌లైన్ బ్యాటింగ్ విభాగం ఈ సీజన్‌లో పరుగుల వరద పారిస్తోంది. ఈనేపథ్యంలో సెమీస్ పోరు రసవత్తరంగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది. అహ్మదాబాద్‌లో జరిగే మరో సెమీపైనల్లో గుజరాత్..కేరళతో తలపడనుంది.

## కుర్రాళ్లూ.. సైకిల్ వాడండి

**క్రీడామంత్రి సూచన**

**ముంబై:** ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం సాధ్యమైనంత వరకు సైకిళ్లపై ప్రయాణించడాన్ని అలవాటు చేసుకోవాలని కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవ్య యువతకు సూచించారు. ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా ఆదివారమిక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. 'ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా యువతకు చెబుతున్నా. వీలైనంత వరకు సైకిళ్లపై ప్రయాణించండి. దీనివల్ల మీరు ఆరోగ్యంగా ఉండడమే గాకుండా పర్యావరణానికి మేలు చేసినవారవుతారు' అని మాండవ్య తెలిపారు.

## రెండో వన్డేలో ఐర్లాండ్ గెలుపు

**హరారే:** ఆతిథ్య జింబాబ్వేతో తొలి వన్డేలో ఓడిన ఐర్లాండ్ రెండో మ్యాచ్‌లో నెగ్గి ప్రతీకారం తీర్చుకుంది. ఆదివారం జరిగిన పోరులో కాంఫర్ (3/13, 63 పరుగులు) ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టడంతో ఐర్లాండ్ ఆరు వికెట్లతో గెలిచింది. మొదట జింబాబ్వే 49 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. వెస్లీ మెదెవెరె (61), సికిందర్ రజా (58) రాణించారు. ఛేదనలో స్టిర్లింగ్ (89) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు తోడు కాంఫర్ అర్ధ శతకంతో సత్తా చాటడంతో ఐర్లాండ్ 48.4 ఓవర్లలోనే 249/4 స్కోరు చేసి గెలిచింది.

# గాయాల జాబితా చాంతాడంత!



**చాంపియన్స్ ట్రోఫీ 2 రోజుల్లో..**



స్టార్క్ కమిన్స్

అన్ని జట్ల నుంచి స్టార్ క్రికెటర్లు బరిలో ఉంటేనే మెగా టోర్నమెంట్లు మజా పంచుతాయి. మ్యాచ్‌లు పోటాపోటీగా సాగి ఫ్యాన్స్‌లో ఉద్వేగం, ఉత్సాహం నింపుతాయి. అటు నిర్వాహకులకు ఇటు టోర్నమెంట్ స్పాన్సర్లకు కావాల్సింది అదే కదా! కానీ బుధవారం నుంచి జరిగే ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నమెంట్‌లో పలు జట్లను..అదీ స్టార్ ఆటగాళ్ల గాయాల బెడద పీడిస్తోంది. తాజాగా టీమిండియా పేసర్ బుమ్రా గాయంతో టోర్నీకి దూరమయ్యాడు. ఈనేపథ్యంలో చాంపియన్స్ ట్రోఫీనుంచి గాయాలతో వైదొలగిన క్రికెటర్లెవరో చూద్దాం..

**కమిన్స్, స్టార్క్:** భారత్‌తో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ సందర్భంగా గాయపడిన ఆస్ట్రేలియా టెస్ట్, వన్డే జట్టు కెప్టెన్ కమిన్స్ చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. ఈనేపథ్యంలో అతడు టోర్నీకి దూరం కావడం కంగారూల అవకాశాలను బాగా దెబ్బ తీయవచ్చు. కమిన్స్‌తోపాటు పేసర్ హాజెల్‌వుడ్, ఆల్‌రౌండ్ మిచెల్ మార్ష్ సేవలనూ ఆసీస్ కోల్పోయింది. తుంటి గాయంతో 34 ఏళ్ల హాజెల్‌వుడ్ ఈ టోర్నీకి దూరమయ్యాడు. స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ సేవలనూ ఆసీస్ కోల్పోనుంది. అయితే స్టార్క్ గాయంతో కాకుండా వ్యక్తిగత కారణాలతో టోర్నీలో ఆడడంలేదని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది.

**సయీమ్ అయూబ్:** పాకిస్థాన్ బ్యాటర్ సయీమ్ అయూబ్ పాదం గాయంతో దూరమయ్యాడు. గత నెలలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ సందర్భంగా అతడికి ఆ గాయమైంది.

**జాకబ్ బెథెల్:** 21 ఏళ్ల ఇంగ్లండ్ బ్యాటింగ్ సంచలనం బెథెల్ తొడ కండర గాయంతో తప్పుకొన్నాడు. భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌లో రెండో మ్యాచ్‌లో అతడు గాయపడ్డాడు.

**నోకియా:** కీలకమైన టోర్నీల సందర్భంగా దక్షిణాఫ్రికా పేసర్ నోకియాను గాయాల రూపంలో దురదృష్టం వెన్నాడుతుంటుంది. ఈసారి వెన్ను గాయంతో అతడు వైదొలగాల్సి వచ్చింది.

**అల్లా గజన్‌ఫర్:** 18 ఏళ్ల అఫ్ఘానిస్థాన్ స్పిన్నర్ గజన్‌ఫర్ కూడా వెన్ను గాయంతో తప్పుకోవాల్సి వచ్చింది. కేవలం 11 వన్డేలే ఆడిన అతడు 21 వికెట్లు పడగొట్టడం విశేషం.

**వీరూ అనుమానమే**

**ఇంకా..** న్యూజిలాండ్‌కు చెందిన రచిన్ రవీంద్ర ముక్కోణపు వన్డే సిరీస్‌లో పాకిస్థాన్‌తో తొలి మ్యాచ్‌లో ఫీల్డింగ్ సందర్భంగా అనూహ్యంగా గాయపడ్డాడు. క్యాచ్ అందుకొనే క్రమంలో ఫ్లడ్‌లైట్ల కాంతి నేరుగా కళ్లలో పడడంతో బంతి గమనాన్ని కచ్చితంగా అంచనా వేయలేకపోయాడు. అది రచిన్ నుదుటిపై తగలడంతో గాయపడ్డాడు. ఇక పేసర్ ఫెర్గూసన్ కండర గాయంతో బాధపడుతున్నాడు. అలాగే గాయాలపాలైన ఇంగ్లండ్ కీపర్, బ్యాటర్ జేమీ స్మిత్ కూడా చాంపియన్స్ ట్రోఫీలో ఆడడం అనుమానంగా ఉంది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

---

**బిజినెస్**

# ఆల్ ఇన్ వన్ బీమా పాలసీ!

**బీమా విస్తార్ పేరుతో ఏప్రిల్‌లో విడుదల**




**న్యూఢిల్లీ:** ఇకపై జీవిత, ఆరోగ్య, ప్రమాద, స్థిరాస్తి బీమా పథకాలను విడివిడిగా కొనుగోలు చేయాల్సిన బెడద తప్పనుంది. వీటన్నింటికీ కవరేజీ కల్పించేందుకు ఆల్ ఇన్ వన్ ఇన్సూరెన్స్ పాలసీ 'బీమా విస్తార్' త్వరలో అందుబాటులోకి రాబోతోంది. ఈ పథకం తుది విధివిధానాలపై భారత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ), ఇన్సూరెన్స్ ఇండస్ట్రీ సారథులు ఈ నెల 13-14 తేదీల్లో జరిగిన 9వ విడత బీమా మంథన్ కార్యక్రమంలో ఓ అంగీకారానికి వచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో బీమా విస్తార్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టే అవకాశం ఉందని ఈ సందర్భంగా ఐఆర్‌డీఏఐ తెలిపింది. దేశంలో అందరికీ బీమా కవరేజీని కల్పించడమే బీమా విస్తార్ ముఖ్యోద్దేశం. అందుకోసం ఈ పథకానికి గ్రామీణ స్థాయి వరకు ప్రాచుర్యం కల్పించాలని ఐఆర్‌డీఏఐ భావిస్తోంది.

**ఏప్రిల్‌లో బీమా వాహక్ పోర్టల్ సైతం షురూ:** దేశవ్యాప్తంగా మహిళలను బీమా ఏజెంట్లుగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన కార్యక్రమమే బీమా వాహక్. వీరి కోసం అభివృద్ధి చేస్తున్న వెబ్ పోర్టల్ దాదాపు పూర్తి కావచ్చిందని, ఈ ఏప్రిల్ నుంచి అందుబాటులోకి రానుందని ఐఆర్‌డీఏఐ వెల్లడించింది.

# రూ.లక్ష కోట్లు వెనక్కి

ఈ ఏడాది ఇప్పటికే ఎఫ్‌పీఐలు వెనక్కి తీసుకున్న మొత్తం ఇది

**గడిచిన రెండు వారాల్లో రూ.21,272 కోట్ల ఉపసంహరణ.. ట్రంప్ టారిఫ్‌ల వడ్డనే కారణం**

**న్యూఢిల్లీ:** భారత స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) పెట్టుబడులు పెద్ద ఎత్తున తరలిపోతున్నాయి. ఈ నెలలో గడిచిన రెండు వారాల్లో ఎఫ్‌పీఐలు నికరంగా రూ.21,272 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. గత నెలలో ఏకంగా రూ.78,027 కోట్లు తరలిపోయాయి. అంటే, ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐలు దాదాపు రూ.లక్ష కోట్ల (రూ.99,299 కోట్లు) పెట్టుబడులను తరలించేశారు. అమెరికా సుంకాల వడ్డింపులతో అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితి పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. మరోవైపు డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు నిరాశపరచడం, రూపాయి క్షీణత మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీసింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక డాలర్ మరింత బలపడింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్ ఇండెక్స్ కాస్త తగ్గుముఖం పడితే ఎఫ్‌పీఐలు మళ్లీ పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. అయితే బాండ్ మార్కెట్లో మాత్రం ఎఫ్‌పీఐలు తమ పెట్టుబడులను కొనసాగించారు. గత రెండు వారాల్లో దాదాపు రూ.1,500 కోట్లకు పైగా ఇన్వెస్ట్ చేశారు.

## అరబిందో చైనా ప్లాంట్ నుంచి యూరప్‌కు ఉత్పత్తుల సరఫరా

**ఏప్రిల్ నుంచి ప్రారంభం**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా చైనాలోని తన ప్లాంట్ నుంచి యూరప్‌కు ఉత్పత్తుల సరఫరాను ఏప్రిల్ నుంచి ప్రారంభించనుంది. అరబిందో ఫార్మా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) సంతానమ్ సుబ్రమణియన్ ఈ విషయాన్ని తెలిపారు. 2024 నవంబరు చివరి వారంలో కంపెనీ చైనా ప్లాంట్‌లో కార్యకలాపాలను ప్రారంభించింది. ఉత్పత్తిని క్రమంగా పెంచుతోంది. ఈ యూనిట్‌లో తయారు చేసే ఉత్పత్తులను ప్రధానంగా యూరప్ మార్కెట్‌కు సరఫరా చేయనుంది. ఇందుకు యూరోపియన్ నియంత్రణ మండలి నుంచి అవసరమైన అనుమతులు కూడా లభించాయని సుబ్రమణియన్ వెల్లడించారు. ఈ ప్లాంట్ నుంచి అమెరికా మార్కెట్‌కు సరఫరా చేయనున్నట్లు, అందుకు యూఎస్ఎఫ్‌డీఏ నుంచి అవసరమైన అనుమతులను కూడా పొందనున్నట్లు ఆయన చెప్పారు. వచ్చే 2-3 ఏళ్లలో కంపెనీ ఆదాయంలో గణనీయ వాటా చైనా ప్లాంట్ నుంచి సమకూరవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## బజాజ్ కన్స్యూమర్ చేతికి విశాల్ పర్సనల్ కేర్

**డీల్ విలువ రూ.120 కోట్లు**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన ఎఫ్ఎంసీజీ సంస్థ విశాల్ పర్సనల్ కేర్‌లో 100 శాతం వాటాలను రూ.120 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు బజాజ్ కన్స్యూమర్ కేర్ ప్రకటించింది. రెండు విడతల్లో ఈ వాటాలను కొనుగోలు చేయనున్నట్లు పేర్కొంది. తొలుత 49 శాతం వాటా, అనంతరం మిగిలిన 51 శాతం వాటాను దక్కించుకోనున్నట్లు తెలిపింది. 1991లో కార్యకలాపాలు ప్రారంభించిన విశాల్ పర్సనల్ కేర్‌కు ఉన్న విస్తృత డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ద్వారా దక్షిణాది మార్కెట్లో తమ ఉత్పత్తులను మరింత చేరువ చేసే అవకాశం లభించనుందని బజాజ్ కన్స్యూమర్ కేర్ ఎండీ జైదీప్ నంది తెలిపారు. అలాగే, విశాల్ పర్సనల్ కేర్‌కు చెందిన హెయిర్ అండ్ స్కిన్ కేర్ ఉత్పత్తుల బ్రాండ్ 'బంజారాస్'ను ఉత్తరాది మార్కెట్‌కు పరిచయం చేయనున్నట్లు ఆయన చెప్పారు. కాగా, బజాజ్ కన్స్యూమర్ కేర్ ఫ్లాగ్‌షిప్ బ్రాండ్‌గా బజాజ్ ఆల్మండ్ డ్రాప్స్ ఉంది. అలాగే ఫేషియల్ కిట్స్, హెర్బల్ పౌడర్స్, అలోవేరా జెల్స్, షాంపూలు, హెయిర్‌కేర్ పౌడర్స్ సహా పలు రకాల ఉత్పత్తులను విక్రయిస్తోంది.

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)



| 17వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 440 | విజయవాడ | 450 |
| వరంగల్ | 442 | గోదావరి | 455 |
| చిత్తూరు | 493 | విశాఖపట్నం | 465 |
| | | డజను గుడ్లు రూ. | 72 |

**ఫామ్‌గేట్ ధర** — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 80 | విజయవాడ | 91 |
| వరంగల్ | 80 | గుంటూరు | 90 |
| కరీంనగర్ | 80 | ఒంగోలు | 90 |
| మహబూబ్‌నగర్ | 80 | చిత్తూరు | 75 |
| కర్నూలు | 80 | నెల్లూరు | 80 |
| విశాఖపట్నం | 83 | | |
| గోదావరి | 91 | అనంతపురం | 80 |

## 23,300 ఎగువన బుల్లిష్

(ఫిబ్రవరి 17-21 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 23,569-22,775 పాయింట్ల మధ్యన కదలాడి చివరకు 630 పాయింట్ల నష్టంతో 22,929 పాయింట్ల వద్ద క్లోజైంది. ఈ వారం 23,300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

**బ్రేకౌట్ స్థాయి:** 23,250 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 22,600
**నిరోధ స్థాయిలు :** 23,150, 23,250, 23,350 (23,050 పైన బుల్లిష్)
**మద్దతు స్థాయిలు:** 22,700, 22,600, 22,500 (22,800 దిగువన బేరిష్)

అమర్‌నాథ్ శాస్త్రి

## మహీంద్రా మనులైఫ్ వాల్యూ ఫండ్

మహీంద్రా మనులైఫ్ మ్యూచువల్ ఫండ్.. వాల్యూ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఫండమెంటల్స్ పటిష్ఠంగా ఉండి ఇంకా అండర్‌వాల్యూలో ఉన్న కంపెనీలను గుర్తించి ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత విభాగాల్లోని వివిధ పోర్టుఫోలియోల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా దీర్ఘకాలంలో మెరుగైన రిటర్నులు అందించటమే ఈ ఫండ్ లక్ష్యం. ఈ ఫండ్‌కు నిఫ్టీ 500 వాల్యూ 50 ఇండెక్స్ బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ముగింపు తేదీ ఫిబ్రవరి 21.

# పుల్‌బ్యాక్ ర్యాలీకి చాన్స్

**దే**శీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశం ఉంది. గత వారం వరుసగా పతనమవటంతో ఈసారి పుల్‌బ్యాక్ లేదా కౌంటర్ ర్యాలీకి అవకాశాలు కనిపిస్తున్నాయి. డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ ఆదేశాలపై స్పష్టత వస్తే సూచీలు నిలకడగా సాగే వీలుంది. నిఫ్టీ మరోసారి కీలకమైన 22,900 స్థాయికి చేరుకుంది. సూచీకి ఇక్కడ బలమైన మద్దతు ఉంది. గత వారం అన్ని రంగాల షేర్లు పతనబాటలో సాగాయి. ప్రస్తుతం బ్యాంక్, ఫైనాన్స్, ఆటో, వినియోగ రంగాల షేర్లు కొంత పటిష్ఠతను సూచిస్తున్నాయి. అయితే సూచీలు స్థిరపడేంత వరకు మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది.

**స్టాక్ రికమండేషన్స్**

**హెచ్‌సీఎల్ టెక్:** డిసెంబరు త్రైమాసిక ఫలితాల తర్వాత ఈ కౌంటర్‌లో కరెక్షన్ జరిగింది. జీవితకాల గరిష్ఠం నుంచి 18 శాతం వరకు పతనమయ్యాయి. ప్రస్తుతం కీలకమైన రూ.1,700 స్థాయిలో బేస్ ఏర్పడుతోంది. ఇప్పటికే రిలేటివ్ స్ట్రెంత్ బలంగానే ఉంది. గత శుక్రవారం రూ1,711 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,700/1,680 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,770/1,820 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,650 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**ఎస్‌బీఐ కార్డ్:** నష్టాల మార్కెట్‌లోనూ ఈ షేరు జోరును ప్రదర్శిస్తోంది. జనవరి నుంచి అప్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. పైగా సెప్టెంబరు నాటి గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. రిలేటివ్ స్ట్రెంత్, డెలివరీ, వాల్యూమ్ సైతం పెరుగుతోంది. గత శుక్రవారం రూ.859 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.825/830 శ్రేణిలో ప్రవేశించి రూ.875/880 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.800 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**కార్‌ట్రేడ్:** మెరుగైన ఫలితాలు ప్రకటించటం, ఈపీఎస్ క్రమంగా పెరుగుతుండటంతో ఈ షేరుపై ఇన్వెస్టర్ల ఆసక్తి పెరిగింది. పైగా ఐపీఓ నాటి స్థాయిని బ్రేక్ చేయటం, రిలేటివ్ స్ట్రెంత్ పెరగటం శుభపరిణామాలు. గత శుక్రవారం రూ.1,567 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,550/1,530 శ్రేణిలో ప్రవేశించి రూ.1,665 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,500 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**గాడ్‌ఫ్రే ఫిలిప్స్:** జీవితకాల గరిష్ఠం నుంచి 50 శాతం వరకు పతనమైన ఈ షేరు మళ్లీ పుంజుకుంటోంది. రూ.4,200 స్థాయి నుంచి టర్న్ అరౌండ్ అయ్యాయి. ఈపీఎస్, సేల్స్ బాగా పెరిగాయి. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.5,999 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.5,850 వద్ద పొజిషన్ తీసుకుని రూ.6,250/6,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.5,800 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**హిందాల్కో:** జీవితకాల గరిష్ఠం తర్వాత ఈ షేరు 27 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. ప్రస్తుతం ఈ షేరు కీలకమైన మద్దతు స్థాయి వద్ద టర్న్ అరౌండ్ అయ్యింది. ప్రైస్ యాక్షన్ టైట్‌గా జరుగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.606 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.590/580 స్థాయిలో ప్రవేశించి రూ.660/675 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.550 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

## 23,100 ఎగువన నిలదొక్కుకుంటేనే..

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పూర్తిగా బేరిష్ ట్రెండ్‌లో సాగుతూ 630 పాయింట్ల నష్టంతో 22,930 వద్ద క్లోజైంది. టెక్నికల్‌గా చూస్తే నిఫ్టీ కీలక స్థాయి అయిన 22,800కి స్వల్ప ఎగువన ఉంది. సానుకూలత కోసం మార్కెట్ ఇక్కడ కచ్చితంగా రికవరీ కావాల్సి ఉంటుంది. పాజిటివ్ ఇండికేషన్ కోసం ఇక్కడ కొద్ది రోజులు నిలదొక్కుకోవాల్సి ఉంటుంది.

**బుల్లిష్ స్థాయిలు:** పాజిటివ్ ట్రెండ్ కోసం తదుపరి నిరోధ స్థాయి అయిన 23,100 ఎగువన నిలదొక్కుకోవాలి. తదుపరి ప్రధాన నిరోధ స్థాయిలు 23,300. 23,600

**బేరిష్ స్థాయిలు:** ఏదేనీ బలహీనతను సూచిస్తే తదుపరి ప్రధాన మద్దతు స్థాయి 22,800. ఇక్కడ కచ్చితంగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనతను సూచిస్తుంది. తదుపరి ప్రధాన మద్దతు స్థాయి 22,400.

**బ్యాంక్ నిఫ్టీ:** ఈ వారంలో ఈ సూచీ సానుకూలత కోసం కీలకమైన 49,000 ఎగువన కన్సాలిడేట్ కావాల్సి ఉంటుంది. రికవరీ సాధిస్తే ప్రధాన నిరోధం 49,600 ఎగువన ఉంటుంది. ఇక్కడ నిలదొక్కుకుంటే తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 50,000. బలహీనతను సూచిస్తే మాత్రం 48,700 వద్ద మద్దతు స్థాయిలు ఉంటాయి.

**పాటర్న్:** మార్కెట్ 22,800 వద్ద డబుల్ బాటమ్ ప్యాట్రన్‌కు స్వల్ప ఎగువన ఉంది. ఇక్కడ బ్రేక్‌డౌన్ అయితే మరింత డౌన్‌సైడ్ బ్రేకౌట్ ప్యాట్రన్‌ను సూచిస్తుంది. అప్రమత్తంగా ఉండాలి. 23,100 వద్ద నిరోధం ఉంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి.

ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

| సోమవారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం | 23,040, 23,100 |
| మద్దతు | 22,870, 22,800 |

# అత్యధిక అప్పులు చేసిన.. మీరా మమ్మల్ని అనేది?

» రూ.125 లక్షల కోట్లు ఏం చేశారో.. మోదీ చెప్పాలి

» నిర్మలా సీతారామన్‌కు కేటీఆర్ బహిరంగలేఖ



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ పదేళ్ల పాలన తర్వాత కూడా తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రమే..! దేశచరిత్రలో అత్యధిక అప్పులు చేసిన మీరా(బీజేపీ).. మమ్మల్ని అనేది?" అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రశ్నించారు. అప్పులను, మిగులు బడ్జెట్‌తో ముడిపెట్టడం సమంజసం కాదన్నారు. ఈ మేరకు నిర్మలా సీతారామన్‌కు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. రాజ్యసభలో నిర్మల చేసిన వ్యాఖ్యలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. "బీఆర్ఎస్ హయాంలో.. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి లోబడి చేసిన అప్పును తప్పుగా చూపించే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. తెలంగాణ ఏర్పడిన సమయంలోనూ రాష్ట్రానికి దాదాపు రూ.70 వేల కోట్ల అప్పు ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. పదేళ్ల తర్వాత కూడా మిగులు బడ్జెట్ రాష్ట్రంగానే తెలంగాణను కాంగ్రెస్‌కు అప్పజెప్పాం. చేసిన అప్పులతో ప్రజల దశాబ్దాల కష్టాలను తీర్చాం. రాష్ట్రంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను ఉపయోగించాం" అని ఆ లేఖలో వెల్లడించారు. గడిచిన పదేళ్లలో మోదీ సర్కారు రూ.125 లక్షల కోట్ల మేర అప్పు చేసిందని, దాంతో ఏం చేశారో చెప్పాలని నిర్మలను నిలదీశారు. కేంద్రం చేసిన అప్పులన్నీ కార్పొరేట్ల లక్షల కోట్ల రుణాల మాఫీ కోసమేనని ఆరోపించారు. "స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి 14 మంది ప్రధానులు.. 65 ఏళ్లలో 56 లక్షలకోట్లు అప్పుచేస్తే.. మోదీ గడిచిన పదేళ్లలోనే రూ.125లక్షల కోట్ల చేశారు. బీజేపీకి అప్పులపై మాట్లాడే నైతిక హక్కు లేదు" అని వ్యాఖ్యానించారు. అటు కేంద్రబడ్జెట్‌లో, ఇటు రైల్వే కేటాయింపుల్లో బీజేపీ సవతి ప్రేమ కనబరుస్తోందని, రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బీజేపీని ప్రజలు క్షమించరన్నారు ఇక, తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడటం దారుణమని, రాష్ట్రానికి మీరిచ్చే బహుమానం ఈ అవమానాలేనా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్రబడ్జెట్‌లో పసుపుబోర్డుకు ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు.

### గురుకులాలు నిర్వీర్యం

గురుకుల విద్యాసంస్థలను రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్వీర్యం చేస్తోందని, కేటీఆర్ ఆరోపించారు. ఆదివారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఏడాదిలో 50 మందికి పైగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్, ఇతర కారణాలతో మరణించినా.. కాంగ్రెస్ సర్కార్‌లో కనీసం చలనంలేదన్నారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు కనీస పరామర్శ లేకపోగా.. అంత్యక్రియలకు పరామర్శకు వెళ్లే ప్రతిపక్షంపై ఈ ప్రభుత్వం నిర్బంధ చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.

## స్మగ్లర్లపై సినిమా తీస్తే ఏం ఉపయోగం?

» ఏపీ మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు వైరల్

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్మగ్లర్ల మీద సినిమాలు తీయడం వల్ల సమాజానికి ఏం ఉపయోగమని ఏపీ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. శనివారం ఆయన నంద్యాలలోని గురురాజా పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ఓటీటీల్లో వస్తున్న సినిమాలు యువతపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. పూలన్‌దేవి, వీరప్పన్ లాంటి స్మగ్లర్‌లపై సినిమాలు తీసి కోట్ల రూపాయలు గడిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి సినిమాల వల్ల సమాజానికి ముప్పే తప్ప ఎలాంటి ఉపయోగం లేదన్నారు.



ట్రంపెట్ జంక్షన్ ప్రస్తుతం ఇలా ఉంది



గతంలో విడుదల చేసిన ట్రంపెట్ జంక్షన్ ఊహాచిత్రం

## కోకాపేట ట్రంపెట్ జంక్షన్ సిద్ధం

హైదరాబాద్ మహానగరంలో మరో అద్భుతంగా నిలవనున్న కోకాపేట ట్రంపెట్ జంక్షన్ ప్రారంభానికి సిద్ధమవుతుంది. ఓఆర్ఆర్‌పై కోకాపేట నియోపోలిస్ లేఅవుట్‌ను అనుసంధానం చేస్తూ ట్రంపెట్ ఆకారంలో నిర్మిస్తున్న ఈ ఇంటర్‌ఛేంజ్ రహదారి పనులు తుది దశకు చేరుకోగా.. త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభింపజేయనున్నారు. - నార్సింగ్, ఆంధ్రజ్యోతి

# పీహెచ్‌సీలకు చుట్టాలుగా వైద్యులు!

**నిబంధనల ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు విధులు .. పలు జిల్లాల్లో తరచూ డాక్టర్ల డుమ్మా**

» 2-3 గంటలకు మించి ఉండని పరిస్థితి

» డాక్టర్లు లేక రోగులకు తీవ్ర ఇబ్బందులు

» సీసీ కెమెరాలున్నా పర్యవేక్షణ కరవు

» డీహెచ్ ఆఫీసులో మూలనపడ్డ కమాండ్ కంట్రోల్ సెంటర్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) జిల్లా కలెక్టర్ ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సంతోష్ విధులకు హాజరుకాలేదు సరికదా లీవు కూడా పెట్టలేదు. దాంతో కలెక్టర్ అతడిని సస్పెండ్ చేశారు. కొన్ని రోజుల క్రితం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని డిండి పీహెచ్‌సీని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డ్యూటీలో ఉండాల్సిన వైద్య సిబ్బంది లేకపోవడంతో ముగ్గుర్ని సస్పెండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మెజార్టీ పీహెచ్‌సీల్లో పరిస్థితి ఇలాగే ఉంది. వైద్యులు, వైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావటం లేదు. వచ్చినా.. ఇలా వచ్చి, అలా వెళ్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో అయితే వారానికి ఒకటి రెండుసార్లు కూడా డాక్టర్లు పీహెచ్‌సీలకు రావడం లేదు. వాస్తవానికి ప్రతీ పీహెచ్‌సీలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు ఉండాలి. కానీ, చాలా పీహెచ్‌సీల్లో రెండు మూడు గంటలకు మించి వైద్యులు ఉండటం లేదన్న విమర్శలున్నాయి. గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల్లోనైతే పరిస్థితులు మరీ అధ్వానంగా ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఉదయం వేళనే ఆస్పత్రులకు వస్తారు. కానీ, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు లేకపోవడంతో వారు ఊళ్లలోని ఆర్ఎంపీ వైద్యులనే ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితిని చూసి డాక్టర్లతో రోగులు గొడవ పెట్టుకుంటున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లోని ఓ పీహెచ్‌సీకి వచ్చే ఓ మహిళా డాక్టర్‌తో రోగులు వాదనకు దిగారు. ఎప్పుడొచ్చినా మీరు ఎందుకు ఉండటం లేదని నిలదీశారు.

### పని చేయని సీసీ కెమెరాలు



రాష్ట్రంలో 868 పీహెచ్‌సీలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో అన్ని పీహెచ్‌సీల్లో వైద్యుడు, ఫార్మసీ, ల్యాబ్ వద్ద మూడేసి చొప్పున సీసీ కెమెరాలు పెట్టి వాటిని హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుల (డీహెచ్) కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానించారు. రాష్ట్రంలోని ఏ పీహెచ్‌సీని అయినా అక్కడి నుంచి పర్యవేక్షించవచ్చు. కొన్ని రోజులు కొనసాగిన ఈ పర్యవేక్షణ ఇప్పుడు మూలనపడింది. దాంతో వైద్యులు విధులకు డుమ్మా కొడుతున్నారని తెలుస్తోంది. చాలా చోట్ల సీసీ కెమెరాలను పని చేయకుండా చేశారన్న విమర్శలున్నాయి.

### వైద్యులతో డీఎంహెచ్‌వోల కుమ్మక్కు!

డుమ్మా కొడుతున్న వైద్యాధికారులతో జిల్లా వైద్యాధికారులు కుమ్మక్కు అవుతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. విధులకు హాజరుకాని వైద్యులు డీఎంహెచ్‌వోలకు డబ్బులిచ్చి మేనేజ్ చేస్తున్నారని స్వయంగా ప్రజారోగ్య విభాగానికి చెందిన అధికారులే చెబుతున్నారు. వికారాబాద్ జిల్లాలో అత్యధిక పీహెచ్‌సీల్లోని డాక్టర్లు వారానికి రెండు మూడు రోజులే విధులకు హాజరు అవుతున్నట్లు ప్రభుత్వ పరిశీలనలో తేలింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి. మల్కాజ్‌గిరి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నిత్యం మధ్యాహ్నం తర్వాతే ఆస్పత్రికి వస్తారని ఫిర్యాదులుందాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో పోస్టింగ్ తీసుకున్న వైద్యుల్లో చాలా మంది మైదాన ప్రాంతాల్లో డిప్యూటేషన్ల మీద పని చేస్తున్నారు. ఇక, హైదరాబాద్, దాని చుట్టు పక్కల సుమారు 100 కిమీ.ల దూరంలో ఉన్న జిల్లాలకు చెందిన డీఎంహెచ్‌వోలు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగామ్ ఆఫీసర్లలో అత్యధికులు స్థానికంగా ఉండటం లేదు. హైదరాబాద్‌లో ఉంటూనే అప్పుడప్పుడూ విధులకు వెళ్లివస్తారని విమర్శలున్నాయి.

### పరిష్కారం ఇలా!

డుమ్మా డాక్టర్లకు చెక్ పెట్టాలంటే జీపీఎస్ విధానాన్ని అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం 9 గంటలకే సంబంధిత పీహెచ్‌సీ నుంచి డాక్టర్లు, వైద్య సిబ్బంది అంతా కలసి జీపీఎస్ ఫోటో తీసి డిప్యూటీ డీఎంహెచ్‌వోకు పంపాలి. మళ్లీ సాయంత్రం 4 గంటలకు మరో జీపీఎస్ ఫోటో పంపాలి. వాటిని డిప్యూటీ డీఎంహెచ్‌వో ధ్రువీకరించి డీఎంహెచ్‌వోకు పంపించాలి. ఆ జీపీఎస్ అటెండెన్స్ వివరాలను డీఎంహెచ్‌వో రాష్ట్రస్థాయిలో డీహెచ్‌కు పంపాలి. ఈ హాజరు ఆధారంగానే వైద్యులు, వైద్య సిబ్బందికి వేతనాలిచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే వ్యవస్థ బాగుపడుతుందని వైద్యనిపుణులు సర్కారుకు సూచిస్తున్నారు. విధులకు డుమ్మా కొట్టటం అనైతికమని, ప్రజలకు ఆరోగ్య సేవలు అందించటమనే పవిత్రమైన వృత్తిలో ఉన్న తాము ఇటువంటి తప్పుడు పనికి పాల్పడకూడదన్న విలువలను కూడా వైద్యులలో పెంపొందింపజేయాలని సూచిస్తున్నారు.

## వంశీ బ్యారక్‌కు పరదా!

» విజయవాడ జిల్లా జైలులో భద్రతా చర్యలు

» నేడు 164 వాంగ్మూలం నమోదుకు న్యాయాధికారి ముందుకు సత్యవర్ధన్

విజయవాడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని జిల్లా జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ బ్యారక్‌కు అధికారులు పరదాలు కట్టినట్టు తెలిసింది. భద్రతా చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుడు ముదునూరి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి బెదిరించి, కేసు నుంచి తప్పుకొనేలా చేశారన్న ఆరోపణలపై వంశీని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో న్యాయస్థానం రిమాండ్ విధించగా, జైలు అధికారులు ఆయనకు ఒకటో నంబరు బ్యారక్‌లో ఒక గదిని కేటాయించారు. అందులో ఉన్న వంశీ ఇతర ఖైదీలకు కనిపించకుండా కటకటాల వద్ద పరదా కట్టినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇతర ఖైదీలెవరూ వంశీ ఉన్న బ్యారక్ వైపు వెళ్లకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. బ్యారక్ వద్ద ఉన్న సీసీ కెమెరాల ద్వారా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

### కోర్టుకు సత్యవర్ధన్

ముదునూరి సత్యవర్ధన్‌ను న్యాయాధికారి ముందు సోమవారం ప్రవేశపెట్టడానికి పోలీసులు రంగం సిద్ధం చేశారు. వల్లభనేని వంశీ ఇచ్చిన ప్రణాళికలతో ఆయన అనుచరులు తనను బెదిరించి కిడ్నాప్ చేశారని, టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో తనకు సంబంధం లేదని చెప్పించారని సత్యవర్ధన్ వాంగ్మూలం ఇచ్చారు. ఈ వాంగ్మూలాన్ని సీఆర్పీసీ 164 కింద న్యాయాధికారి ముందు చెప్పాల్సి ఉంటుంది. పోలీసులు వంశీని విజయవాడలోని నాలుగో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. బాధితుడు సత్యవర్ధన్ వాంగ్మూలాన్ని ఈ కోర్టులో కాకుండా మరో కోర్టులో ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి పోలీసులు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌కు లేఖ రాశారు. సత్యవర్ధన్ నుంచి 164 వాంగ్మూలాన్ని నమోదు చేసుకునేందుకు కోర్టును కేటాయించాలని అందులో పేర్కొన్నారు. దీనిపై సీఎంఎం కోర్టు సోమవారం నిర్ణయం తీసుకుని కోర్టును కేటాయించే అవకాశాలు ఉన్నాయి.

# రాష్ట్రానికి రూ.10లక్షల కోట్లు ఇచ్చాం

» మరో రూ.10 లక్షల కోట్ల రుణ సాయం

» కేంద్ర మంత్రిగా ఏం చేశానో చర్చకు సిద్ధం

» నాసిరకం ఉక్కు వల్లే బయ్యారంలో.. ఫ్యాక్టరీ పెట్టలేదు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



వరంగల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర మంత్రిగా తెలంగాణ అభివృద్ధికి రూ.10లక్షల కోట్లు తీసుకు వచ్చాను. మరో రూ.10లక్షల కోట్ల రుణాలను రాష్ట్రానికి ఇప్పించాను. కేంద్ర మంత్రిగా ఏం చేయలేదని చెప్పే వాళ్లు దమ్ముంటే బహిరంగ చర్చ పెట్టండి.. నేను సిద్ధంగా ఉన్నా.' అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సవాల్ చేశారు. ఆదివారం హనుమకొండలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'రూ.7వేల కోట్లతో రామగుండంలో యూరియా ఫ్యాక్టరీని ప్రారంభించాం. రూ.816కోట్లతో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని ప్రారంభించాం. రూ.1.35లక్షల కోట్లతో రాష్ట్రంలో జాతీయ రహదారులను నిర్మించాం. మరో రూ.80వేల కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఆర్ఆర్ఆర్ కోసం రూ.7,500కోట్లు వెచ్చించాం. ట్రైబల్ వర్సిటీ కోసం 1,000కోట్లు ఇచ్చాం. ఇలా పదేళ్లలో అనేక అభివృద్ధి పనులకు కేంద్రం నిధులు ఇచ్చింది. బయ్యారంలో నాసిరకం ఉక్కు ఉండటం వల్లే ఫ్యాక్టరీ పెట్టలేకపోయాం. కేంద్రం ఫ్యాక్టరీ పెట్టకుంటే తామే.. పెడతామని 2018 ఎన్నికల్లో చెప్పిన కేసీఆర్.. ఆ పని ఎందుకు చేయలేదో చెప్పాలి..?" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

### తప్పుల తడకగా కులగణన..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనను బీజేపీ సమర్థిస్తుందని కిషన్‌రెడ్డి తెలిపారు. అయితే పూర్తి స్థాయిలో కుల గణన చేయలేదని, కులగణన మొత్తం తప్పుల తడకగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో ఏ ఒక్క బీసీ సంఘం కూడా కులగణనను సమర్థించటం లేదని అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌పై మొదట రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో బీసీ గణన పూర్తి చేసి, బీసీ సంఘాలను ఒప్పించి కేంద్రానికి బిల్లు పంపిస్తే, దాని ఆమోదానికి ప్రధానిని ఒప్పిస్తామని తెలిపారు. మోదీ కులంపై మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి.. ముందు రాహుల్ గాంధీ కులం చెప్పాలని డిమాండ్ చేశారు.

### ఏడాదిలోనే కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత..

కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయటం లేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు. పదేళ్లలో బీఆర్ఎస్‌పైన వచ్చిన వ్యతిరేకత.. 12 నెలల్లోనే కాంగ్రెస్‌పై వచ్చిందన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రతీవారం ఏదో ఒక సమస్యను తెరపైకి తెచ్చి ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ప్రతీవారం ఢిల్లీకి వెళ్లి హాజరు వేసుకునే సీఎం దేశంలో ఒక్క రేవంత్‌రెడ్డేనని విమర్శించారు. తెలంగాణలో జరుగుతున్న రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలోపే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నుకుంటామని కిషన్‌రెడ్డి తెలిపారు.



ముమ్మరంగా సాగుతున్న రైలు కోచ్‌ల తయారీ కేంద్రం పనులు

# కోచ్ హబ్‌గా కాజీపేట

**వ్యాగన్, ప్యాసింజర్, వందేభారత్ సహా.. ఈఎంయూ కోచ్‌ల తయారీకి రైల్వే ఆసక్తి**

» రైల్ మల్టిపుల్ మ్యాన్యుఫ్యాక్చర్ పరిశ్రమను.. ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో కేంద్రం ప్రకటన

» ఇప్పటికే శరవేగంగా కోచ్ ఫ్యాక్టరీ పనులు

» ఆగస్టులోపు వ్యాగన్, వచ్చే ఏడాది మార్చి.. నాటికి ప్యాసింజర్ కోచ్‌ల తయారీకి కసరత్తు

వరంగల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశంలో ఎక్కడా లేనివిధంగా రైల్ మల్టిపుల్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ పరిశ్రమను కాజీపేటలో ఏర్పాటు చేసేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కాజీపేటకు వ్యాగన్ తయారీ కేంద్రంతో పాటు ఇటీవలే కోచ్ ఫ్యాక్టరీని కూడా రైల్వే శాఖ మంజూరు చేసింది. అయితే బడ్జెట్‌లో కాజీపేట రైల్వే తయారీ పరిశ్రమను బహుళార్థకంగా వాడుకుంటామని కేంద్రం ప్రకటించింది. దీంతో ఇక్కడ వందేభారత్ రైళ్లతో పాటు ఇతర ప్యాసింజర్, గూడ్స్, ఈఎంయూ కోచ్‌లు కూడా సిద్ధం కానున్నాయి. దేశంలో ఇప్పటివరకు ఇలాంటి తయారీ కేంద్రం ఎక్కడా లేదు. ఈ అరుదైన అవకాశం కాజీపేటకు వస్తుండటంతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆశలున్నాయి.

### ముందు వ్యాగన్ తర్వాత కోచ్ ఫ్యాక్టరీ

2023 జూలై8న ప్రధాని మోదీ కాజీపేటలో వ్యాగన్ తయారీ పరిశ్రమకు భూమి పూజ చేశారు. 152 ఎకరాల్లో రూ.521కోట్ల అంచనా వ్యయంతో ఏటా 2,400 వ్యాగన్ల తయారీ సామర్థ్యం కలిగిన పరిశ్రమను 2025 మార్చి నాటికి ప్రారంభించాలని నిర్ణయించారు. 60శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఆగస్టు వరకు మిగతా పనులు పూర్తి చేసి, వ్యాగన్ల ఉత్పత్తి మొదలు పెట్టాలని రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీకి బదులు వ్యాగన్ పరిశ్రమను ఇచ్చిన కేంద్రం.. అనూహ్యంగా 2024 సెప్టెంబరు 9న ఆ కర్మాగారాన్ని కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేసింది. ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌ల తయారీకి యూనిట్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ కోచ్ ఫ్యాక్టరీ కోసం రూ.251కోట్ల నిధులను కేటాయించింది. వచ్చే ఏడాది మార్చి నాటికి కోచ్‌ల తయారీ మొదలయ్యేలా పనులు జరుగుతున్నాయి. వ్యాగన్ల తయారీతో పాటు వందేభారత్ కోచ్‌లను ఇక్కడే తయారు చేస్తారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. అయితే ఇటీవల బడ్జెట్‌లో రైల్వేశాఖ కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని మల్టిపుల్‌గా వాడుకుంటామని ప్రకటించింది. దీంతో వ్యాగన్లు, ప్యాసింజర్ బోగీలు, వందేభారత్ కోచ్‌లతో పాటు ఈఎంయూ వంటి ఎలక్ట్రిక్ కోచ్‌లను కూడా ఇక్కడే తయారు చేసేందుకు కేంద్రం ఆసక్తి చూపుతోందని తెలుస్తోంది.

### దేశంలోనే ఏకైక మల్టిపుల్ ఫ్యాక్టరీ..

రైల్వేశాఖకు చెన్నై, కపుర్తల, బెంగళూరు, పటియాల, చిత్తరంజన్, వారాణసి, రాయ్‌బరేలిలో మాత్రమే కోచ్ ఫ్యాక్టరీలున్నాయి. మరో 11చోట్ల వ్యాగన్ తయారీ పరిశ్రమలున్నాయి. అయితే దేశంలో ఎక్కడా మల్టిపుల్ రైల్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రం లేదని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. కోచ్ ఫ్యాక్టరీ కోసం తొలివిడతలో కేంద్రం రూ.251కోట్లను కేటాయించింది. వ్యాగన్ పరిశ్రమ కోసం ఏర్పాటు చేస్తున్న షెడ్లు, ట్రాక్‌లతో పాటు బోగీలకు పెయింట్ వేసే షెడ్లను కోచ్ ఫ్యాక్టరీకి కూడా వినియోగించుకోనున్నారు. తొలుత వ్యాగన్ పరిశ్రమ కోసం రూ.521కోట్లతో అంచనాలు రూపొందించినప్పటికీ, ప్రస్తుతం రూ.581కోట్ల వరకు పెరిగినట్లు సమాచారం. ఎలక్ట్రిక్ కోచ్‌లు, వందే భారత్ కోచ్‌లను కూడా ఇక్కడే తయారు చేయాలని రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. వీటికి మరో రూ.300కోట్లకు పైగా ఖర్చు కానుంది. మొత్తంగా రూ.1,200కోట్ల నుంచి రూ.1,500కోట్ల ఖర్చుతో కాజీపేటలో మల్టీపర్పస్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# నిరుద్యోగుల పక్షాన పోరాడాం

» కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు ఆ చరిత్ర లేదు

» కాంగ్రెస్‌కు దమ్ముంటే స్థానిక ఎన్నికలు పెట్టాలి

» కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సంజయ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షాన పోరాడి తాము లాఠీ దెబ్బలు తిన్నామని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులకు నిరుద్యోగుల పక్షాన ఉద్యమాలు చేసిన చరిత్ర లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు ఏనాడైనా నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయ పక్షాన పోరాటం చేశారా.? అని ప్రశ్నించారు. ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో సంజయ్ మాట్లాడారు. ప్రజా సమస్యలపై సోషల్ మీడియాలో పోస్టులు చేసిన బీజేపీ కార్యకర్తలపై నాటి బీఆర్ఎస్.. నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలు కేసులుపెట్టి వేధిస్తున్నాయని మండిపడ్డారు. తాము గ్రూప్-1 అభ్యర్థుల పక్షాన పోరాడితే.. తమ మధ్య చేరి విధ్వంసం సృష్టించాలని బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారని వెల్లడించారు. ప్రతి నెల 1న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు రావాలని పోరాడామని తెలిపారు. 317 జీవో దీక్ష నిర్వహిస్తే.. తన కార్యాలయ గేట్లను గ్యాస్‌కట్టర్లతో కోశారని తెలిపారు. తన ఆఫీసును జేసీబీతో కూల్చాలని కేసీఆర్ పోలీస్ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. అయినా ఏనాడూ భయపడలేదని, పోరాటాన్ని విరమించలేదని తెలిపారు. కాంగ్రెస్ నేతలు ప్రతి పనికి 14 నుంచి 18 శాతం కమీషన్ అడుగుతున్నారని సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టం చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. గ్యారెంటీలు, హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టి మరల్చే రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను గల్లా పట్టి నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సంజయ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే సత్వరం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సవాల్ చేశారు. ఓటమి భయంతోనే సర్కారు వెనకడుగు వేస్తోందని అన్నారు. పంచాయతీలకు సర్పంచ్‌లు లేకపోతే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావన్న సంగతి తెలిసి కూడా ఎన్నికలు నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తో

### బీసీ కులగణనకు వ్యతిరేకం కాదు : ఈటల

బీసీ కులగణనకు బీజేపీ వ్యతిరేకం కాదని, ఆ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించడానికి బీజేపీ సిద్ధంగా ఉందని ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. బీసీ కులగణనను చట్టబద్ధత కలిగిన సంస్థలతో చేయించి, దానికి అసెంబ్లీలో చట్టం చేస్తే, 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ బీజేపీ కార్యాలయంలో, భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఆదివారం ఈటల మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనను విస్మరించి.. ఢిల్లీ పెద్దల మెప్పు పొందడానికి డబ్బు సంచులతో వెళ్లి.. వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని విమర్శించారు.

### ప్రజల దృష్టిని మరల్చేందుకు సీఎం రేవంత్ యత్నం: లక్ష్మణ్

అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా.. హామీలను అమలు చేయకుండా.. ప్రజల దృష్టిని మరల్చేందుకు మూడు నెలలకోసారి సీఎం రేవంత్‌రెడ్డి ఏదో ఒక అంశాన్ని తెరపైకి తెస్తున్నారని ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. మొన్నటిదాకా హైడ్రా, మూసీ ప్రక్షాళన, ఇప్పుడు బీసీ కులగణన పేరుతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడారు. ఆదివారం నిజామాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. ఓట్ల కోసమే ముస్లింలను బీసీ జాబితాలో చేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. బీసీల హక్కులు, రిజర్వేషన్లను ముస్లింలకు అప్పజెప్పేందుకు రాహుల్‌గాంధీ సూచనతో రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ముస్లింలను చేర్చిన బీసీ బిల్లును కేంద్రానికి ఎలా పంపుతారని ప్రశ్నించారు. కేవలం బీసీల రిజర్వేషన్ల బిల్లును పంపితే కేంద్రంతో మాట్లాడి ఆమోదించేలా చూస్తామన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని ఎంపీ అర్వింద్ అన్నారు. ఉత్తర తెలంగాణలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు లేకపోవడమే అందుకు నిదర్శనమన్నారు.

## మహా కుంభమేళాకు తగ్గని భక్తుల రద్దీ

**ఆదివారం ఒక్కరోజే 1.36 కోట్ల మంది హాజరు**

ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 16: మహా కుంభమేళాకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. ప్రధాన రోజులు మౌనీ అమావాస్య, మాఘ పూర్ణిమ, వసంత పంచమి వంటి పర్వదినాలు ముగిసినా భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతున్నారు. ఆదివారం ఒక్క రోజే సాయంత్రం 6 గంటల వరకు కోటి 36లక్షల మంది ప్రయాగ్‌రాజ్‌కు వచ్చినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. దీంతో ఇప్పటి వరకు 52.83 కోట్ల మంది త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించారని వెల్లడించింది. ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే భక్తులందరూ సహకరించాలని, వారి వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేయాలని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సూచించారు. కాగా, శనివారం కూడా 1.36 కోట్ల మంది భక్తులు కుంభమేళాలో పుణ్య స్నానాలు చేశారు.

## కవితను చూసి ఆ ముగ్గురు నేర్చుకోవాలి

- కులగణనపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లది రాద్ధాంతం
- రెండేళ్లలో శ్రీశైలం సొరంగ మార్గం పనులు పూర్తి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కులగణనపై రాద్ధాంతం చేస్తున్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ఎమ్మెల్సీ కవితను చూసి నేర్చుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆ ముగ్గురూ కులగణనలో పాల్గొనలేదని, కవిత ఒక్కరే పాల్గొన్నారని చెప్పారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కులగణన సర్వేలో రాష్ట్రంలో 97% పాల్గొన్నారని తెలిపారు. ప్రజలందరి కోరిక మేరకు మిగిలిన 3శాతం మంది కోసం మళ్లీ సర్వే చేస్తామన్నారు. హైదరాబాద్ చుట్టూ నిర్మిస్తున్న రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)తో తెలంగాణ రాష్ట్ర ప్రగతి మరో మెట్టు ఎక్కుతుందని పేర్కొన్నారు. ఆర్ఆర్ఆర్ పనులను త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డుకు నడుమ నిర్మిస్తున్న రేడియల్ రోడ్లతో తెలంగాణ రూపురేఖలు మారడంతో పాటు హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందన్నారు. దశాబ్దాలుగా నల్లగొండ జిల్లాలో నెలకొన్న సాగు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు శ్రీశైలం టన్నెల్ బేరింగ్ మిషన్ పనులను ప్రారంభించామన్నారు. రెండేళ్లలో శ్రీశైలం సొరంగ మార్గం పనులను పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

- యువజన నేతలు సైనికుల్లా పనిచేయాలి: మహేశ్‌గౌడ్

మహేశ్వరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని, యువజన కాంగ్రెస్ నాయకులు సైనికుల్లా పనిచేయాలని, సీఎం రేవంత్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం గట్టుపల్లి గ్రామంలోని ఓ గార్డెన్‌లో ఆదివారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ యువక్రాంతి పేరుతో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రయోజనాల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడవకముందే 50 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. దేశంలో మోదీ శకం ముగిసిందని, ఇక భవిష్యత్ అంతా రాహుల్‌గాంధీదేనని పేర్కొన్నారు.

## గద్దర్ అవార్డులకు రూ.10 కోట్లు!

- 2025-26 బడ్జెట్‌లో ప్రతిపాదన

హైదరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సినీ రంగంలో ఇవ్వదలచిన 'గద్దర్ అవార్డు'ల కోసం 2025-26 బడ్జెట్‌లో రూ.10 కోట్లు ప్రతిపాదించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కోసం అన్ని శాఖలతో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సమాచార శాఖ, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లకు సంబంధించి బడ్జెట్ కేటాయింపులపై సమీక్షించారు. ఈ క్రమంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్‌కు కేటాయించే మొత్తం నిధుల్లో నుంచి గద్దర్ అవార్డుల కోసం రూ.10 కోట్లను ప్రతిపాదించినట్టు విశ్వసనీయ సమాచారం.

## సీఎం అన్నదాంట్లో తప్పేముంది?: మల్లు రవి

నాడు ఖరారు చేసిన కులాల్లో మోదీ కులం లేదు: చనగాని

హైదరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): 'ప్రధాని మోదీ పుట్టుకతోనే బీసీ కాదు.. ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బీసీ' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన దాంట్లో అవమానపరిచే అంశం ఏముందంటూ కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ప్రశ్నించారు. పుట్టకతో బీసీ కాకపోవడం వల్ల అణిచివేత, అవమానాలు ఆయనకు తెలియదన్నారు. అదే విషయాన్ని రేవంత్‌రెడ్డి ప్రస్తావించారని పేర్కొన్నారు. మోదీకి నిజంగా బీసీల పట్ల ప్రేమ ఉంటే జనగణనతో పాటుగా కులగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారుమండల్ కమిషన్ 1981లో ఖరారు చేసిన ఓబీసీ కులాల్లో ప్రధాని మోదీ కులం లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ అన్నారు. వాజ్‌పేయి హయాంలో 2001లో కేంద్ర ఓబీసీ జాబితాలో మోదీ కులాన్ని చేర్చారన్నారు. మోదీ కులం విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వాస్తవాలే మాట్లాడారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## తెలంగాణ నీటి ప్రయోజనాలకు ఏపీ గండి

- కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తోంది: హరీశ్ రావు



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నీటి ప్రయోజనాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గండికొడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తూ ఉండటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కృష్ణా జలాలను ఏపీ అడ్డూఅదుపూ లేకుండా తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏం చేస్తున్నారని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన ప్రశ్నించారు. 'మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువనుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది? 646 టీఎంసీలు తరలిస్తే ఎందుకు నోరుమెదపడం లేదు?' అని ఆయన నిలదీశారు. సాగర్ ఆనకట్ట కేంద్ర బలగాల ఆధీనంలో ఉందని, వారి పర్యవేక్షణలో మాత్రమే నీటిని విడుదల చేసుకోవాల్సి ఉన్నప్పటికీ ఏపీ మాత్రం ఇష్టారాజ్యంగా నీటిని తరలిస్తోందని ఆరోపించారు. తెలంగాణ తాగునీటి అవసరాలకు శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నిల్వ ఉంచాల్సిన కోటాను ఏపీ తీసుకెళ్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదన్నారు.

# అధికారులూ.. తప్పు!

(మొదటిపేజీ తరువాయి)

ఎలా ఉన్నారో, ఎలాంటి ముద్ర వేసుకున్నారో నేటి అధికారులు తెలుసుకోవాలని సూచించారు. గతంలో అధికారులు.. రాజకీయ నాయకులు ఏదైనా విషయాన్ని ప్రస్తావించినప్పుడు అందులోని లోటుపాట్లను, దాని వల్ల వచ్చే నష్టాన్ని చెప్పేవారని సీఎం రేవంత్ అన్నారు. చట్టవిరుద్ధంగా వెళితే భవిష్యత్తులో తలెత్తే సమస్యను వివరించేవారని, నాయకులను అప్రమత్తం చేస్తూ.. జరగబోయే పరిణామాలను గుర్తుచేసే వారని తెలిపారు. కానీ, ఈ రోజుల్లో అలా చెప్పడం తగ్గిపోయిందన్నారు. "ఇందుకు కారణమేంటో నాకు తెలియదు. కానీ, పొలిటికల్ ఎగ్జిక్యూటివ్‌ను సంతోష పెట్టాలనో లేక తనకు తాను సంతోషపడాలనో.. రాజకీయ నాయకులు తీసుకుంటున్న ప్రతి నిర్ణయాన్నీ అమలు చేస్తున్నారని అనుకుంటున్నా" అని రేవంత్ అన్నారు. ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ, వారి చదువు, అనుభవం వేర్వేరు కావచ్చునని, ఏమీ చదువుకోని వారికి విద్యాశాఖను కూడా ఇవ్వవచ్చని, పొలిటికల్ ఎగ్జిక్యూటివ్ జాబ్‌కు, వారి చదువుకు ఏమాత్రం సంబంధం ఉండదని పేర్కొన్నారు. అందుకే తమకు అవగాహన కల్పించడానికి సెక్రటేరియట్ బిజినెస్ రూల్స్ ప్రకారం అధికారులు అవసరమవుతారని తెలిపారు. వారు ఏ ఫైలు వచ్చినా.. అందులోని తప్పొప్పులను తమకు వివరించాలని అన్నారు.

### అలాంటి వారికి తప్పక గుర్తింపు ఉంటుంది..

నిబద్ధత కలిగిన అధికారులకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని సీఎం పేర్కొన్నారు. పేదలకు సాయం చేయాలన్న ఆలోచన అధికారులకు ఉండాలని, అలాంటివారే ప్రజల మనసులో నిలిచిపోతారని చెప్పారు. ఆ దిశగా రాష్ట్రంలోని అధికారులు దృష్టి సారించాలని తాను కోరుకుంటున్నానన్నారు. కలెక్టర్లు, ఎస్పీలను తరచూ మాజీ అధికారులతో సదస్సుల ద్వారా కలుసుకునే అవకాశం కల్పించాలని సీఎస్ శాంతికుమారికి సూచించారు. గోపాలకృష్ణనాయుడు తన ఆరు దశాబ్దాల అనుభవాన్ని గ్రంథ రూపంలో నిక్షిప్తం చేయడం పెద్ద టాస్క్ అని ప్రశంసించారు. దేన్నయినా కొనవచ్చునని, అనుభవాన్ని మాత్రం కొనలేమని పేర్కొన్నారు. సివిల్ సర్వెంట్లందరికీ ఈ పుస్తకం దిక్సూచిగా ఉంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శంకరన్, మన్మోహన్‌సింగ్, శేషన్‌లను గుర్తుకుతెచ్చుకోవాలని సీఎం సూచించారు. నిబద్ధతతో పనిచేసిన గొప్ప అధికారి శంకరన్ కాగా, పారదర్శక ఎన్నికల నిర్వహణకు కృషి చేసిన వ్యక్తి శేషన్ అని అన్నారు. దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపిన వ్యక్తి మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. అలాంటి సివిల్ సర్వెంట్ల అనుభవాల నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు.



మాజీ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ నాయుడు రచించిన 'లైఫ్ ఆఫ్ ఎ కర్మయోగి' పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి

# హైటెక్ కోర్టు!


(మొదటిపేజీ తరువాయి)

నూతన భవనాన్ని నిర్మించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. నిర్మాణం కోసం రూ.2,583 కోట్లు అవసరపడతాయని అంచనా వేసి, పరిపాలనపరమైన అనుమతులు కూడా ఇచ్చింది. నిరుడు భూమిపూజ, శంకుస్థాపనలు పూర్తయ్యాయి. భవన సముదాయం నిర్మాణం కోసం ప్రాథమికంగా రూపొందించిన నమూనా 'ఆంధ్రజ్యోతి'కి లభించింది. ఈ నమూనా ప్రకారం.. వందెకరాల్లో 36,52,840 చదరపు అడుగుల విస్తీర్ణంలో 10 బ్లాకులతో భవన సముదాయాన్ని నిర్మించనున్నారు. ప్రధాన ద్వారాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల తరహాలో నిర్మించనున్నారు. దీనిపై ఉన్నతాధికారులు, హైకోర్టు భవన నిర్మాణ కమిటీలు చర్చిస్తున్నాయి. ప్రధాన కోర్టు భవనాన్ని 8.4లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆరు అంతస్తుల్లో నిర్మించాలని ప్రతిపాదించారు. ప్రధాన న్యాయమూర్తి హాలు ఏ అంతస్తులో ఉండనుందనేది ఇంకా ఖరారు కాలేదు. అడ్వొకేట్ జనరల్ ఉండే బ్లాక్‌నూ ఆరు అంతస్తులతో 2.32 లక్షల చదరపు అడుగుల్లో నిర్మించనున్నారు. అడ్వొకేట్ జనరల్ బ్లాక్‌కు అదనంగా మరొక బ్లాక్‌ను1.1లక్షల చ.అడుగుల్లో, న్యాయవాదుల చాంబర్‌ను 1.58 లక్షల చ.అడుగుల్లో ఐదు అంతస్తులతో నిర్మించనున్నారు. ఇక 2.57లక్షల చ.అడుగుల్లో ఆరు అంతస్తులతో అడ్మిన్ బ్లాక్-1ను, అదనపు అడ్మిన్ బ్లాక్‌ను 1.42లక్షల చ.అడుగుల్లో ఐదు అంతస్తులతో, అడ్మిన్ బ్లాక్-2ను 1.4 లక్షల చ.అడుగుల్లో ఐదు అంతస్తులతో, 60 వేల చ.అడుగుల్లో రికార్డు రూమ్ బ్లాక్‌ను, 42,500 చ.అడుగుల్లో ఆడిటోరియం బ్లాక్‌ను, జీ ప్లస్ వన్‌గా నిర్మించనున్నారు. కోర్టుకు వచ్చే ప్రజల సౌకర్యాల కోసం 1.63లక్షల చదరపు అడుగుల్లో గ్రౌండ్ ప్లస్ రెండు అంతస్తులను నిర్మించనున్నారు.

| హైకోర్టు నూతన భవన వివరాలు.. |
|---|
| నిర్మాణ అంచనా: రూ.2,583 కోట్లు |
| నిర్మాణ స్థలం: 100 ఎకరాలు |
| నిర్మాణ విస్తీర్ణం: 36,52,840 చ.అడుగులు |
| హైకోర్టు నూతన భవనంలో బ్లాకులు: 10 |
| ప్రధాన కోర్టు బ్లాక్: 6 అంతస్తులు |
| ప్రధాన న్యాయమూర్తి నివాసం: 01 |
| ఇతర న్యాయమూర్తుల కోసం నివాసాలు: 63 |
| పార్కింగ్ స్థలం: 9.33లక్షల చ.అడుగులు |

### 63 మంది జడ్జిల కోసం నివాసాలు

హైకోర్టు నూతన భవన సముదాయంలో భాగంగా నిర్మించనున్న జడ్జిల నివాసాలూ విశాలంగానే ఉండనున్నాయి. ప్రధాన న్యాయమూర్తి బంగళాను 35,530 చదరపు అడుగుల్లో, ఆయన సెక్రటేరియట్‌ను 7,260 చ.అడుగుల్లో నిర్మిస్తారు. భవిష్యత్తులో జడ్జిల సంఖ్య పెరగనుండటంతో ఆ మేరకు ప్రధాన న్యాయమూర్తి మినహా మిగతా 63 మంది జడ్జిల క్వార్టర్స్ కోసం 2.67లక్షల చ.అడుగుల స్థలాన్ని కేటాయించారు. 96,500 చ.అడుగులతో జడ్జిల స్టాఫ్ క్వార్టర్స్‌ను, 14వేల చ.అడుగులతో క్లబ్ హౌస్‌ను, 9వేల చ.అడుగులతో కార్ల సర్వీస్ సెంటర్‌ను నిర్మించనున్నారు. మొత్తం నివాసాల నిర్మాణానికి 4,37,070 చ.అడుగుల స్థలాన్ని కేటాయించారు. జడ్జిలు, న్యాయవాదులు, కోర్టుకు వచ్చే ప్రజల వాహనాల పార్కింగ్ కోసం 9,33,640చ.అడుగుల స్థలాన్ని కేటాయించారు. ఒకేసారి 2800 వాహనాలు పార్క్ చేసేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఇతరత్రా అభివృద్ధి పనులకు 70,820 చ.అడుగుల, ఇతర సౌకర్యాల కోసం 12వేల అడుగుల స్థలాన్ని కేటాయించారు.



కాగా భవన సముదాయం కోసం 'ఆంధ్రజ్యోతి'కి లభించిన ప్రాథమిక నమూనాతో పాటు మరో రెండు నమూనాలను కూడా పరిశీలిస్తున్నారు. మూడు నమూనాల్లో ఒకదాన్ని ఖరారు చేశాక పనుల నిర్వహణకు టెండర్లను ఆహ్వానించనున్నారు. ఒప్పందాలు పూర్తయిన రెండేళ్లలోనే హైకోర్టు భవన సముదాయాన్ని పూర్తి చేయనున్నారు.

### ప్రధాన ద్వారానికి ఎడమ పక్కన గుడి

నూతన భవన సముదాయంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తుల నివాసాలు, ప్రధాన న్యాయమూర్తి సెక్రటేరియట్, ఆ సిబ్బంది నివాసాలతో పాటు పార్కు, క్లబ్ హౌస్‌లను నిర్మించనున్నారు. కోర్టు ప్రధాన ద్వారానికి ఎడమ పక్కన ఒక గుడిని నిర్మించనున్నారు. మొత్తంగా.. ప్రధాన ద్వారం, గుడి, సెక్యూరిటీ బ్లాక్, ఎలక్ట్రిసిటీ సబ్ స్టేషన్, బయో వ్యర్థాల కోసం ఏర్పాట్లు, రెండు పబ్లిక్ కారు పార్కింగ్ స్థలాలు, ఎత్తైన మెట్లతో ప్రధాన కోర్టులోకి వెళ్లే మార్గం, పబ్లిక్ సర్వీస్, సౌకర్యాలకు ఒక బ్లాక్, పబ్లిక్ ప్లాజా, ప్రధాన కోర్టు భవనం, న్యాయవాదుల చాంబర్, అడ్వకేట్ జనరల్ బ్లాక్, రెండు అడ్మిన్ బ్లాక్‌లు, ఆడిటోరియం, జడ్జిల ప్లాజా, క్లబ్ హౌస్, జడ్జిల నివాస సముదాయాలు, స్టాఫ్ క్వార్టర్స్. ఇలా మొత్తం 27 విభాగాలుగా భవన సముదాయాన్ని నిర్మించాలని ప్రతిపాదించారు.

## ఆర్ అండ్ బీలో కీలక పోస్టులు ఖాళీ

- ఈఎన్‌సీ, సీఈ, న్యాక్ డీజీ భర్తీ ఎప్పుడో!

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖలో రెండు కీలక పోస్టులు, ఇదే శాఖకు అనుబంధంగా ఉండే నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో మరో ముఖ్యమైన పోస్టు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీ ఎప్పుడన్నది తెలియడం లేదు. పూర్తి అదనపు బాధ్యతలు కూడా ఎవరికీ ఇవ్వలేదు. దాంతో ఆయా హోదాల్లో తీసుకోవాల్సిన నిర్ణయాలు పెండింగ్‌లో ఉంటున్నాయని తెలుస్తోంది. ఆర్ అండ్ బీలో ఇంజనీరు ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) పోస్టు కీలకం. వీటిలో ఈఎన్‌సీ అడ్మిన్ పోస్టులో ఉన్న అధికారే ఉద్యోగుల వ్యవహారాలు, బదిలీలు, పదోన్నతులు, సీనియారిటీ అంశాలతో పాటు శాఖ మొత్తాన్ని పర్యవేక్షిస్తారు. ఇటీవల ఈ పోస్టులో ఉన్న అధికారి పదవీ విరమణ చేశారు. కానీ ఇంతవరకూ మరో అధికారిని నియమించలేదు. రాష్ట్రంలో ఎమ్మెల్సీ కోడ్ ఉన్న కారణంగానే ఆ పోస్టును భర్తీ చేయలేదని అధికారిక వర్గాలు అంటున్నాయి. కోడ్ ఉన్నప్పటికీ కొంతమంది అధికారుల పోస్టులను మార్చడంతో పాటు ఇతర విభాగాల బాధ్యతలు కూడా అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ సమయంలో ఈఎన్‌సీ పోస్టును భర్తీ చేయకపోవడంతో కారణం ఏమై ఉంటుందనే చర్చ మొదలైంది. మరోవైపు, ఆర్ అండ్ బీ శాఖలో జాతీయ రహదారుల విభాగం కూడా కీలకంగా ఉంది. కేంద్రం నుంచి మంజూరయ్యే ప్రాజెక్టులు, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టదల్చిన జాతీయ స్థాయి పనులను ఈ విభాగమే పరిశీలిస్తుంది. ఈ విభాగం చీఫ్ ఇంజనీరు (సీఈ) పోస్టులో ఉన్న అధికారి కూడా ఇటీవల పదవీ విరమణ చేశారు. కానీ ఇప్పటివరకు భర్తీ చేయలేదు. కొంత మంది అధికారులకు కొన్ని విభాగాల బాధ్యతలు అప్పగించినా ఈ పోస్టును ఎవరికీ కేటాయించలేదు. దీంతో రాష్ట్రంలో ముమ్మరంగా జరుగుతున్న జాతీయ రహదారుల పనులపై పర్యవేక్షణ కొరవడిందనే ప్రచారం జరుగుతోంది. న్యాక్ డైరెక్టర్ జనరల్ పోస్టు కూడా ఖాళీగానే ఉండడం గమనార్హం. న్యాక్‌లో భవన, రహదారుల నిర్మాణంతో పాటు సాంకేతిక శిక్షణ కార్యక్రమాలు నడుస్తుంటాయి. ఈ కార్యక్రమాల్లో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం కూడా ఉంటుంది. వీటిని పర్యవేక్షించడం, ఇటు రాష్ట్రం, అటు కేంద్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకోవడంలో డీజీ పోస్టు కీలకం.

# రాహుల్‌ది బ్రాహ్మణ కుటుంబం

### ఆయనది హిందూ మతం.. కానీ.. ఆ కుటుంబం కులమతాలకతీతం

- రాజకీయం కోసం కులాన్ని వాడలేదు
- అడ్వాణీని మోదీ ప్రధానిని చేయగలరా?
- పీవీని ఐదేళ్లు, మన్మోహన్‌ను పదేళ్లు.. ప్రధానిగా ఉంచిన గుణం సోనియాది
- నిన్నగాక మొన్న పుట్టిన వ్యక్తి సంజయ్
- విమర్శించేటప్పుడు రాహుల్ కుటుంబ చరిత్ర తెలుసుకుని మాట్లాడాలి: జగ్గారెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీది.. బ్రాహ్మణ కుటుంబం, హిందూ మతం అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి చెప్పారు. అయితే రాజకీయం కోసం తమ కులమతాలను ఆ కుటుంబం ఎన్నడూ వాడుకోలేదన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన మహా సంగ్రామం లో పాల్గొన్న చరిత్ర రాహుల్‌గాంధీ కుటుంబానిదని తెలిపారు. రాహుల్‌గాంధీ కులం, మతం ఏంటంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై ఆయన ఈ మేరకు స్పందించారు. గాంధీభవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ముత్తాతలు మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూలు మహాత్మాగాంధీ నాయకత్వంలో స్వాతంత్ర్య పోరాటం చేశారని గుర్తు చేశారు. సహజంగా తండ్రి వారసత్వం కంటే తాత ముత్తాతల వారసత్వం ఇంకా బలమైందనీ.. ఆ వారసత్వాన్ని నిలబెడుతూ ప్రజల కోసం రాహుల్‌గాంధీ పోరాడుతున్నారన్నారు. "హిందూ ధర్మం ప్రకారం పెళ్లికి ముందు భార్యది ఏ కులమైనా పెళ్లయిన తర్వాత భర్తది ఏ కులమైతే అదే కులం ఆమెకు వర్తిస్తుంది. ఆ ధర్మం ప్రకారమే సోనియా.. రాజీవ్‌గాంధీని వివాహం చేసుకున్నాక సోనియాగాంధీగా మారారు. హిందూ ధర్మం గురించి కథలు చెప్పే బండి సంజయ్‌కు ఇది కూడా తెలియదా?" అని నిలదీశారు. రాజీవ్‌గాంధీ బ్రాహ్మణుడు.. హిందూ మతస్థుడైనప్పుడు సోనియాగాంధీ కూడా హిందూనే అవుతుందని పేర్కొన్నారు.

### పెళ్లి కాలేదు కాబట్టే రాహుల్‌కు జంధ్యం లేదు!

"ఇందిరాగాంధీ భర్త పేరు ఫిరోజ్ జహంగీర్ డాండీ. స్వాతంత్ర్యోద్యమంలో ఆయన మహాత్మా గాంధీ వెంట ఉండేవారు. గాంధీ సహచర్యం కారణంగా ప్రజలు ఆయన్ను ఫిరోజ్‌గాంధీగా పిలిచేవారు. ఆయన హిందూ మతాన్ని స్వీకరించి.. హిందూ మత సంప్రదాయాల ప్రకారమే ఇందిరప్రియదర్శినిని పెళ్లి చేసుకున్నారు. హిందూ మతం, బ్రాహ్మణ ధర్మం ప్రకారం జవహర్‌లాల్ నెహ్రూతో పాటు ఫిరోజ్ గాంధీ కూడా జంధ్యం ధరించారు" అని జగ్గారెడ్డి చెప్పారు. రాజీవ్‌గాంధీ, సంజయ్ గాంధీలకూ జంధ్యం ఉండేదన్నారు. రాహుల్‌గాంధీకి పెళ్లి కాలేదు కాబట్టి.. జంధ్యం లేదని, పెళ్లయ్యాక ఆయనా జంధ్యం ధరిస్తారని వివరించారు. ఇందిర, రాజీవ్‌లు దేశం కోసం తమ ప్రాణాలు కోల్పోతే.. రాజీవ్ మరణం తర్వాత సోనియా, రాహుల్‌లు ఏ పదవీ తీసుకోకుండా త్యాగం చేశారని కొనియాడారు. పీవీని ఐదేళ్లు, మన్మోహన్ సింగ్‌ను పదేళ్లు ప్రధానులుగా నిలబెట్టిన గుణం సోనియా, రాహుల్‌గాంధీలదని పేర్కొన్నారు. ఆ పదిహేనేళ్లలో సోనియా, రాహుల్‌లు ప్రధానులు కావాలంటే అడ్డుకునేవారు ఎవరున్నారని ప్రశ్నించారు. బీజేపీలో వాజ్‌పేయీ తర్వాత ఎల్‌కే అడ్వాణీ ప్రధాని కావాల్సి ఉన్నా.. ఆయన్ను పక్కన పెట్టి మోదీని ప్రధానిని చేశారన్నారు. ఈ 11 ఏళ్లలో అడ్వాణీని ప్రధాని పీఠం మీద కూర్చోపెట్టే ప్రయత్నం మోదీ ఎన్నడైనా చేశారా? అని ప్రశ్నించారు."రాహుల్, సోనియా త్యాగాల ముందు.. బీజేపీ నేతలు చేసిన త్యాగం ఒక్కటి చెప్పండి? గాంధీ కుటుంబంపై వేలెత్తి చూపే అర్హత మోదీ, అమిత్ షా, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి లేదు" అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతే మోదీ, అమిత్‌షాలు పుట్టారని, బీజేపీ కూడా స్వాతంత్రం వచ్చాక పుట్టిన పార్టీనేనని అన్నారు. బండి సంజయ్.. నిన్న మొన్న పుట్టిన నాయకుడని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాత్ర లేని వీరు.. గాంధీ కుటుంబాన్ని విమర్శించే వారయ్యారా అంటూ ధ్వజమెత్తారు.

# ఉద్యమంలా నేత్రదానం

- స్వచ్ఛందంగా ముందుకొస్తున్న గ్రామ ప్రజలు
- ఇప్పటికే 60 మంది మృతుల నుంచి సేకరణ
- హనుమకొండ జిల్లా ముచ్చర్ల వాసుల ఆదర్శం
- చైతన్యం నింపింది రవీందర్ అనే పెద్దాయనే!

హసన్‌పర్తి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): 'కనులు లేవని నీవు కలత పడవలదు.. నా కనులు నీవిగా చేసుకొని చూడు' అనే భరోసాను ఎవరో ఒకరు ఆచరణలోనూ పెడితే? దిగులు అనే చీకట్ల మధ్యే భారంగా కాలం వెళ్లదీస్తున్న వారికి సంతోషం అనే ఇంద్రధనస్సు వర్ణాలను చూపేందుకు ఎవరో ఒకరు దివిటీ పడితే? ఎవరో ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. మొత్తంగా ఆ ఊరి ప్రజలే సంకల్పించారు.. కళ్లులేని వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు నేత్రదానం చేస్తామని ప్రతినబూనారు. తమతో పాటు ఇంకొందరిని ఈ బృహత్కార్యంలో భాగస్వామ్యం చేస్తున్నారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని ముచ్చర్ల గ్రామ ప్రజలదీ ఆదర్శం. ఆ ఊరి ప్రజల్లో నేత్రదానంపై అవగాహనను కలిగించి.. వారిలో చైతన్యం నింపింది ఆ గ్రామానికి చెందిన మండల రవీందర్ అనే మనీషి నీటిపారుదలశాఖ ఇంజనీర్ అయిన రవీందర్, తన తల్లిదండ్రులు చనిపోయినప్పుడు వారి నేత్రాలను దానమిచ్చారు. ఇది తన కుటుంబానికే పరిమితం కావొద్దని సంకల్పించిన ఆయన, ఊర్లోని ప్రజలంతా నేత్రదానం చేసేలా అవగాహన సదస్సులు నిర్వహించారు. అది గొప్ప ఫలితాన్నిస్తోంది. వరంగల్ నగర పాలక సంస్థ విలీన గ్రామమైన ముచ్చర్ల జనాభా 3500. రవీందర్ చొరవతో గ్రామంలో ఇప్పటికే 45 మంది మృతుల నుంచి నేత్రాలను సేకరించగా, చుట్టు పక్కల గ్రామాల్లో మరో 15 మంది మృతుల నుంచి నేత్రాలను సేకరించారు. ముచ్చర్లలో నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడాన్ని రవీందర్ ఓ ఉద్యమంలా నిర్వహిస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు తరచూ ఆయన సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆయన ఈ ఆదర్శానికి పదిమంది తోడయ్యారు. వారు ఆయనతో చేతులు కలిపి.. నేత్రదానంపై ఊర్లో, చుట్టు పక్కల గ్రామాలైన పెంబర్తి, నాగారం, పలివేల్పుల, భీమారం, పెగడపల్లి తోపాటు జమ్మికుంట, బావుపేటలోనూ అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో ఎవరైనా చనిపోతే వారి ఇంటికి వెళ్లి విషాదంలో ఉన్న బాధితులను ఓదార్చుతూనే, మృతుల నుంచి కళ్లు సేకరిస్తే.. ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపొచ్చని చెబుతూ ఒప్పిస్తున్నారు. ముచ్చర్లలో 74 ఏళ్ల వృద్ధుడు మల్లారెడ్డి తన కుటుంబసభ్యులు ఐదుగురితో నేత్రదానం చేయించాడు. ఈ గ్రామంలో ఎవరు చనిపోయినా సదరు కుటుంబసభ్యులు తొలుత రవీందర్‌కు ఫోన్ చేస్తారు. ఆయన వెంటనే వరంగల్‌లోని ప్రాంతీయ కంటి ఆస్పత్రివారికి తెలియజేస్తారు. వారొచ్చి నేత్రాలను సేకరిస్తున్నారు. సమయం తక్కువగా ఉంటే రవీందర్ స్వయంగా తన వాహనంలోనే వెళ్లి సిబ్బందిని తీసుకొచ్చి నేత్రాలను సేకరించేందుకు సాయపడుతున్నారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి అందచేస్తున్నారు. నేత్రదానంపై అవగాహన పెరిగిన తర్వాత ముచ్చర్లతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు నేత్రదానానికి స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు.



ముచ్చర్ల గ్రామంలో నేత్రదానంపై ప్రచారం చేస్తున్న మండల రవీందర్, స్వచ్ఛంద కార్యకర్తలు.

# పెద్దగట్టుకు చేరిన దేవరపెట్టె

- ప్రారంభమైన పెద్దగట్టు జాతర
- 20వ తేదీ దాకా విజయవాడ హైవేపై ట్రాఫిక్ మళ్లింపు

సూర్యాపేట, కోదాడ, నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సమ్మక్క సారలమ్మ జాతర తరువాత రెండో అతిపెద్ద జాతరగా పేరొందిన సూర్యాపేట శ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతర ఆదివారం రాత్రి ప్రారంభమైంది. జాతరలో కీలకమైన దేవరపెట్టె (అందెనపు చౌడమ్మ, లింగమంతుల స్వామి ఉత్సవ మూర్తులు)కు ఆనవాయితీ ప్రకారం కేసారం గ్రామంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవరపెట్టెను ఊరేగింపుగా ఆదివారం అర్ధరాత్రికి దురాజ్‌పల్లిలోని పెద్దగట్టుకు చేర్చారు. దీంతో జాతర ప్రారంభమైనట్లు నిర్వాహకులు ప్రకటించారు. కేసారంలోని మెంతబోయిన వంశస్తులకు చెందిన దేవరగుడిలో దేవరపెట్టెకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మున్నా, గొర్ల, కులస్తులతోపాటు సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌శ్‌రెడ్డి, తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఇక, పెద్దగట్టు జాతర నేపథ్యంలో హైదరాబాద్- విజయవాడ మార్గంలో ట్రాఫిక్ మళ్లింపు చేస్తున్నామని కోదాడ డీఎస్పీ ఎం. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు కోదాడ సమీపంలోని బాలాజీనగర్ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్‌ను మళ్లించి, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కెట్‌పల్లి మీదుగా హైదరాబాద్‌కు పంపుతారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను కూడా అదే మార్గంలో కోదాడ వద్ద జాతీయ రహదారితో కలవనున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకు ఈ ట్రాఫిక్ మళ్లింపు ఉంటుంది.



కేసారంలో దేవరపెట్టె వద్ద పూజల్లో పాల్గొన్న నాయకులు



విష్ణు దంపతులతో వెంకయ్యనాయుడు, హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, ఏపీ మంత్రులు లోకేశ్, నారాయణ, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

## ఘనంగా వెంకయ్య మనవడి వివాహ రిసెప్షన్

» హాజరైన హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, లోకేశ్

వెంకటాచలం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనవడు, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీప, వెంకట్‌రావు దంపతుల కుమారుడు విష్ణు, సాత్విక వివాహ రిసెప్షన్ ఆదివారం నెల్లూరు జిల్లా వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఏపీ మంత్రులు నారా లోకేశ్, ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డి సహా పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పాల్గొని నవ దంపతులను ఆశీర్వదించారు.

## 'మాటా' అధ్యక్షుడిగా రమణకృష్ణ కిరణ్



సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ప్రముఖ తెలుగు సంఘం మన అమెరికన్ తెలుగు అసోసియేషన్(మాటా) నూతన అధ్యక్షుడిగా సంగారెడ్డికి చెందిన రమణ కృష్ణ కిరణ్ దుద్దాగి ఎన్నికయ్యారు. 2025-2026 సంవత్సరానికి గాను 250 మంది సభ్యులతో మాటా నూతన కార్యవర్గం కూడా ఏర్పాటైంది. అమెరికాలోని డల్లాస్‌లో జరిగిన సమావేశంలో రమణకృష్ణ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. మాటా వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ ఘనగోనితో పాటు ప్రదీప్ తమల జితేందర్ రెడ్డిలు సలహా మండలి సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. అలాగే మాటా ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్ గూడూరు, కార్యదర్శిగా విజయభాస్కర్, కోశాధికారిగా శ్రీధర్ గుడాల, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నగేష్ చిలకపాటి, నేషనల్ కోఆర్డినేటర్‌గా టోనీ జన్ను, జాయింట్ సెక్రటరీగా రాజ్ ఆనంద్, కమ్యూనిటీ సర్వీస్ డైరెక్టర్‌గా స్వాతి కళ్యాణ రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు. రమణకృష్ణ మాటా అధ్యక్షుడిగా ఎన్నికవ్వడంపై సంగారెడ్డి ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు.

## అంకుర సంస్థలూ సైబర్ భద్రత పాటించాలి

» సైబర్ ముప్పుల నుంచి రక్షణకు 'షీల్డ్-2025'

» రేపు ప్రారంభం: శిఖాగోయల్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ భద్రత అనేది పెద్ద కంపెనీలు, టెక్ దిగ్గజాలకే పరిమితం అనుకోకుండా ప్రతి స్టార్టప్ కంపెనీ దృష్టిసారించాలని, వాటి రక్షణ కోసం షీల్డ్-2025 పథకాన్ని తీసుకుని వస్తున్నామని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీపీ శిఖాగోయల్ తెలిపారు. ఈనెల 18 నుంచి రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో సైబర్ భద్రతా సదస్సు నిర్వహిస్తున్నామని ఆదివారం మీడియాతో చెప్పారు. స్టార్టప్ కంపెనీలు దేశానికి వెన్నెముక లాంటివని, ఇవి దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకుని వెళ్లే అభివృద్ధి యంత్రాలని ఆమె కొనియాడారు. ప్రస్తుతం దేశంలో లక్షా 40వేల స్టార్టప్ కంపెనీలున్నాయన్నారు. సైబర్ మోసాలు చిన్న పెద్దా తేడా లేకుండా అన్ని సంస్థలకు శత్రువులుగా మారాయని, ప్రారంభ దశలో పెద్ద నష్టాలను స్టార్టప్ కంపెనీలు భరించలేవని అన్నారు. షీల్డ్ 2025లో ప్రతి అంకుర సంస్థ నమోదు చేసుకుని రక్షణ పొందాలని సూచించారు. హెచ్ఐసీసీలో మంగళవారం షీల్డ్ సైబర్ భద్రతా సదస్సును సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభిస్తారని అందులో పాల్గొని సైబర్ భద్రతా పరిజ్ఞానం పొందాలని, అలాగే తమ బృందాలకు మెలకువలు నేర్పించాలని ఆమె సూచించారు.

## ఏసీబీ నుంచి ప్రభుత్వ అధికారులకు ఫోన్లు రావు

» నకిలీ అధికారులతో జాగ్రత్త: ఏసీబీ డీజీ విజయకుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ నుంచి ఏ ప్రభుత్వ అధికారికి ఫోన్లు రావని, అలా ఎవరైనా ఏసీబీ పేరు చెప్పి ఫోన్లు చేసి డబ్బు డిమాండ్ చేస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని ఏసీబీ డైరెక్టర్ జనరల్ విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నల్గొండ జిల్లాకు చెందిన ఒక తహసీల్దార్‌కు ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి తనను తాను ఏసీబీ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. తహసీల్దార్‌పై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, కేసు నమోదు కాకుండా చూడాలంటే డబ్బు పంపాలన్నాడు. విషయం తెలిసిన ఏసీబీ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. అవినీతి నిరోధక శాఖకు ప్రభుత్వ ఉద్యోగుల మీద ఫిర్యాదులు వస్తే రహస్యంగా విచారణ జరిపి ఆపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని, ఇలా ముందస్తు ఫోన్లు చేయడం ఉండదని ఏసీబీ డీజీ వివరించారు. నకిలీ ఏసీబీ అధికారుల గురించి సమాచారం ఇవ్వదలిచిన వారు టోల్ ఫ్రీ నెంబర్ 1064కు కానీ, వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వదలిస్తే 9440446106కు కానీ తెలియచేయాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచుతామని తెలిపారు.

## ప్రజాసొమ్ము ఎలా ఖర్చవుతుందో గమనించాలి

» నటుడు ప్రకాశ్‌రాజ్

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పాలన సజావుగా సాగించకుంటే ఓటమి తప్పదని విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ అభిప్రాయపడ్డారు. మంగళూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలిచినవారు రాజులు కారని, ప్రజాసేవకులన్నారు. ప్రజల సొమ్మును ఏ విధంగా ఖర్చు చేస్తున్నారో పరిశీలించుకోవాలన్నారు. తాము పన్నుల రూపంలో చెల్లించిన డబ్బును ప్రభుత్వాలు ఎలా ఖర్చు చేస్తున్నాయనేది ప్రజలు గమనించి, ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు.



## కలర్‌ఫుల్ కాలనీ!

ఈ ఫొటోల్లోని ఇళ్ల గోడలకు వేసిన రంగులు, రకరకాలు బొమ్మలు వెరైటీగా ఉన్నాయి కదూ! ఇది... మొన్నటిదాకా తిరుపతిలోనే అత్యంత మురికివాడ! పేరు.. స్కావెంజర్స్ కాలనీ. భరించలేని వాసన, చెత్త.. వాటి మధ్యే జీవనం. రోజువారీ వీధుల పరిశీలనలో భాగంగా ఇటీవల స్కావెంజర్స్ కాలనీకి వెళ్లిన తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య అక్కడి పరిస్థితులు చూసి చలించిపోయారు. స్మార్ట్ సిటీ-స్వచ్ఛ సర్వేక్షణ్ నిధులతో మురికివాడకు రంగులు వేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికీ అందమైన రంగులను వేయించారు. దీంతో స్కావెంజర్స్ కాలనీ సరికొత్త రంగులద్దుకుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

## మల్టీ లెవల్ మార్కెటింగ్.. 850 కోట్ల మోసం

(మొదటిపేజీ తరువాయి)

ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫాల్కన్ క్యాపిటల్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కావ్య నల్లూరిని శనివారం అదుపులోకి తీసుకున్నామని సైబరాబాద్ ఈఓడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ ఆదివారం ప్రకటించారు. ఈ కేసులో ప్రధాన నిందితులు, 'ఫాల్కన్' ఎండీ అమర్‌దీప్ కుమార్, సీఈవోలు ఆర్యన్ సింగ్, యుగేందర్ సింగ్.. పవన్ కుమార్, కావ్యతో కలిసి ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో మొబైల్ యాప్, వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. తమ సంస్థలో పెట్టుబడి పెడితే 45 నుంచి 180 రోజుల వ్యవధిలో 11 నుంచి 22% మేర లాభంతో విడతల వారీగా తిరిగిస్తామని ప్రచారం చేశారు. 2021 నుంచి డిపాజిట్ల సేకరణ మొదలుపెట్టారు. హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాలకు చెందిన 6,979 మంది నుంచి రూ.1,700 కోట్లు సేకరించారు. ఇందులో రూ.850 కోట్లను డిపాజిటర్లకు వెనక్కి ఇచ్చారు. మరో రూ.850 కోట్లు చెల్లింపులు చెయ్యాల్సి ఉంది. అయితే, కొంతకాలంగా చెల్లింపులు ఆపేసిన వీరు ఈ ఏడాది జనవరి 15న కార్యాలయాన్ని మూసేయగా.. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో జరిగిన మోసం బయటికొచ్చింది.

## వాహన ఫిట్‌నెస్.. ఇక ఆటోమేటిక్

(మొదటిపేజీ తరువాయి)



కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రవాణాశాఖ అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఒక్కో సెంటర్ ఏర్పాటుకు రూ.8 కోట్ల చొప్పున.. మొత్తం 14 కేంద్రాలకు రూ.112 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు ఏటీఎస్‌లు ఉన్నాయి. వీటి పనితీరును పరిశీలించేందుకు ఇటీవలే రవాణాశాఖ, రహదారులశాఖ అధికారుల బృందం ఒకటి అనకాపల్లిలోని ఏటీఎస్‌ను సందర్శించింది. ఆ కేంద్రాన్ని ఓ ప్రైవేటు సంస్థ నిర్వహిస్తోంది. ప్రైవేటు సంస్థతో ప్రభుత్వ ఒప్పందాలు, ఇతర అంశాలను పరిశీలించింది. దీనిపై ప్రభుత్వానికి ఓ నివేదికను అందజేయనుంది. ప్రభుత్వం ఈ నివేదికను పరిశీలించాక.. రాష్ట్రంలోనూ ఈ కేంద్రాలను ప్రవేశపెట్టేలా అధికారులు ప్రతిపాదనలను రూపొందించారు.

### అక్రమాలకు చెక్

రవాణాశాఖలో ఏజెంట్ల రాజ్యం గురించి తెలియంది కాదు..! డ్రైవింగ్ లైసెన్స్ మొదలు.. వాహనాల ఫిట్‌నెస్ వరకు ప్రభుత్వం నిర్ణయించే ధర ఒకటైతే.. ఏజెంట్లు దాన్ని నాలుగైదు రెట్లు పెంచి వసూలు చేస్తుంటారు. ఏటా విద్యాసంవత్సరం ఆరంభంలో స్కూలు బస్సులు, దసరా, సంక్రాంతి సమయంలో ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సులపై రవాణాశాఖ అధికారులు దాడులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే..! మిగతా సమయాల్లో వాటి గురించి పట్టించుకోరనే అపవాదులున్నాయి. ట్రక్కులు, లారీల సంగతి దేవుడెరుగు? ఇక రవాణాశాఖ కార్యాలయాల్లో ఫిట్‌నెస్‌ను మాన్యువల్‌గా నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూడా ఏజెంట్ల జోరు ఉందనే ఆరోపణలున్నాయి. ఫిట్‌నెస్ విషయంలో ఏటీఎస్‌లను అందుబాటులోకి తీసుకువస్తే.. వ్యవస్థలో పారదర్శకత ఉంటుందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది.

బాబోయ్ చికెన్..

# కొయ్యావోయి మటన్!



(మొదటిపేజీ తరువాయి)

మధ్య తరగతి ప్రజలు ఇప్పుడు కోళ్ల పేరెత్తితేనే వామ్మో అంటున్నారు! లైవ్, స్కిన్‌లెస్, బోన్‌లెస్.. ఇలా చికెన్ అమ్మకాల జాబితాలో రేట్లు బాగా తగ్గించినా కూడా ఆ షాపుల వైపే జనం వెళ్లడం లేదు. ఫలితంగా చికెన్ అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి. గతంలో గ్రేటర్ వ్యాప్తంగా రోజుకు సుమారు 6 లక్షల కిలోల వరకు చికెన్ అమ్మకాలు జరిగేవి. కొన్నాళ్లుగా అది 3-4 లక్షల కిలోలకే పరిమితమవుతోంది. ఎక్కువ ధర అని జడిసి పండుగలప్పుడు తప్ప మటన్, చేపలు తినని ప్రజలు ఇప్పుడు ఆ షాపులకే వెళ్తున్నారు. ప్రజల తాకిడిని ఆసరాగా చేసుకొని మటన్, చేపల వ్యాపారులు రేట్లు పెంచేసి అమ్ముతున్నారు. గతంలో మటన్ విత్‌బోన్ రూ.850, బోన్‌లెస్ రూ.950కు దొరికేది. ఆదివారం పలుచోట్ల విత్‌బోన్ 950, బోన్‌లెస్ రూ.1050కి కొన్నట్లు వినియోగదారులు చెప్పారు. మాంసాహార ప్రియుల్లో ఎక్కువమంది చేపల మార్కెట్లవైపే చూస్తున్నారు. బహుశా కిలో మటన్ కోసం రూ.950 ఏం పెడతాం? అని ఆలోచించారేమో.. ముక్కను ఇష్టపడేవారిలో ఎక్కువమంది చేపల మార్కెట్లకు పోటెత్తారు. నగరంలోనే అతిపెద్దదైన ముషీరాబాద్ చేపల మార్కెట్ ఆదివారం తెల్లవారుజామునే కొనుగోలుదారులతో కిటకిటలాడింది. సాధారణ రోజుల్లోనైతే ఈ మార్కెట్‌కు 20 టన్నుల చేపలు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతాయి. బర్డ్ ఫ్లూతో చికెన్ అమ్మకాలు పడిపోవడంతో ముషీరాబాద్ మార్కెట్‌కు వ్యాపారులు ఆదివారం 40 టన్నుల చేపలను తీసుకొచ్చారు. వారం రోజుల క్రితం ఇదే మార్కెట్‌లో కొర్రమీను కిలో రూ. 400 నుంచి రూ.450కి విక్రయించారు. ఇప్పుడేమో రూ. 500 నుంచి రూ. 600కు అమ్మారు. బొచ్చె కిలో రూ. 170 నుంచి 180 ఉండగా.. ఆదివారం రూ. 200కు విక్రయించారు. రవ్వ రూ.150 నుంచి 160కి, రొయ్యలు కిలో రూ. 450 వరకు విక్రయించారు. మార్కెట్‌కు పెద్ద ఎత్తున రొయ్యలు దిగుమతి అయినప్పటికీ మధ్యాహ్నం 12 గంటల లోపే అమ్మకాలు పూర్తయ్యాయి.



హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో మటన్ దుకాణం ఎదుట బారులు తీరిన ప్రజలు

### పాపం కూలీలు

రెక్కల కష్టం చేసి.. వచ్చే పైసలతో ఆ పూట పొట్టపోసుకునే కూలీలకు ఆదివారం వచ్చిందంటే అగ్గువకు దొరికే చికెనే విందు! అయితే బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో చికెన్ కొనేందుకు భయపడుతున్నారు. అటు మటన్, ఫిష్ కొనే స్తోమత లేక ఇబ్బందులుపడ్డారు. కొందరు.. తక్కువ ధరకు దొరికే తలకాయ కూర, బోటిని ఏదో కొన్నాం అంటే కొన్నాం అన్నట్లుగా ఓ పావుకిలో తెచ్చుకొని సరిపెట్టుకున్నారు.

### ధరలు పెంచినా చేపలు కొంటున్నారు



అటు బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో ఇటు చేపల ధరలు భారీగా పెరిగాయి. అయినా ప్రజలు పెద్ద ఎత్తున చేపలు కొంటున్నారు. ఆదివారం కావడంతో అర్ధరాత్రి నుంచే మార్కెట్‌లో అమ్మకాలు కొనసాగాయి. తెలంగాణ, ఏపీ నుంచి డీసీఎం, లారీల్లో చేపలు దిగుమతి అయ్యాయి.

-పూస గోరక్‌నాథ్, ముషీరాబాద్ చేపల మార్కెట్ వ్యాపారి

## డిస్కమ్‌ల నష్టాలు తడిసిమోపెడు!

» 2023-24నాటికి రూ.67,276 కోట్లకు చేరిక

» విద్యుత్ కొనేందుకు అధికంగా ఖర్చు చేయడమే కారణం

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కమ్)ల నష్టాలు తడిసిమోపెడవుతున్నాయి. 2023-24 సంవత్సరంనాటికి రాష్ట్రంలోని రెండు డిస్కమ్‌ల నష్టాలు రూ.67,276 కోట్లకు చేరడమే ఇందుకు తార్కాణం. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)కి 2025-26 సంవత్సరానికి సంబంధించి ఇటీవల తాము సమర్పించిన డిస్ట్రిబ్యూషన్ బిజినెస్, వీలింగ్ టారిఫ్ ప్రతిపాదనలపై వచ్చిన అభ్యంతరాలకు వివరణ ఇస్తూ ఈ వివరాలను డిస్కమ్‌లు వెల్లడించాయి. ఇందులో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) నష్టాలు రూ.47,239.15 కోట్లున్నాయి. ఈ సంస్థ 2023-24లో రూ.4,909.53 కోట్ల నికర నష్టాలను మూటగట్టుకుంది. ఇక ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) నష్టాలు 2023-24నాటికి రూ.20,036.92 కోట్లకు పెరిగాయి. 2023-24లో ఈ సంస్థ రూ.1,441.18 కోట్ల నికర నష్టాలను నమోదు చేసుకుంది. 2023-24లో రెండు డిస్కమ్‌ల నష్టాలు కలిపితే రూ.6,350.71 కోట్లుగా ఉన్నాయి. వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ కొనుగోళ్లకు అధిక వ్యయం చేయడం మూలంగానే ఈ మేరకు నష్టాలను చవిచూడాల్సి వచ్చినట్లు రెండు డిస్కమ్‌లు స్పష్టం చేశాయి. వివిధ గ్రాంట్లు, పథకాల కింద ప్రభుత్వం అదనపు సహాయాన్ని అందిస్తే నష్టాల నుంచి బయటపడతామని టీజీఎస్పీడీసీఎల్ పేర్కొంది.

## చంద్రగిరిలో జల్లికట్టు.. 40 మందికి గాయాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఏపీలోని తిరుపతి జిల్లా చంద్రగిరిలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. చంద్రగిరి పరిసర ప్రాంతాల నుంచి భారీగా ఎద్దులను తీసుకొచ్చారు. వాటి కొమ్ములు చెలిగి, రంగులు వేసి, కొప్పులను తొడిగి, రాజకీయ నాయకులు, సినీనటులు, దేవుళ్ల ఫొటోలు, రంగుల కాగితాలు అతికించిన చెక్క పలకలతోపాటు, నగదు, విలువైన వస్తు సామగ్రిని వాటికి కట్టారు. వీధిలో గుంపులుగా ఎద్దులను వదలడంతో వాటిని నిలువరించి కొమ్ములకున్న బహుమతులను చేజిక్కించుకునేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ క్రమంలో సుమారు 40 మందికి గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన వారిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.



జల్లికట్టులో ఎద్దును నిలువరించేందుకు ప్రయత్నిస్తున్న యువకులు



నల్లమలలోని ఫర్హాబాద్ వ్యూపాయింట్

## నల్లమలలో పర్యాటకం పరుగులు !

» 7,700 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్

» రోప్ కార్.. కృష్ణా నదిపై తీగల వంతెన

» చేయూత అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం

» పర్యాటక అభివృద్ధికి 242 కోట్లతో ప్రణాళిక.. 25 కోట్లు విడుదల రాష్ట్రం

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అబ్బురపర్చే పచ్చటి అందాలు.. ముచ్చట గొలిపే జలపాతాలు.. ఆహ్లాదపర్చే వాతావరణం.. అందమైన వన్యప్రాణులు.. ప్రముఖ శైవ క్షేత్రాలు.. ఇలా ప్రకృతి రమణీయతతో కట్టిపడేసే నల్లమల ఇక పర్యాటకులకు స్వర్గధామం కానుంది. ఈ ప్రాంతాన్ని దేశంలోనే పెద్ద పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి రాష్ట్రప్రభుత్వం ముందడుగు వేసింది. కేంద్రంకూడా ఇందుకు చేయూతనిస్తూ నల్లమలలోని అటవీ ప్రాంతం గుండా శ్రీశైలం వరకు రూ.7,700 కోట్ల వ్యయంతో హైవే ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని తలపెట్టడంతో నల్లమల రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ఇందులో భాగంగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం బ్రాహ్మణపల్లి నుంచి మన్ననూర్‌లోని కుంచోనిమూల, దుర్వాసుల చెరువు, ఫర్హాబాద్, వటువర్లపల్లి, దోమలపెంట మీదుగా ప్రత్యేకంగా బ్రిడ్జిని నిర్మిస్తారు. కృష్ణానదిపై తీగల వంతెన నిర్మించి శ్రీశైలానికి ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేస్తారు. దీని కారణంగా శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకునే భక్తులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా 24 గంటలు ప్రయాణం చేసే వెసులుబాటు కలుగుతుంది. అలాగే, నల్లమలలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.242 కోట్లతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. ఇందులో రూ.142 కోట్లు సాయం చేయాలని కేంద్రాన్ని అభ్యర్థించింది. కాగా, అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లు ఇప్పటికే విడుదల చేసింది. శ్రీశైలం ఉత్తర ద్వారం ఉమామహేశ్వరస్వామిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నందున ఇక్కడ ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలని పర్యాటక శాఖ భావిస్తోంది. ఇందుకోసం మన్ననూర్ కుంచోనిమూల నుంచి ఉమామహేశ్వర క్షేత్రం వరకు రోప్‌కార్ వ్యవస్థను రూపొందించాలని పర్యాటక శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది.

# ఇసుక రీచ్‌లలో ఇష్టారాజ్యం!

(మొదటిపేజీ తరువాయి)

లోడింగ్ చేస్తున్నారు. ఇక, కరీంనగర్ జిల్లాలోని వావిలాల, సూర్యాపేట జిల్లాలోని వంగమర్తి, ఖమ్మం జిల్లాలోని ఓ వాగులో ఉన్న ఇసుక రీచ్‌ల వివరాలు టీజీఎండీసీ వెబ్‌సైట్‌లో కనిపించవు. కానీ, ప్రతి రోజూ ఒక్కో ఇసుక రీచ్ నుంచి వందకుపైగా లారీలు ఇసుకను లోడింగ్ చేస్తున్నాయి. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష తర్వాత కరీంనగర్ జిల్లాలోని వావిలాల ఇసుక రీచ్‌లో లోడింగ్‌ను ఆపేశారు. కానీ, సూర్యాపేట జిల్లాలోని వంగమర్తి, ఖమ్మంలోని వాగులో నుంచి ఇసుక తరలింపు ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఖమ్మం జిల్లాలోని వాగు నుంచి తీసే ఇసుకను ఖమ్మం, కోదాడ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. పాత ఓఆర్‌డీలతో, ఒకే నంబర్ ప్లేట్‌తో పదుల సంఖ్యలో లారీలు తిరుగుతున్నాయి. ఇక, సూర్యాపేట జిల్లాలోని వంగమర్తి ఇసుక రీచ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండ జిల్లాలోని శివన్నగూడెం ప్రాజెక్టుకు కేటాయించింది. కానీ, లోడింగ్ కాంట్రాక్టర్లు లారీ యజమానులతో కుమ్మక్కై హైదరాబాద్‌కు ఇసుకను తరలించేస్తున్నారు. వంగమర్తిలో ఇసుకను లోడ్ చేసుకున్న వాహనాలను జీపీఎస్ ద్వారా మానిటరింగ్ చేసే వ్యవస్థను రూపొందించారు. అయితే, చౌటుప్పల్ దాటాక లారీల్లోని జీపీఎస్ యంత్రాలను తొలగించి.. కార్లలో శివన్నగూడెం ప్రాజెక్టు వరకు వెళ్తున్నారు. ఇసుక లారీలు మాత్రం యథేచ్ఛగా జీపీఎస్ లేకుండా రాజధానికి వస్తున్నాయి. ఇదంతా గత ప్రభుత్వ హయాం నుంచీ సూర్యాపేట, నల్లగొండ జిల్లాల ఆర్టీఏ, మైనింగ్ విజిలెన్స్, పోలీసు అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోంది.

### సన్న ఇసుక పేరిట వసూళ్లు

భూపాలపల్లి జిల్లాలోని బొమ్మాపూర్, ఎలికేశ్వరం ఇసుక రీచ్‌ల్లో దొడ్డు రకం ఇసుక దొరుకుతుందని ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. దొడ్డు ఇసుక కావాల్సిన లారీ యజమానులు బుకింగ్ చేసుకొని ఇసుక రీచ్‌లకు చేరితే వింత పరిస్థితి ఎదురవుతోంది. దొడ్డు ఇసుక స్థానంలో సన్న ఇసుక నింపుతున్నామంటున్న లోడింగ్ కాంట్రాక్టర్లు.. ఒక్కో లారీకి అదనంగా రూ.3-5వేల వరకు వసూలు చేస్తున్నారు. దీనిపై ఇటీవల కొందరు లారీల డ్రైవర్లు ఎదురుతిరగ్గా.. లోడింగ్ చేసేది లేదంటూ బొమ్మాపూర్ ఇసుక రీచ్ లోడింగ్ కాంట్రాక్టర్ వాగ్వాదానికి దిగారు. వాస్తవానికి ఇసుక సన్నదైనా, దొడ్డుదైనా టన్నుకు రూ.375 మాత్రమే టీజీఎండీసీ వసూలు చేస్తోంది. కానీ, ఇసుక రీచ్‌ల్లో సన్న ఇసుక అయితే అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు.

### నిబంధనల ప్రకారం వెళ్తే..

హైదరాబాద్‌లో ప్రస్తుతం సన్న ఇసుక టన్ను ధర రూ.1700, దొడ్డు ఇసుక టన్ను ధర రూ.1600 ఉంది. నిబంధనల ప్రకారం లోడింగ్ చేసుకొని వచ్చే లారీలకు ఒక ట్రిప్పుకు రూ.6వేలు కూడా మిగలడం లేదు. 12టైర్ల లారీకి ఆన్‌లైన్‌లో టీజీఎండీసీ నుంచి ఓడీఆర్ పొందేందుకు రూ.10,756 చెల్లించాలి. భూపాలపల్లి వెళ్లి వస్తే టోల్‌గేట్ల ఖర్చు రూ.2700, డీజిల్ ఖర్చు రూ.15వేలు, డ్రైవర్‌కు రూ.4500, లేబర్‌కు, కాంటా చార్జీలు ఇతరత్రా రూ.2200తో కలిపి రూ.35,156 దాకా ఖర్చవుతోంది. 26టన్నుల ఇసుకను రూ.1600 చొప్పున విక్రయిస్తే వచ్చేది రూ.41,600. ఈ విధంగా ఒక ట్రిప్పు ద్వారా నిబంధనల ప్రకారం లోడింగ్ చేసుకునే లారీ యజమానికి రూ.6,444 మాత్రమే మిగులుతోంది. ఈ క్రమంలో టైర్ పగిలినా.. మరమ్మతుకు గురైనా ఆ వచ్చే ఆదాయం కూడా రాదు. అదే 12టైర్ల లారీ ఓవర్ లోడ్‌తో వస్తే.. తక్కువ ధరకు విక్రయించినా రూ.10వేల నుంచి రూ.15వేల వరకు మిగులుతోంది. నిబంధనల ప్రకారం నడుచుకుంటున్న తమకు ఏమీ మిగలడం లేదని లారీల యజమానులు వాపోతున్నారు.

# అన్నను పొడిచి చంపిన తమ్ముళ్లు

### మేడ్చల్‌లో పట్టపగలు నడిరోడ్డుపై హత్య

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇంటిల్లిపాదిని తిడుతూ నిత్యం నానాయాగి చేస్తున్న అన్నను అతని తమ్ముళ్లే చంపేశారు. కత్తులతో వెంబడించి విచక్షణారహితంగా పొడిచి నడిరోడ్డుపైనే అతని ప్రాణం తీశారు. మేడ్చల్ పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో ఉమేశ్(30) అనే వ్యక్తి మరణించాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా, మాసిరెడ్డి గ్రామానికి చెందిన గన్య.. మేడ్చల్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఉద్యోగరీత్యా భార్య, కుమారులు ఉమేశ్, రాకేశ్, కుమార్తెతో కలిసి గన్య మేడ్చల్‌లో నివాసముంటున్నాడు. గన్య పెద్దకొడుకు ఉమేశ్(30)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, కుటుంబ కలహాల వల్ల మద్యానికి బానిసైన ఉమేశ్ మద్యం మత్తులో ఇంటికివచ్చి నిత్యం గొడవలు పడుతుంటాడు. అలాగే, ఆదివారం కూడా తప్పతాగి ఇంటికొచ్చిన ఉమేశ్.. తల్లి, భార్యను కొట్టడమే కాక ఇతర కుటుంబసభ్యులను దుర్భాషలాడాడు. దీంతో ఆగ్రహించిన అతని తమ్ముడు రాకేశ్, వారి బాబాయి కొడుకు లక్ష్మణ్‌తో కలిసి ఉమేశ్‌పై దాడి చేశాడు. వారి నుంచి తప్పించుకున్న ఉమేశ్.. మేడ్చల్ ఆర్టీసీ డిపో ముందున్న జాతీయ రహదారిపై పరుగులు తీశాడు. అయితే, ఉమేశ్‌ను అడ్డుకున్న రాకేశ్, లక్ష్మణ్ తమ వెంట తెచ్చుకున్న కత్తులతో అతనిపై విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యారు. దాదాపు 12 కత్తిపోట్లకు గురైన ఉమేశ్ ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఉమేశ్‌ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించాడని వైద్యులు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. కాగా, ఈ దారుణాన్ని చూసిన స్థానికులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. దాడిని అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించినా ఆపలేకపోయారు.



ఉమేశ్‌పై దాడి చేస్తున్న రాకేశ్, లక్ష్మణ్



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.